www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 68 | సంచిక : 200 | శనివారం 12-01-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | వెల: రూ.4.00 | పేజీలు: 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ మందుబాబులతో పీకలదాకా తాగిస్తోంది. దాని ద్వారా వచ్చే ఆదాయాన్ని గణనీయంగా పెంచుకుంటోంది. ఇదే సందర్భంలో అనారోగ్యానికి గురైన వారి వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం అందచేసే సీఎం సహాయ నిధికి తన వాటాను భారీ మొత్తంలో చెల్లిస్తూ ఉదారతనూ చాటుకుంటోంది. సీఎం సహాయ నిధికి ఈ శాఖ నెలకు రూ.24 కోట్ల చొప్పున ఏడాదికి రూ.288 కోట్లు చెల్లిస్తోంది. ఈ శాఖకు వచ్చే ఆదాయంలో ఏటా 1 నుంచి 2 శాతం వాటాను సీఎం సహాయ నిధికి అందచేస్తోంది.

తాగిస్తాం.. గిఫ్టిస్తాం!



- 'న్యూఇయర్ గిఫ్ట్'గా రూ. 50 కోట్ల అదనపు చెల్లింపు
- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ వింత పోకడ

సీఎం సహాయ నిధికి రూ.288 కోట్లు జమ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి :
ఇటీవల న్యూఇయర్ వేడుకల సందర్భంగా భారీగా అమ్మకాలు జరపడంతో వచ్చిన ఆదాయంలో అదనంగా రూ.50 కోట్లను సీఎం సహాయ నిధికి జమ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మద్యం అమ్మకాల ద్వారా సాధారణంగా రోజుకు రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్ల వరకూ ఆదాయం లభిస్తుంది. డిసెంబరు 30వ తేదీ నుంచి జనవరి 1వ తేదీ వరకూ మూడ్రోజుల్లో రూ.186 కోట్లు రాగా అనధికార విక్రయాల వల్ల రూ.200 కోట్ల నుంచి రూ.250 కోట్ల ఆదాయం సమకూరినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో ప్రతి నెలా సీఎం సహాయ నిధికి చెల్లించే వాటా రూ.24 కోట్లకు అదనంగా మరో రూ.50 కోట్లను అందచేసింది. ఈ మేరకు రెవెన్యూశాఖ (ఎక్సైజ్) స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ డి.సాంబశివరావు గురువారం జీవో ఎంఎస్ నంబరు 13ను జారీ చేశారు.

ఆదాయ వనరు కాదంటూనే...
మద్యం ఆదాయ వనరుకాదంటూనే చంద్రబాబు ప్రభుత్వం - మిగతా 2 లో

మనస్థాపంతో అలోక్ వర్మ
రాజీనామా



- మోడీ సర్కారు వేధింపులే కారణం
- వివరణకు అవకాశం ఇవ్వలేదంటూ ఆవేదన
- కొత్త పదవి చేపట్టకుండానే...

న్యూఢిల్లీ :
కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) డైరెక్టర్ పదవి నుంచి తొలగించడం, అగ్నిమాపక శాఖకు బదిలీ చేయడంతో తీవ్ర మనస్థాపానికి గురైన అలోక్ వర్మ తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. నూతన బాధ్యతలను చేపట్టకుండానే సర్వీసు నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. అగ్నిమాపక సేవలు, సివిల్ డిఫెన్స్, హోంగార్డ్ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు స్వీకరించాలంటూ వర్మను ఉన్నతస్థాయి ప్యానల్ ఆదేశించింది. సీబీఐ చీఫ్‌గా తనను తప్పించడంపై న్యాయపోరాటంలో అలోక్ నెగ్గినా ప్రభుత్వం తిరిగి వేటు వేయడంతో - మిగతా 2 లో

మోడీ చట్ట ధిక్కారం

డా.కె.నారాయణ నిశిత విమర్శ



2లో



60 మంది అరెస్టు

- క్యూనెట్ కుంభకోణం కేసులో పురోగతి
- 42 మంది తెలంగాణ, ఐదుగురు ఏపీ వాసులు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ :
క్యూనెట్ కుంభకోణంలో 60 మంది నిందితులను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.2.07 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. క్యూనెట్ మోసగాళ్ల బ్యాంక్ ఖాతాలను సీజ్ చేశారు. అతి తక్కువ నగదును డిపాజిట్ చేస్తే భారీగా లాభాలు ఇస్తామంటూ మోసం చేసిన క్యూనెట్ మల్టీ లెవల్ మార్కెటింగ్ కేసులో సైబరాబాద్ పోలీసులు విచారణను ముమ్మరం చేశారు. 40 బ్యాంక్ ఖాతాలను సీజ్ చేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ పలువురు బాధితులు సైబరాబాద్ కమిషనరేట్‌కు క్యూ కడుతున్నారు. హాంకాంగ్ అడ్డాగా భారతదేశంలో క్యూనెట్ సంస్థ మోసాలకు పాల్పడింది. దీనిని వేల కోట్ల కుంభకోణంగా పోలీసులు అనుమానిస్తున్నారు. మాదాపూర్, అమీర్‌పేట, - మిగతా 2 లో

అధికారమిస్తే హోదా ఇస్తా

- దుబాయ్ నిర్మాణంలో మీ పాత్ర అమోఘం
- మీ ఇబ్బందులు తెలుసుకోవడానికే వచ్చా
- దుబాయ్‌లో భారత కార్మికులతో రాహుల్ మాటామంతి



న్యూఢిల్లీ :
వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తమకు అధికారం కట్టబెడితే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక తరగతి హోదా ఇచ్చి తీరతామని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ మరోసారి హామీ ఇచ్చారు. రెండు రోజుల పర్యటన కోసం యూఏఈ వెళ్లిన రాహుల్‌గాంధీ దుబాయ్‌లోని లేబర్ కాలనీలో భారతీయ కార్మికులతో శుక్రవారం సమావేశమయ్యారు. అతి త్వరలో తమ పార్టీ అధికారంలోకి వస్తుందని, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తుందని రాహుల్ భరోసా ఇచ్చారు. 2014 జూన్ 2న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయింది. 'మీరు భారత్‌కు, భారత్‌లోని రాష్ట్రాలు, పేదలు, దుబాయ్ నగరం అభివృద్ధి కోసం పాటుపడుతున్నారు. ప్రపంచంలోనే గొప్ప నగరం దుబాయ్. మీకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుతున్నా'నని రాహుల్ చెప్పారు. యూఏఈ అభివృద్ధిని ప్రశంసిస్తూ 'ఇక్కడ జరిగిన అభివృద్ధిని మీరు చూశారు. పెద్దపెద్ద భవనాలు వెలిశాయి. విమానాశ్రయాలు ఏర్పాటు చేశారు. మెట్రో నిర్మాణం జరిగింది. మీ పాత్ర లేకుండా ఇంత అభివృద్ధి జరగలేదు' అని అన్నారు. 'ఈ నగరం అభివృద్ధిలో మీ స్వేదం, రక్తం ఉన్నాయి. మీరు భారతీయులైనందుకు గర్వపడుతున్నా'నని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక తరగతి హోదా కోసం గతేడాది మార్చిలో జంతర్ మంతర్ వద్ద కొంతమంది ఆందోళన చేశారని, ఆ ధర్నాలోనే తాను ఏపీకి ప్రత్యేక హోదాపై హామీ ఇచ్చానని గుర్తుచేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే తాను చేసే మొదటి పని - మిగతా 2 లో

పింఛను ఇక రెండు వేలు

వృద్ధులు, వికలాంగ, వితంతువులకు ఇచ్చే మొత్తం రెట్టింపు

- ఈ నెల నుంచే అమలు
- వెయ్యి బోనస్‌తో వచ్చే నెలలో రూ.3 వేలు
- 60 వేల మందికి డీకేటీ పట్టాలు
- బోగోలులో గిరిజన రెసిడెన్షియల్ పాఠశాల
- జువ్వలదిన్నె అభివృద్ధికి రూ.110 కోట్లు
- భవిష్యత్తులో విద్యుత్ చార్జీలు పెంచబోం
- సీఎం చంద్రబాబునాయుడు



విశాలాంధ్ర - నెల్లూరు బ్యూరో :
ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నెల్లూరు జిల్లా పర్యటనలో వరాల జల్లు కురిపించారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఇచ్చే పింఛను మొత్తాన్ని రెండు వేల రూపాయలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. పేదలకు కన్నీళ్లు రానివ్వబోమని, రూ.1,000 బోనస్‌తో ఫిబ్రవరి నెలలో రూ.3,000 పింఛను అందిస్తామన్నారు. ఉద్యోగులకు వేతనాలు ఇస్తున్నట్లుగానే వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ప్రతి నెల ఒకటో తేదీన పింఛను అందిస్తున్నామన్నారు. మార్చి నుంచి ప్రతి నెలా ఒకటో తేదీనే రూ.2 వేల పింఛను అందించనున్నట్లు సీఎం చెప్పారు.

నెల్లూరు జిల్లా బోగోలు మండలంలో ముఖ్యమంత్రి శుక్రవారం పర్యటించారు. ముందుగా జువ్వలదిన్నె చేరుకుని అక్కడ శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆవిష్కరించారు. పలు అభివృద్ధి పనులతోపాటు అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ భవనాలకు శంకుస్థాపన చేశారు. రైతులకు సీజేఎఫ్ భూములకు సంబంధించి డీకేటీ పట్టాలు పంపిణీ చేశారు. దామవరంలో ఎయిర్‌పోర్టుకి - మిగతా 3 లో



2021 డిసెంబరులో 'గగన్‌యాన్'

ముగ్గురు వ్యోమగాముల్లో మహిళ కూడా..
ఇస్రో చైర్మన్ శివన్

9లో



నళినీ చిదంబరంపై చార్జిషీట్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ, జగదీష్ తదితరులు

వచ్చే ఎన్నికల్లో మో'డీలా'...!

శివరామన్



- కేంద్ర సర్కారుపై కార్మికుల సమ్మె తీవ్ర ప్రభావం
- అన్నివర్గాల్లో వ్యతిరేకత వ్యక్తం
- కార్మిక సంఘాల ఐక్యతపై కమలనాథుల్లో కలవరం

దేశవ్యాప్తంగా జనవరి 8, 9 తేదీల్లో జరిగిన కార్మికుల సమ్మె ప్రభావం రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిధ్వనిస్తుందా? సార్వత్రిక ఎన్నికలకు మూడు మాసాల ముందు రెండు రోజుల పాటు జరిగిన ఈ సమ్మె సర్కారుపై వ్యతిరేకతకు అద్దం పట్టిందంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు. సమ్మె పూర్తిగా విజయవంతమైందా లేదా అనే సాంకేతికతను పక్కన పెడితే.. దేశవ్యాప్త సమ్మెపై అంతర్జాతీయ మీడియా పతాకస్థాయిలో స్పందించింది. సుమారు 20 కోట్ల మంది ఈ సమ్మెలో పాల్గొన్నారు. పరిశ్రమల్లో కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, అసంఘటిత కార్మికులు కదం తొక్కగా... రైతులూ సంపూర్ణ మద్దతు తెలిపారు. నిజానికి సమ్మె తొలిరోజున దేశవ్యాప్తంగా మిశ్రమ స్పందన కనిపించినప్పటికీ.. దేశవ్యాప్తంగా కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు సంఘటితంగా పాల్గొన్నట్టు వార్తలు వెలువడ్డాయి. కానీ ప్రధాన రాజకీయ పక్షాలు లేకుండా కేవలం వామపక్షాల ఆధ్వర్యంలో పది కార్మిక సంఘాలు సమ్మెను విజయవంతంగా ముందుకు నడిపాయి. ఓట్ల బలంలో బలహీనంగా కనిపిస్తున్న వామపక్షాలకు ఈ సమ్మె గొప్ప విజయమే. ఒకరకంగా బ్యాంకులు, రవాణా, టెలికం తదితర ప్రభుత్వ రంగ సంస్థల్లోని కార్మిక సంఘాల ఫెడరేషన్లే ఈ సమ్మె జయప్రదం కావటానికి కారణం. ఈ సంస్థల్లోని కార్మికులు సమ్మె కట్టడంతోనే ఆందోళన తీవ్రస్థాయికి చేరింది. ఐదేళ్ల నరేంద్ర మోడీ పాలనపై కార్మికవర్గాల్లో పెల్లుబికిన వ్యతిరేకతకు ఈ సమ్మె ప్రతిబింబం. కార్మికులు, కర్షకులు, ఉద్యోగుల్లో కేంద్ర ప్రభుత్వంపై క్రమేపీ పెరిగిన వ్యతిరేకతకు ఈ సమ్మె నిదర్శనంగా నిలుస్తోంది. కార్మిక సంఘాల అంచనాలకు మించి సమ్మెకు స్పందన లభించింది. అనేక పత్రికలు, టీవీ చానల్స్ ఏకంగా భారత్ బంద్‌గా అభివర్ణించాయి. వాస్తవానికి దేశవ్యాప్తంగా రెండురోజుల సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపునివ్వగా.. అన్ని రంగాల్లో కార్యకలాపాలు స్తంభించటంతో క్షేత్రస్థాయిలో బంద్ వాతావరణం కనిపించింది. ఉత్తర భారతదేశంలోనూ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళలో ఏకంగా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. దుకాణాలు మూసివేశారు. చెన్నై సహా అనేక నగరాల్లో 50 శాతమే ప్రజా రవాణ సంస్థ బస్సులు నడిచాయి. ఆటో రిక్షాలూ నడవలేదు. సమ్మెకు మద్దతుగా అనేక ప్రాంతాల్లో ధర్నాలు, రాస్తారోకోలు, రైల్‌రోకోలు జరిగాయి. ఇక బ్యాంకు ఉద్యోగులు రెండు రోజుల సమ్మె ప్రకటించటంతో సార్వత్రిక సమ్మెకు బలం చేకూరింది. దీంతో సమ్మె తారాస్థాయిలో జరుగుతుందని వ్యాపారవర్గాలు భావించాయి. సర్వ శ్రామిక్ సంఘటన్ అధ్యక్షుడు ఉదయ్ భట్ వివరాల ప్రకారం...

ఆర్థిక రాజధాని ముంబైలో దేశవ్యాప్త సమ్మె రోజునే బృహన్ ముంబై ఎలక్ట్రిసిటీ స్టేట్ ట్రాన్స్‌పోర్టు కార్మికులు కూడా పలు డిమాండులతో నిరవధిక సమ్మెలోకి దిగారు. సుమారు 10 వేల బస్సులు ఇప్పటికీ నడవటం లేదు. ఆటో రిక్షాలూ కదలని స్థితి. గడచిన రెండు దశాబ్దాల్లో ముంబై నగర పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇక్కడ పారిశ్రామిక విస్తరణ జరగలేదు. థానే పారిశ్రామికవాడ ఉన్నప్పటికీ ముంబైలో ఎలాంటి పరిశ్రమ మనకు కనిపించదు. ఐటీ కంపెనీలన్నీ పురాతన పరిశ్రమల భూముల్లో నెలకొల్పారు. ముంబై పరిసర జిల్లాలు, పూణేకు అనేక పరిశ్రమలను తరలించారు. బ్యాంకులు, టెలికం, మున్సిపల్ ఉద్యోగులు పూర్తిగా బెస్ట్ బస్సులపై ఆధారపడ్డారు. విధులకు వెళ్లాలంటే బెస్ట్ బస్సులే దిక్కు. ఐటీ ఉద్యోగుల్లా సొంత - మిగతా 2 లో

ఇదీ లోకం!



ఇదంతా ఎన్నికల స్కెచ్

- కోటా వెనుక ఎత్తులు, జిత్తులు
- ఆ మూడు రాష్ట్రాల్లో ఓటమితో మోడీకి వణుకు
- సుప్రీంను అవమానించిన ప్రధాని
- టీడీపీ నేతల భూ దోపిడీ
- కరవుపై అమరావతిలో నిరసనలు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నిశిత విమర్శ

విశాలాంధ్ర బ్యూరో - అనంతపురం
అగ్రవర్ణ పేదల రిజర్వేషన్ల బిల్లు తీసుకురావడం వెనుక పెద్ద కుట్ర దాగుందని, 2019 ఎన్నికలలో అగ్రకులాల ఓట్లు గంపగుత్తగా పొందడం కోసం ప్రధాని నరేంద్రమోడీ పెద్ద ప్రణాళిక వేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నిశితంగా విమర్శించారు. అనంతపురంలో సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐదు రాష్ట్రాల శాసనసభలకు జరిగిన ఎన్నికలలో మూడు ప్రధాన రాష్ట్రాలలో బీజేపీ ఘోరంగా ఓడిపోవడంతో మోడీకి దిమ్మ తిరిగిందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ గెలుపు కష్టమన్న భయంతో మోడీ అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు అంటూ నాటకం ప్రారంభించారని అన్నారు. రిజర్వేషన్లపై చర్చ చేయలేదు. రాజకీయ - మిగతా 2 లో

సిరియా నుండి అమెరికా దళాలు వెనక్కి



దమాస్కస్ : సిరియానుండి అమెరికా సైన్యం ఉపసంహరణ ప్రారంభమయ్యిందని, అమెరికా నాయకత్వంలోని సంకీర్ణదళాల ప్రతినిధి శుక్రవారం తెలియజేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైనికదళాల ఉపసంహరణ అంశాన్ని అకస్మికంగా దాదాపు నెలక్రితం ప్రకటించారు. 2014 నుండి సంకీర్ణదళాలు తిరుగుబాటుదారులకు అనుకూలంగా ఐఎస్ ఉగ్రవాదులపైన పోరాటం చేస్తూ ఉన్నారు. దాదాపు ఏడుళ్లుగా సిరియాలో అంతర్యుద్ధం జరిగింది. దేశంలో ఇంకా పూర్తిగా శాంతి నెలకొనలేదు. దళాల ఉపసంహరణకు సంబంధించిన భద్రతా అంశాలు ఇందులో ఇమిడివున్నందున ఉపసంహరణ నిర్దిష్ట తేదీలను, ప్రాంతాలను, ఎన్నిదళాలు తిరిగి ప్రయాణమయ్యాయన్న అంశాన్ని చర్చించలేమని ఆ ప్రతినిధి వెల్లడించారు. సిరియా ఈశాన్య ప్రాంతంలోని హసకె రాష్ట్రంలోని రెమిలియన్ విమానాశ్రయం నుండి స్వదేశానికి బయలుదేరాయని మానవ హక్కుల పరిశీలక బృందం తెలియజేసింది. గురువారం కొన్ని దళాలు ఇక్కడనుండి బయలుదేరాయని మానవ హక్కుల గ్రూపు తెలిపింది. ట్రంప్ ప్రకటన గత నెలలో వెలువడింది. అమెరికా సైనిక స్థావరాలు సిరియా ఈశన్యప్రాంతంలోని పలుచోట్ల ఉన్నాయి. సిరియానుండి కొన్ని ఆయుధాలను, ఇతర సామాగ్రిని కూడా తిరిగి స్వదేశానికి పంపుతున్నట్టు అమెరికా రక్షణ విభాగం అధికారి తెలియజేశారు.



సార్క్ సమ్మిట్‌కు నేపాల్ సూచన

న్యూఢిల్లీ : సార్క్ దేశాల శిఖరాగ్ర సమావేశాన్ని (సమ్మిట్) నిర్వహించాలని నేపాల్ విదేశాంగమంత్రి ప్రదీప్‌కుమార్‌గయవాలి కోరారు. ప్రస్తుతం భారతదేశంలో పర్యటిస్తున్న ఆయన మన విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్‌తో గురువారం చర్చలుజరిపి ఈ అంశాన్ని ప్రస్తావించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇరుగుపొరుగు దేశాలతో ఉన్న విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకొని అందరూ కలిసి టెర్రరిజంపైన, ఇతర ముఖ్యమైన సవాళ్లపైన పోరాటం జరపాలని సూచించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌జాంగ్‌ఉన్‌లు సింగపూర్‌లో సమావేశమయ్యారని, చర్చలు మాత్రమే విభేదాలను పరిష్కరించుకునేందుకు మార్గమని ఆయన అన్నారు. శత్రువైఖరితోవున్న రెండుదేశాల అధినేతలు సమావేశమై చర్చించుకున్నారని, ఇలాంటి తరుణంలో సార్క్ దేశాలు కూడా విభేదాలను చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని అన్నారు. సార్క్‌దేశాల సమ్మిట్ పాకిస్థాన్ నిర్వహించవలసివున్నది. అయితే పాకిస్థాన్ సీమాంతర టెర్రరిజాన్ని ప్రోత్సహిస్తున్నందున భారతదేశం సమ్మిట్‌ను నిర్వహించటం కష్టమౌతుందనే అభిప్రాయంతో ఉన్నది. 2016లోనే పాకిస్థాన్‌లో సమ్మిట్ జరగవలసివున్నప్పటికీ అది నిలిచిపోయింది. జమ్మూ-కాశ్మీర్‌లో భారత సైనిక క్యాంపుపైన తీవ్రమైన టెర్రరిస్టుల దాడి జరిగిన తరువాత సార్క్ సమ్మిట్‌కి తాను హాజరుకావటంలేదని భారత ప్రభుత్వం ప్రకటించింది. బంగ్లాదేశ్, భూటాన్, ఆఫ్ఘనిస్తాన్‌లు కూడా ఈ సమ్మిట్‌కి హాజరుకాబోమని ప్రకటించాయి. సార్క్ గ్రూపు దేశాలలో మాల్దీవులు, శ్రీలంక కూడా ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఎదుర్కొంటున్న సమస్యలను ఏ ఒక్కదేశమూ ఒంటరిగా పరిష్కరించలేదని, అందువల్ల ఉమ్మడి కృషి అవసరమని నేపాల్ విదేశాంగమంత్రి అన్నారు. సుష్మాస్వరాజ్‌తో రెండు దేశాల మధ్య సంబంధాలపైన చర్చలు జరిపిన తరువాత సార్క్ సమ్మిట్ అంశాన్ని ప్రస్తావించారు.

వేగంగా వేడెక్కుతున్న సముద్రాలు



ఐరాస : వాతావరణ మార్పులపైన శాస్త్రవేత్తల అధ్యయనాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. సముద్రజీవులపైన వాతావరణ మార్పులు తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని కలుగజేస్తున్నాయి. సముద్రజలాల మట్టం పెరుగుతున్నది. శాస్త్రవేత్తలు ఊహించినదానికంటే వేగంగా సముద్ర జలాలు వేడెక్కుతున్నాయని, 2018లో రికార్డుస్థాయిలో వేడెక్కాయని శాస్త్రవేత్తలు తెలియజేశారు. ఉష్ణోగ్రతలు పెరిగినకొలది సముద్రాలలో ఆక్సిజన్ తగ్గిపోతుంది. చేపలకు నిలయాలుగా పేరుగాంచిన కొరల్‌రీఫ్స్ (పగడాల దిబ్బలు) కూడా వేడెక్కుతున్నాయి. 2018లో రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని సముద్రజీవులలో విభిన్నమైన ప్రతికూల ప్రభావం కనిపిస్తున్నదని, ఇదంతా జలాలు వేడెక్కడంవల్లనే జరుగుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. 2000 సంవత్సరం నుండి 3900ల రోబోట్లను ఏర్పాటుచేసి ఉష్ణోగ్రతలను నమోదు చేయిస్తున్నారు. ఈ అంచనాల ప్రకారం 1971 నుంచి ఊహించినదానికంటె వేగంగా సముద్రజలాలు వేడెక్కుతున్నాయని, 2013లో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరిగిన పరిశోధనల నివేదిక తెలియజేసింది. అమెరికాకు చెందిన సైన్స్ పత్రిక ఈ వివరాలను గురువారం ప్రచురించింది. గతంలో వెల్లడైన నివేదికల ప్రకారం భూమండలం ఉష్ణోగ్రతలు ఇటీవల తగ్గాయన్న అంచనాలు సరైనవికావని చైనా అకాడమీ ఆఫ్ సైన్సస్ నిర్వహించిన తాజా పరిశోధన తెలియజేస్తున్నది. మనిషి సృష్టించిన ఉద్గారాల (విషవాయువులు) విడుదల వాతావరణంలో ఉష్ణోగ్రతలను పెంచుతున్నది. వాతావరణ శాస్త్రవేత్తలలో అత్యధికులు ఈ అభిప్రాయాన్ని వెల్లడించారు. వాతావరణంలోని ఉష్ణోగ్రతలు సముద్రాలలో కలిసిపోతాయి. సముద్రాలు వేడెక్కడం, వాతావరణంలో వచ్చిన మార్పునకు అతిముఖ్యమైన సూచిక. తాము అంచనా వేసినదానికంటె సముద్రజలాలు ఎక్కువగా వేడెక్కుతున్నాయని, పరిశోధన నివేదికను రూపొందించిన వారిలో ఒకరు జికెహాస్‌ఫాదర్ తెలియజేశారు. ఆయన కాలిఫోర్నియా యూనివర్శిటీలో పరిశోధన ప్రొఫెసర్‌గా ఉన్నారు. సముద్రాలలో శిలాజ ఇంధనాలను మండించడం వల్ల విషవాయువులు వాతావరణంలోకి చేరి 93 శాతం వేడి అధికంగా నమోదు అవుతున్నదని నివేదిక పేర్కొన్నది. 2014, 2017 సంవత్సరాలలో 4 సార్లు జరిపిన అధ్యయనాలను క్రోడీకరించి తాజా నివేదికను రూపొందించారు. ప్రపంచంలోని అన్ని సముద్రాలలో 4వేల రోబోట్లు తిరుగుతూ వాతావరణ పరిస్థితులను నమోదు చేస్తున్నాయి.

ఈ రోబోట్లు కొద్దిరోజుల విరామంతో 2వేల మీటర్ల లోతుకువెళ్లి పరిశోధన చేస్తున్నాయి. ముఖ్యంగా ఉష్ణోగ్రతల పెరుగుదలను నమోదు చేస్తున్నాయి. అలాగే సముద్రంలో ఉప్పదనం, ఇతర సమాచారాన్ని కూడా ఇవి అందిస్తున్నాయి. సముద్ర మట్టానికి పైన 30 సెం.మీ. సముద్రజలాలు పెరిగినట్టుగా నివేదిక తెలిపింది. మంచుఖండాలు, ఇతర మంచు ప్రాంతాలు, హిమాలయ పర్వతాలలాంటి ప్రాంతాలలో మంచు వేగంగా కరిగిపోవటంవల్ల సముద్రజలాల మట్టం తొలిగిపోతున్నది.

ఇంతవరకు ధరిత్రిపైన నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతలలో 2018లో నమోదైన ఉష్ణోగ్రత 4వ స్థానంలో నిలిచింది. ధరిత్రిపైన చోటుచేసుకుంటున్న మార్పులకంటె సముద్రజలాలలో ఉష్ణోగ్రతల పెరుగుదల వాతావరణ కాలుష్యాన్ని తెలుసుకునేందుకు ఎక్కువగా దోహదం చేస్తోంది.

గ్రీసులో మర్కెల్ పర్యటనకు తీవ్ర నిరసన



ఏథెన్స్ : గ్రీసు ప్రధాని అలెక్సిస్ సిప్రాస్ చేపడుతున్న పొదుపు చర్యలకు యూరోపియన్ యూనియన్ (ఈయూ) సంఘీభావాన్ని తెలియజేసినందుకు జర్మనీ ఛాన్సలర్ ఏంజిలా మర్కెల్ గ్రీసులో పర్యటిస్తున్నారు. వామపక్షాలు, ఇతర శక్తులు ఏథెన్స్‌లో మర్కెల్ పర్యటనను నిరసిస్తూ ప్రదర్శన జరిపాయి. అంతర్జాతీయంగా రుణాలను తీసుకునేందుకు గ్రీసుపైన ఐఎంఎఫ్ ఇతర ఆర్థిక సంస్థలు ఒత్తిడి చేయగా ప్రధాని సిప్రాస్ అనేక పొదుపు చర్యలు చేపట్టారు. ఈ చర్యలను వ్యతిరేకిస్తూ దేశంలో పెద్దఎత్తున ఆందోళన జరిపారు. మర్కెల్ గురువారం ఏథెన్స్‌లో పర్యటించిన సందర్భంగా కూడా నిరసన ప్రదర్శనలు వెల్లువెత్తాయి. మర్కెల్ ఏథెన్స్‌లో 2014లో పర్యటించిన తరువాత మళ్లీ పర్యటించటం ఇది రెండవసారి. మర్కెల్ పర్యటన సందర్భంగా 2వేల మంది పోలీసులను నియమించి ఆమెకు భద్రత కల్పించారు. అదే సమయంలో ప్రధాని సిప్రాస్ నివాసగృహంలోనే మర్కెల్‌తో చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఆ ప్రాంతంలో ప్రదర్శనలను ప్రభుత్వం నిషేధించింది. మర్కెల్ 2012-2014 సంవత్సరాలలో పర్యటించిన తరువాత రెండు దేశాల మధ్య సంబంధాలు అంతా సజావుగా లేవు. సిప్రాస్ ప్రకటించిన పొదుపు చర్యలకు వ్యతిరేకంగా అనేక నెలలపాటు ప్రజలు ఆందోళన జరిపారు. గ్రీసు ఆర్థిక వ్యవస్థను మెరుగుపరిచేందుకు యూరోపియన్ యూనియన్ కూడా ఉద్దీపన రుణాలను అందించింది. ఎనిమిదేళ్లపాటు ఉద్దీపన రుణాలను పొందిన గ్రీసు గత సంవత్సరమే రుణాలను ఇకపైన తీసుకోరాదని నిర్ణయించింది. యూరోపియన్ యూనియన్ దేశాల నుంచి గ్రీసులోకి వచ్చిన వలసవాదుల వల్ల కూడా సంక్షోభం ఏర్పడింది. మర్కెల్ పర్యటన గాయాలపై కారం చల్లినట్టుగా ఉన్నదని పొదుపు చర్యలను ఆమె సమర్థించడమేమిటని పలు రాజకీయ శక్తులు విమర్శిస్తున్నాయి. సిప్రాస్ ప్రభుత్వంలో 2015లో ఆర్థికమంత్రిగా పనిచేసిన ప్రముఖ ఆర్థికవేత్త యనిస్‌వరొఫకిస్ మాట్లాడుతూ తాను సృష్టించిన ఎడారిని సందర్శించేందుకు మర్కెల్ వచ్చారని, ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటున్నదని చెప్పడం మరింత వింతగా ఉన్నదని అన్నారు. పొదుపు చర్యలను మర్కెల్ సమర్థించడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. మర్కెల్ పర్యటనపైన దేశంలోని పలు రాజకీయ శక్తులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశాయి. గ్రీస్‌కు జర్మనీ పూర్తి తోడ్పాటు అందిస్తున్నదని, రెండు దేశాల మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయని గ్రీసు నుండి వెలువడే పత్రిక కథిమెరిని వ్యాఖ్యానించింది. మూడుదఫాలుగా ఉద్దీప రుణాలను అందించి గ్రీసుకు తాము తోడ్పాటుగా ఉన్నామని మర్కెల్ తెలిపారు. పైగా గ్రీసు ఎంతగానో పురోగతి సాగించిందని ప్రశంసించారు.

దావోస్ సదస్సుకు ట్రంప్ డుమ్మా



వాషింగ్టన్ : దావోస్‌లో ఈనెల చివరిలో జరగనున్న ప్రపంచ ఆర్థికవేదిక సదస్సుకు హాజరుకావడంలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ప్రకటించారు. మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మాణానికి ప్రతినిధుల సభ నిధుల మంజూరుకు తిరస్కరించడంతో ట్రంప్ ప్రభుత్వం పాక్షికంగా మూతపడింది. ఈ నేపథ్యంలో దావోస్ సమ్మిట్‌కి హాజరుకాబోనని ప్రకటించారు. ఈ సమాచారాన్ని ట్రంప్ ఒక ట్వీట్ ద్వారా తెలియజేశారు. గోడ నిర్మాణానికి 5.7 బిలియన్ డాలర్లను మంజూరుచేయాలని ట్రంప్ పట్టుబడుతున్నారు. ప్రతినిధుల సభలో డెమోక్రాట్ల నాయకులతో జరిపిన చర్చలు కూడా విఫలమయ్యాయి. దీంతో సరిహద్దుల్లో ఎమర్జన్సీని విధించడానికి కూడా తాను వెనుకాడబోనని ట్రంప్ ప్రకటించారు. దావోస్‌కి తాను వెళ్లాలని ఉన్నదని, అయితే ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వ పాక్షికమూత పరిష్కారం అయితేగనుక దావోస్‌కు వెళతానని పేర్కొన్నారు. ఈనెల 22-25 తేదీలలో దావోస్ సమ్మిట్ జరగనున్నది. ట్రంప్ తాజాగా మెక్సికో సరిహద్దుల్లో పరిస్థితులను పరిశీలించేందుకు వెళ్లారు.

వేతనాలకై అమెరికా సిబ్బంది నిరసన

వాషింగ్టన్ : సరిహద్దుల్లో గోడ నిర్మాణానికి సంబంధించి అధ్యక్షుడు ట్రంప్ చేసిన డిమాండ్‌ను ప్రతినిధుల సభ తిరస్కరించడంతో ప్రభుత్వం పాక్షికంగా మూతపడి 8 లక్షలమంది ఉద్యోగులకు ఇంతవరకు వేతనాలు లేవు. తమకు తక్షణం వేతనాలు చెల్లించాలని, వందలాది మంది సిబ్బంది వైట్‌హౌస్‌వద్ద గురువారం ప్రదర్శన జరిపారు. దాదాపు 20 రోజులుగా అత్యధిక ప్రభుత్వశాఖలు పనిచేయడంలేదు. ప్రభుత్వం పూర్తిగా తిరిగి పనిచేయాలని డిమాండ్‌చేస్తూ ఎముకలు కొరికే చలిలోనూ ప్రదర్శనకారులు వైట్‌హౌస్ ముందు నినాదాలు చేశారు. 8 లక్షల మంది సిబ్బంది కార్యాలయాలకు హాజరుకాకుండా ఇళ్లవద్దే ఉండిపోయారు. ట్రంప్, కాంగ్రెస్‌లో డెమోక్రాట్లకు మధ్య ప్రతిష్టంభన ఏర్పడటంతో వీరు ఇళ్లవద్దే ఉంటున్నారు. ప్రభుత్వం పాక్షికమూత మరిన్నిరోజులు కొనసాగే అవకాశం కనిపిస్తోంది. ట్రంప్‌కి, డెమోక్రాట్లకు మధ్య జరిగిన చర్చలు కూడా విఫలమయ్యాయి.

గిఫ్టిస్తాం !

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రమంతటా విక్రయాలను ప్రోత్సహిస్తోంది. 2018లో రూ.15,300.34 కోట్ల విలువైన మద్యాన్ని విక్రయించింది. 2017లో ఆదాయం రూ.13,208.21 కోట్లు.

అంటే గతేడాది కన్నా అదనంగా రూ.2,092.13 కోట్ల ఆదాయం లభించింది. 2017 డిసెంబరులో రూ.1,586 కోట్లు రాగా 2018 డిసెంబరులో రూ.1,732.08 కోట్ల మద్యం అమ్ముడైంది.

రాష్ట్రవ్యాప్తంగా 25 డిపోలు ఉండగా 2018లో విశాఖపట్నం-2 డిపో రూ.988.4 కోట్ల అమ్మకాలతో ప్రథమ స్థానంలో నిలిచింది. ఇక విజయవాడ-1 డిపో రూ.982.72 కోట్లతో రెండో స్థానంలో, అనంతపురం డిపో రూ.967.59 కోట్లతో మూడో స్థానంలో నిలిచాయి.

ఆరోగ్యాన్ని దెబ్బతీస్తూ.. ఉపశమనమా?

'మద్యపానం హానికరం' అని మద్యం సీసాలపై ముద్రించి తన పనైపోయిందనే ధోరణిని ప్రభుత్వం ప్రదర్శిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తక్కువ ధరకు విక్రయించే చీప్ లిక్కర్ సేవించిన మందుబాబుల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని ప్రజాసంఘాలు, మహిళా సంఘాలు గగ్గోలు పెడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నకిలీ మద్యం అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, బెల్ట్‌షాపులు నిర్మూలిస్తామంటూ చేస్తున్న ప్రకటనలు కాగితాలకే పరిమితమవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఒకవైపు మద్యం అమ్మకాలతో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తూ, మరోవైపు వైద్య ఖర్చులకు సీఎం సహాయ నిధి ద్వారా ఎక్సైజ్‌శాఖ ఉపశమన చర్యలు తీసుకోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వైన్‌షాపులు, బార్లకు ఎడాపెడా లైసెన్సులు మంజూరు చేయడమే కాకుండా ఏటా భారీగా లక్ష్యాలు నిర్దేశించడం ద్వారా వచ్చే ఆదాయంలో వాటాను సీఎం సహాయ నిధికి చెల్లించడం దారుణమని ఖండిస్తున్నారు. మద్యం అమ్మకాలను నిషేధిస్తే..సీఎం సహాయ నిధికి వాటా జమ చేయాల్సిన అవసరం ఉండదు కదా! అనే అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది.

రాజీనామా

(మొదటిపేజీ తరువాయి)

కలత చెంది రాజీనామా చేశారు. ఉద్దేశపూర్వకంగానే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అలోక్ వర్మ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. సీవీసీ రికార్డులోని అంశాలపై వివరణ ఇచ్చే అవకాశం కూడా తనకు లభించలేదని తెలిపారు. న్యాయం బుట్టదాఖలైందని ఆయన వ్యాఖ్యానించారు. డైరెక్టర్ పదవి నుంచి తనను తొలగించేందుకు యావత్ ప్రక్రియను తలకిందులు చేశారన్నారు. తాజా పరిణామాలు తన పనితీరును మాత్రమే కాదు ఒక వ్యవస్థగా సీబీఐ విషయంలో సీవీసీ ద్వారా ప్రభుత్వం ఏ విధంగా వ్యవహరిస్తుందన్న దానిని ప్రతిబింబిస్తాయని అలోక్ వర్మ అభిప్రాయపడ్డారు. సామూహిక ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన క్షణమిది అని ఆయనన్నారు. ప్రభుత్వం తనను సీబీఐ చీఫ్ పదవి నుంచి తప్పించి సెలవుపై పంపడాన్ని సవాల్ చేస్తూ వర్మ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఆయనను తిరిగి సీబీఐ డైరెక్టర్‌గా నియమించాలని ఆదేశించిన విషయం తెలిసిందే.

వర్మ చేసిన బదిలీలు రద్దు :

సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం.నాగేశ్వరరావు మాజీ డైరెక్టర్ అలోక్ వర్మ చేసిన బదిలీలను రద్దు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. గతంలో ఉన్న స్థానాల్లోని వారిని కొనసాగాల్సిందిగా ఆదేశించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈనెల 8న తిరిగి పగ్గాలు చేపట్టిన వర్మ అప్పటివరకు రావు చేసిన బదిలీలను రద్దు చేశారు. ప్రత్యేక డైరెక్టర్ రాకేష్ ఆస్థానాపై కేసును విచారించేందుకుగాను కొత్త దర్యాప్తు అధికారిని నియమించారు. అయితే ప్రధాని మోడీ, జస్టిస్ ఏకే సిక్రీ, కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గేతో కూడిన ఉత్తస్థాయి ప్యానల్ గురువారం వర్మను సీబీఐ డైరెక్టర్‌గా తప్పించి అగ్నిమాపక డీజీగా బదిలీచేసింది. అలోక్ వర్మ, రాకేష్ ఆస్థానాను బలవంతంగా సెలవుపై పంపిన 77 రోజుల కోసం ఇంచార్జిగా వ్యవహరించిన ఎం.నాగేశ్వరరావును సీబీఐ అదనపు డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. అయితే ఆయన ఎలాంటి కీలక నిర్ణయాలు తీసుకునే వీల్లేదని సుప్రీంకోర్టు అప్పట్లో స్పష్టమైన ఆదేశాలిచ్చింది. కాగా, నూతన డైరెక్టర్‌గా నాగేశ్వరరావు బాధ్యతలు స్వీకరించినట్టు శుక్రవారం సీబీఐ అధికార ప్రతినిధి ప్రకటించారు.

పంజరంలో చిలుక తప్పించుకుంటే... : సిబల్

సీబీఐలో తాజా పరిణామాలపై కాంగ్రెస్ నేత కపిల్ సిబల్ స్పందించారు. ప్రతిష్టాత్మక దర్యాప్తు సంస్థ (సీబీఐ)ని పంజరంలో చిలుకగా వ్యవహరించారు. 'పంజరంలో చిలుక తప్పించుకుంటే తమ బాగోతాలన్నింటిని బయటపెడుతుందని వారు భయపడ్డారు. అందుకే అలోక్ వర్మను తొలగించారు. ఇప్పుడు ఆ చిలుక పంజరానికే పరిమితమవుతుంది' అని సిబల్ వ్యాఖ్యానించారు.

మోడీ చట్ట ధిక్కారం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : అలోక్‌వర్మను అర్థాంతరంగా సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి తప్పించి కేంద్ర హోంశాఖ పరిధిలోని అగ్నిమాపక సర్వీస్‌కు మార్చడాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఆక్షేపించారు. ఈ నిర్బంధాన్ని తట్టుకోలేక అలోక్‌వర్మ తన పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అలోక్‌వర్మ, రాకేష్ అస్థానాన్ని అక్టోబరు 13 అర్ధరాత్రి ప్రధానమంత్రి, సీవీసీ సెలవుపై పంపడం చట్టవిరుద్ధమన్నారు. అలోక్‌వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో కేంద్రం చర్యను కోర్టు తప్పుపట్టిందని గుర్తుచేశారు. అంతేకాకుండా అలోక్‌వర్మ సీబీఐ డైరెక్టరుగా కొనసాగుతారని స్పష్టం చేసిందని తెలిపారు. ఈ తీర్పును తట్టుకోలేని ప్రధానమంత్రి నిరాశ, నిస్పృహతో అత్యున్నతస్థాయి కమిటీ పేరుతో ప్రతిపక్ష నాయకులు వ్యతిరేకించినా...అలోక్‌వర్మని ఫైర్ సర్వీస్‌కు బదిలీ చేయడం కక్షసాధింపు చర్యేనని పేర్కొన్నారు. అలోక్‌వర్మపై అస్థానా ఆరోపణలపై న్యాయస్థానంలో చర్చ జరగలేదని, హైపర్ కమిటీ అలోక్‌వర్మను పిలిపించి వివరణ కోరలేదన్నారు. అలోక్‌వర్మ కొనసాగితే రాఫెల్ కుంభకోణం మొత్తం బయటపడుతుందనే భయంతో ఈ దిగజారుడు చర్యకు ప్రధానమంత్రి పూనుకున్నారని నారాయణ అన్నారు. గడచిన 55 ఏళ్లలో సీబీఐపై ఇటువంటి ప్రత్యక్ష చర్య జరగలేదని చెప్పారు. ప్రధానమంత్రి స్థాయిలోనే చట్టాల ధిక్కరణ జరిగితే ఈ ప్రజాస్వామ్యం మనుగడ ఎలా? అని నారాయణ ప్రశ్నించారు.

అసోం మండిపోతుంది

సిటిజన్ షిప్ బిల్లును హడావుడిగా పార్లమెంటు ఆమోదించడంతో అసోం భగ్గుమందని నారాయణ తెలిపారు. బీజేపీ సంకుచిత వైఖరితో 2014 డిసెంబరు 31కి ముందు బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల నుంచి వచ్చిన ముస్లిమేతరులను మాత్రమే అనుమతించేలా బిల్లు తీసుకొచ్చిందన్నారు. సెక్యులరిజాన్ని హేళన చేసే పద్ధతిలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం దారుణమని వ్యాఖ్యానించారు. ఇది భారతదేశాన్ని మతపరంగా విభజించడానికి చేసే కుట్ర అని, తక్షణం బిల్లును ఉపసంహరించాలని నారాయణ డిమాండు చేశారు.

వచ్చే ఎన్నికల్లో మో'డీలా'...!

(మొదటిపేజీ తరువాయి)

కార్లు, బైక్‌ల మీదే ఉద్యోగులు తమ కార్యాలయాలకు వెళ్లే పరిస్థితి. దేశవ్యాప్తంగా ఆర్థిక లావాదేవీలు, విదేశీ లావాదేవీల్లో 50 శాతం ముంబైలోని బ్యాంకుల్లోనే జరుగుతాయని ఉదయ్ భట్ తెలిపారు. బ్యాంకు ఉద్యోగులు సమ్మెలో దిగటంతో పూర్తి లావాదేవీలు నిలిచిపోయాయి. ఒడిశా టూర్‌లో ఉన్న ఛత్తీస్‌గఢ్ మైనింగ్ కార్మికుల సంఘాల నేత గాల్దీ జార్జి వివరాల ప్రకారం, కటక్-భువనేశ్వర్ మధ్య రవాణ వ్యవస్థ పూర్తిగా స్తంభించింది, సగం పైగా షాపులు మూత పడ్డాయి. దీంతో సమ్మె కాస్త బంద్‌గా మారిపోయిందన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోనూ మైనింగ్ నిలిచి పోయింది. ఇక ఢిల్లీలో కార్మికులకు కర్షకులు తోడయ్యారు. అనేక రోడ్లను దిగ్బంధనం చేశారు. ఢిల్లీ నుంచి మొరాదాబాద్, అలీగర్ వరకూ బంద్ వాతావరణం నెలకొంది. తిరువొత్రియూర్ - మనాలీ ప్రాంతంలో అనేక మధ్య, చిన్నతరహా పరిశ్రమలు పని చేశాయి. కానీ ఎన్నోర్ ఫౌండరీస్, అశోక్ లేల్యాండ్, ఎంఆర్‌ఎఫ్ తదితర సంస్థలు మూతపడినట్టు కార్మికులు చెప్పారు. పాండిచేరీలో 90 శాతం వాణిజ్య సంస్థలు మూతపడ్డాయి. ఆర్థిక లావాదేవీలు నిలిచిపోయాయి. రోడ్డు రవాణ సంస్థ స్తంభించింది. తమిళనాడు నుంచి వచ్చిన రెండు బస్సుల్ని ఆందోళనకారులు ధ్వంసం చేశారు. సమ్మెలో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హెచ్చరించినా ఉద్యోగులు బేఖాతరు చేశారు. విధులకు గైర్హాజరయ్యారు. ఈ సమ్మెకు ప్రపంచవ్యాప్తంగా కార్మిక సంఘాలు సంఘీభావం తెలిపాయి. 130 కార్మిక సంఘాల ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య రెండు రోజుల సార్వత్రిక సమ్మెకు సంఘీభావం తెలుపుతూ సందేశాన్ని పంపించింది. కార్మిక సంఘాల లేవనెత్తిన పలు డిమాండ్ల నేపథ్యంలో సమ్మె ప్రభావం దీర్ఘకాలం పని చేస్తుంది. కార్మిక సంఘాలు 12 డిమాండ్లను తెరమీదకు తీసుకు వచ్చాయి. ఇందులో నెలకు రూ.18వేల కనీస వేతనం డిమాండు కీలకమైంది. వివిధ స్థాయిల్లో తక్కువ వేతనాలతో పని చేస్తున్న కార్మికులపై ఈ డిమాండు తీవ్ర ప్రభావం చూపుతుంది. ఉత్తర ప్రదేశ్‌లో భవన నిర్మాణ కార్మికులు రోజుకు రూ.600ల నుంచి రూ.700లు ఆదాయం పొందుతుంటే... ఆశావర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు అత్యల్ప వేతనం పొందుతున్నారు. భవన నిర్మాణ కార్మికుల ఆదాయంలో నాలుగోవంతు మాత్రమే స్కీమ్ వర్కర్లకు దక్కుతోంది. ఇటీవలే ఆశావర్కర్ల నెలవారీ జీతాన్ని రూ.1500ల నుంచి మోడీ సర్కారు రూ.3500లకు పెంచింది. గ్రామాల్లో పశువులను కాసే పిల్లగాళ్లు రోజుకు రూ.350లు సంపాదిస్తుంటే, ఆశా వర్కర్లకు కేవలం రూ.120లు చెల్లిస్తున్నారు. ఈ స్థితిలో సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం డిమాండ్లు ఆయా వర్గాలను ప్రభావితం చేస్తున్నాయి. న్యాయమైన డిమాండ్లుగా జనం భావిస్తున్నారు. నోట్ల రద్దు, జీఎస్టీతో పరిశ్రమల్లో పని చేసే అసంఘటిత కార్మికుల్లో 70 నుంచి 80 శాతం మంది ఉపాధిని కోల్పోయారు. పశ్చిమ దేశాల్లో మాదిరిగానే ఉద్యోగాలు కోల్పోయిన కార్మికులకు పరిహారం చెల్లించాలని డిమాండు చేస్తున్నాయి. ఇక నోట్ల రద్దుపై ఆమ్‌ఆద్మీ పార్టీ తిరుగులేని ప్రచారం చేస్తోంది. తబ్ నోట్ బందీ, అబ్ ఓట్ బంధీ (అప్పుడు నోట్లు రద్దు..ఇప్పుడు ఓట్లు రద్దు) నినాదాన్ని అందుకుంది. ఈ స్థితిలో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రభుత్వం, ప్రతిపక్షం మధ్య హోరాహోరీ పోరు తప్పదు. ఇలాంటి స్థితిలో కార్మిక వ్యతిరేకత ప్రభుత్వానికి ప్రతిబంధకం కావటం తథ్యం.

ఇదంతా ఎన్నికల స్కెచ్

(మొదటిపేజీ తరువాయి)

పార్టీల అభిప్రాయాలు తీసుకోలేదు. కనీసం సహచర బీజేపీ పెద్దలు, మంత్రుల దృష్టికి తీసుకెళ్లలేదు. ఎవరికీ చెప్పకుండా అకస్మాత్తుగా మంత్రివర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. అగ్రకుల పేదలకు రిజర్వేషన్లు కల్పించిన ఈ పెద్దమనుషులు ఇంతకాలం బీసీలకు, ఎస్సీలకు క్రీమిలేయర్ ఉండాలని గగ్గోలు పెట్టారని, వారికి రూ.4 లక్షల ఆదాయ పరిమితి విధించారని, ఇప్పుడు వారే రిజర్వేషన్లు ప్రవేశపెట్టి ఆదాయ పరిమితిని రూ.8 లక్షలకు పెంచడమేమిటని రామకృష్ణ ప్రశ్నించారు. అంటే నెలకు రూ.65 వేలు ఆదాయం ఉన్నవారు కూడా పేదవారేనని కేంద్రం ఆమోదించిన 10 శాతం రిజర్వేషన్ల బిల్లు చెబుతోందన్నారు. సాంఘిక న్యాయం కోసం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రవేశపెట్టిన రిజర్వేషన్ల అంశం...అసలు ఉద్దేశాన్ని కోల్పోయే ప్రమాదం వచ్చిపడిందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటులో చర్చ సందర్భంగా విపక్షాలు అడిగిన రిజర్వేషన్ల బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపకుండా మంకుపట్టు పట్టడం వెనుక మోడీ రాజకీయ దురుద్దేశం స్పష్టంగా కనపడుతోందని, మోడీ తీరు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని ఘాటుగా విమర్శించారు.

రాఫెల్ యుద్ధవిమానాల కుంభకోణం వెలుగులోకి వస్తుందన్న భయంతో... సుప్రీం తీర్పు వెలువడి 24 గంటలు గడవక ముందే అత్యవసరంగా హై పవర్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి సీబీఐ డైరెక్టర్‌గా అలోక్‌వర్మను తొలగించడం అత్యంత విచారకరమని రామకృష్ణ అభిప్రాయపడ్డారు. రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలు ఒప్పందం సమయంలో రక్షణ మంత్రి కానీ, విదేశాంగమంత్రి కానీ లేకుండా నేరుగా మోడీ తలదూర్చి హెచ్‌ఏఎల్‌కు వేల కోట్ల నష్టం చేకూర్చి, కార్పొరేట్ దిగ్గజం అనిల్‌అంబానీకి ఏకంగా రూ.30 వేల కోట్ల లబ్ధి చేకూర్చారని విమర్శించారు. అలోక్‌వర్మ తొలగింపును హై పవర్ కమిటీ సమావేశంలో ప్రతిపక్ష నాయకుడు మల్లిఖార్జున ఖర్గె వ్యతిరేకించినా ఆయనను అప్రాధాన్య పోస్టుకు బదిలీ చేయడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. రాష్ట్రంలో విలువైన భూములను తెలుగుదేశం నాయకులకు, కార్యకర్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు దోచిపెడుతున్నారని రామకృష్ణ విమర్శించారు. చుక్కల భూములు, అసైన్డు భూములు, దేవాదాయ భూములను టీడీపీ నేతలకు కట్టబెడుతున్నారని అన్నారు. కృష్ణా, గుంటూరు, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, రాయలసీమ జిల్లాలలో ఇటీవల కాలంలో భూముల విలువ బాగా పెరిగిపోయిం దన్నారు. ఆ భూములను తమ పార్టీ నాయకులకు కట్టబెట్టడానికి కొత్త చట్టాలు, కొత్త జీఓలు ఇస్తున్నారని ఆరోపించారు. ప్రతిపాదిత చట్టంపైనా, ఇప్పటికే విడుదల చేసిన జీఓలపైనా చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, కూలంకషంగా చర్చించాలని డిమాండు చేశారు. కరవు ప్రాంతాలలో ఇప్పటికే తాగునీటి సమస్య ప్రారంభమైందన్నారు. పశువులను రైతులు కబేళాలకు తరలిస్తున్నారన్నారు. రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతోందన్నారన్నారు. రైతులు, కూలీలు సంక్రాంతి పండుగ జరుపుకోలేని దుర్భర స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరవు ప్రాంతాలలో తీసుకోవాల్సిన సహాయక చర్యల గురించి సంక్రాంతి తర్వాత ముఖ్యమంత్రిని కలిసి వివరిస్తామన్నారు. అప్పటికీ స్పందించకపోతే అమరావతి రాజధాని ప్రాంతంలోనే నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఆ కార్యక్రమాల తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి డి.జగదీష్, సహాయ కార్యదర్శులు సి.జాఫర్, పి.నారాయణస్వామి, కార్యదర్శివర్గ సభ్యులు వేమయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారమిస్తే హోదా ఇస్తా

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేకహోదా ఇవ్వడమేనని అన్నారు. మనమంతా కలిసి ఉంటే భారత ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోడీపై ఒత్తిడి తీసుకురావచ్చని చెప్పారు. నరేంద్రమోడీపై మరోసారి రాహుల్ విరుచుకుపడ్డారు. కార్మికుల సమస్యలు తెలుసుకోవాలని తాను కోరుకుంటున్నానని రాహుల్ చెప్పారు. మొదటిసారి యూఏఈకి వచ్చిన రాహుల్‌కు దుబాయ్ విమానాశ్రయంలో భారతీయులు ఘన స్వాగతం పలికారు. 'మీరు ఇక్కడ ఎదుర్కొంటున్న కష్టాల గురించి నాకు తెలుసు. మీరు రోజంతా పనిచేస్తారు. కుటుంబం కోసం ఇంటికి డబ్బులు పంపిస్తారు' అని అన్నారు. 'నా మనస్సులో మాట చెప్పడానికి నేను ఇక్కడికి రాలేదు. మీ హృదయ తెలుసుకోవడానికి వచ్చాను' అని రాహుల్ తెలిపారు. నరేంద్రమోడీ ప్రతినెలా రేడియోలో మాట్లాడే మనసులో మాట అందరూ వింటున్నారని, ఆయనకు చెప్పడమేగానీ ప్రజల గురించి తెలుసుకోవాలనే కోరిక లేదని ఆరోపించారు. రాహుల్ వెంట కేరళ కాంగ్రెస్ నాయకుడు ఊమెన్ చాందీ, విదేశాల్లో కాంగ్రెస్ పార్టీ చైర్మన్ శ్యామ్ పిట్రోడా ఉన్నారు. పెద్దసంఖ్యలో భారతీయ కార్మికులు పాల్గొన్నారు.

60 మంది అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్లలో బాధితుల ఫిర్యాదుతో విషయం వెలుగులోకి వచ్చింది. దేశవ్యాప్తంగా సంచలనం రేపిన క్యూనెట్ కుంభకోణం కేసులో ఆ సంస్థ డైరెక్టర్, ప్రముఖ క్రీడాకారుడు, పద్మ భూషణ్ అవార్డీ మైఖేల్ ఫెరేరాను హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. హాంకాంగ్‌కు చెందిన విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ..'క్యూనెట్' పేరిట భారత్‌లో మల్టీ లెవెల్ మార్కెటింగ్ బిజినెస్ నడుపుతోంది. వేల సంఖ్యలో అమాయకులను మోసం చేసి రూ.1000కోట్ల మేర వసూ లు చేశారు. ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా క్యూనెట్ మల్టీలెవెల్ స్కామ్ బట్టబయలైంది. గొలుసుకట్టు విధానం ద్వారా పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయని నమ్మించి నట్టేట ముంచిన మోసగాళ్లను అరెస్ట్‌చేసి కటకటాల వెనక్కి నెట్టారు. క్యూనెట్ మోసాలపై ఒక్క హైదరాబాద్‌లోనే 14 కేసులు నమోదయ్యాయి. కర్ణాటక, ఏపీ, ఢిల్లీలోనూ కేసులు న్నాయి. హైదరాబాద్‌లో 51 మందిని, బెంగళూరులో ఐదుగురు, ఏలూరు, ఢిల్లీలో ఒక్కొక్కరి చొప్పున అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన వారిలో 42 మంది తెలంగాణ, ఐదుగురు ఏపీకి చెందిన వాళ్లున్నారు. పలువురు బ్యాంకు ఉద్యోగులు కూడా ఉన్నట్లు తెలిసింది. 2001 నుంచి వీళ్ల వ్యాపారం చేస్తున్నారని సైబరాబాద్ సీపీ సజ్జనార్ వెల్లడించారు. క్యూనెట్ కుంభకోణంపై ఐదేళ్లుగా పోరాటం చేస్తున్న గుర్మీత్, అనూజ మాట్లాడుతూ.. క్యూనెట్ నిర్వాహకులు నకిలీ కంపెనీ పేరుతో వ్యాపారాలు చేస్తుంటారనీ, కంపెనీ వివాదంలో ఇరుక్కుని మోసం బయటపడగానే పేరు మార్చేసి మరో పేరుతో వ్యాపారం మొదలుపెడతారని తెలిపారు.

సిద్ధాంతాలు లేని పార్టీల మనుగడ అసాధ్యం

పశ్చిమగోదావరి, కృష్ణాజిల్లాల సమీక్షలో పవన్‌కల్యాణ్



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : సిద్ధాంతాలు లేని పార్టీల మనుగడ అసాధ్యమని జనసేనపార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ తెలిపారు. విజయవాడలో జనసేనపార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం పశ్చిమగోదావరి, కృష్ణాజిల్లాల నాయకులు, కార్యకర్తలతో ఆయన సమీక్ష నిర్వహించారు. పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ తాను కులం, మతం, ప్రాంతీయతను నమ్ముకుని రాజకీయాల్లోకి రాలేదన్నారు. సిద్ధాంతాలు లేని కులాన్ని నమ్ముకున్న పార్టీలు కొద్దికాలం మాత్రమే మనుగడ సాధించి నిర్వీర్యం అవుతాయని స్పష్టం చేశారు. రాజకీయ వ్యవస్థలో రోజురోజుకు అవినీతి పెరిగిపోతుందన్నారు. 2014లో తెలుగుదేశానికి మద్దతు ఇస్తే ఆపార్టీ కూడా అంచనాలకు మించిపోయి అవినీతికి పాల్పడుతోందని విమర్శించారు. దెందులూరు ఎమ్మెల్యే వేధిస్తున్నారని తనను కలిసిన దళితులు చెప్పారనీ, అలాంటి వ్యక్తిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి అరెస్ట్ చేయాలని డిమాండు చేశారు. ఇంటర్మీడియట్‌తోనే చదువు ఆపేసినా చదవటం మాత్రం ఆపలేదన్నారు. రోజుకు కనీసం 8గంటలపాటు మార్క్స్, కాన్షీరాం, నక్సలిజం, రిజర్వేషన్లు, సోవియట్ పతనం, సైన్సు అండ్ టెక్నాలజీ వంటి ఎన్నో విషయాలను చదువుతానన్నారు. రాత్రికి రాత్రే పార్టీ నిర్మాణం సాధ్యం కాదన్నారు. రాజకీయాల్లో నిలబడటానికి ముందు గుండె ధైర్యం ఉండాలని, సమాజంలో మార్పు రావాలంటే కనీసం 10 ఏళ్ల సమయం కావాలన్నారు. ఎన్నికల గుర్తు కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు ఎన్నికల సంఘం చూపిన వాటిలో టీగ్లాస్ కనిపించిందన్నారు. అయితే అనుకోకుండా అదే గుర్తు మన పార్టీకి వచ్చిందన్నారు. చిన్ననాటి నుంచి టీ అంటే ఎక్కువగా ఇష్టపడేవారనీ, ఇప్పుడు అదే టీ గ్లాస్ గుర్తు పార్టీ గుర్తు కావడం సంతోషంగా ఉందన్నారు. వ్యవస్థ మీద ఉన్న కోపాన్ని ఉద్యమాలు వ్యక్తపరుస్తాయని, ఆ ఉద్యమశక్తిని మంచికి ఉపయోగించడమే జనసేన లక్ష్యమని పవన్ స్పష్టం చేశారు. ప్రజాబలం లేని పార్టీలకు నిర్మాణం ఉన్నా ఉపయోగం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గంగాధరమ్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పింఛను ఇక రెండు వేలు

(మొదటిపేజీ తరువాయి)

శంకుస్థాపన చేశారు. బోగోలులోని జన్మభూమి-మా ఊరు గ్రామ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ 60 వేల మంది లబ్ధిదారులకు 66,600 ఎకరాలకు పట్టాలు ఇవ్వడం తన అదృష్టమన్నారు. ఒక ఎకరా విలువ రూ.12 లక్షల వరకు ఇక్కడ ఉందని, మొత్తం 8 వేల కోట్ల విలువైన భూమిని రైతులకు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆడబిడ్డలకు పసుపు, కుంకుమ పేరుతో ఈ భూములను అందజేస్తున్నామన్నారు. భూములకు సంబంధించి ఎవరికీ ఒక్క పైసా కూడా చెల్లించవద్దని, ఎవరైనా అడిగితే తన దృష్టికి తీసుకురావాలని, అవినీతి అనేది లేకుండా భూములను పంపిణీ చేస్తున్నామన్నారు. బోగోలులో గిరిజనుల కోసం రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేస్తామని చెప్పారు. రక్ష పథకంలో భాగంగా రూ.180 కోట్లతో శానిటరీ నాప్కిన్స్ ఆడబిడ్డలకు ఉచితంగా అంది స్తున్నట్లు వివరించారు. రూ.110 కోట్లతో జువ్వలదిన్నెలో శ్రీ పొట్టి శ్రీరాములు స్మారక అభివృద్ధి పనులు చేపడతామన్నారు. అధికారుల్లో జవాబుదారీతనం పెంచామన్నారు. జన్మభూమి కార్యక్రమాల్లో ప్రజలను రెచ్చగొట్టాలని కొందరు ప్రయత్నించారని, వారి కుట్రలు సాగలేదని తెలిపారు. రాష్ట్ర విభజన సమయంలో కనీసం పింఛన్లు ఇవ్వడానికి కూడా అయోమయ పరిస్థితి నెలకొందన్నారు. రైతులకు లక్షా యాభై వేల రూపాయల రుణ మాఫీ చేశామని, 10 శాతం వడ్డీతో సహా రైతులకు రుణ మాఫీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఎక్కువగా ఉన్న ఈ జిల్లా అభివృద్ధికి పెద్ద పీట వేశానన్నారు. రాష్టంలో మిగులు విద్యుత్‌ను తీసుకొచ్చానని, విద్యుత్ చార్జీలను భవిష్యత్తులో పెంచబోమని ప్రకటించారు. నెల్లూరు, చెన్నై, తిరుపతిలు భవిష్యత్తులో ఇండస్ట్రియల్ కారిడార్‌గా మారుతాయని తెలిపారు. కృష్ణపట్నం పోర్టు మరింత కీలకం కానుందని, నెల్లూరుకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని ప్రధాని మోడీ అడ్డుకుంటున్నారని అన్నారు. తమను టార్గెట్ చేయడానికే కావలి ప్రాంత నేత బీదా మస్తాన్‌రావుపై ఐటీ దాడులు చేయించారని తెలిపారు.

రుణ మాఫీ 4,5 విడతలకు త్వరలో రూ.8 కోట్లు : సోమిరెడ్డి

జిల్లాలో మూడు చారిత్రాత్మక కార్యక్రమాలకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. సీజేఎఫ్ఎస్ సొసైటీలను రద్దు చేసి 60,596 మంది లబ్ధిదారులకు డీకేటీ పట్టాలు అందజేస్తున్నారని చెప్పారు. జువ్వలదిన్నె గ్రామాన్ని దత్తత తీసుకుని రూ.110 కోట్లతో అభివృద్ధి పనులకు యాక్షన్ ప్లాన్ చేపట్టారన్నారు. దామవరం ఎయిర్ పోర్టుకు శంకుస్థాపన చేశారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చినట్లు మంత్రి వివరించారు. 16 వేల కోట్ల లోటు బడ్జెట్‌లోనూ లక్షన్నర పరిమితితో మాఫీ చేశామన్నారు. రుణమాఫీ 4, 5 విడతలకు రూ.8 వేల కోట్లను త్వరలో ఒకేసారి రైతుల ఖాతాల్లో జమ చేయబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి అమరనాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, ఎమ్మెల్యేలు బొల్లినేని రామారావు, పోలంరెడ్డి శ్రీనువాసులు రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, జెడ్పీ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనువాసులు రెడ్డి, టీడీపీ నేతలు బీదా మస్తాన్‌రావు, పరసా రత్నం, వేనాటి రామచంద్రారెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జయకుమార్‌రెడ్డి, బొల్లినేని కృష్ణయ్య, కలెక్టర్ ముత్యాలరాజు, జేసీ వెట్రిసెల్వి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పింఛన్లు రెండింతలు చేశా..!

గ్రీన్‌ఫీల్డ్ సిటీగా అమరావతి : చంద్రబాబు



విశాలాంధ్ర-గుంటూరు : కేంద్రం సహకరించకపోయినా పేద వారికి అండగా ఉండాలని రాష్ట్రంలోని ఫెన్షన్ దారులందరికీ సంక్రాంతి కానుకగా పింఛన్‌ను రెండింతలు చేశామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. మంగళగిరి మండలంలోని కాజా వద్ద సాహితీ గ్రూప్ ఆధ్వర్యంలోని మెగా ఐటీ పార్కు, వాగ్దేవి టెక్నో పార్కు హితా క్యాపిటల్ మల్టీప్లెక్స్‌కు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ భగవంతుడు నాకు రాజధాని కట్టే అదృష్టం కల్పించాడన్నారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా భూము లిచ్చేందుకు రైతులందరూ విశ్వసనీయతతో ముందుకు వచ్చారని అభినందించారు. ఒక్క పైసా కూడా తీసుకోకుండా సింగపూర్ మాస్టర్‌ప్లాన్‌ను తయారు చేసి ఇచ్చిందన్నారు. భవిష్యత్‌లో అమరా వతిలో మంచి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వస్తుందని, ఐటీ కంపెనీలన్ని ఇక్కడికే వస్తాయన్నారు. యూజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ప్రపంచంలో ఐదు స్థానాలలో ఏపీ ఉండబోతుందన్నారు. ఎవరైనా ఎక్కువ సంవత్సరాలు జీవించాలంటే అమరావతికి రావాల్సిందేనని, 16 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో వాగ్ధేవి టెక్నో పార్కు నిర్మిస్తున్నారన్నారు. ఆనందానికి చిరునామాగా సాహితీ కాంప్లెక్స్ ఉండాలని సూచించారు. ఎన్నికల తరువాత అన్ని నగరాలకంటే అమరావతి అత్యున్నత జీవన ప్రమాణాలు కల నగరంగా రూపుదిద్దుకుంటుందన్నారు. రానున్న కాలంలో అమరావతి ఐటీ రంగంలో దేశంలోనే కాదు అంతర్జాతీయ స్థాయిలో నెంబర్ 1గా మారబోతుందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి దేశ, విదేశాల నుంచి పారిశ్రామికవేత్తలు ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నారని, అమరావతికి ప్రజల సహకారంతోపాటు పారిశ్రామికవేత్తల సహకారం కూడా ఎంతో అవసరమన్నారు. ప్రతి ఇంటికి మొబైల్ ఫోన్ ఇచ్చి అన్ని రకాల సదుపాయాలను యాప్ ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తానన్నారు. సినీనటుడు జగపతిబాబు మాట్లాడుతూ చంద్రబాబు అభివృద్ధిలో సాహితీ కూడా భాగస్వామి కావాలని కోరారు. పసిపాప లాంటి నవ్యాంధ్ర చంద్రబాబు చేతుల్లో సురక్షితంగా పెరుగుతుందన్నారు. సినీనటి రమ్యకృష్ణ మాట్లాడుతూ చాలా రోజుల తరువాత విజయవాడ రావడంతో గుర్తు పట్టలేకపోయానన్నారు. ఈ అభివృద్ధి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. సాహితీ సంస్థలో జగపతిబాబు డైరెక్టర్‌గా ఉండటం అభినంద నీయమని కొనియాడారు.

శివరామిరెడ్డికి అంతిమ వీడ్కోలు

ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి ఫిలింనగర్ వరకు సాగిన యాత్ర

పాల్గొన్న కమ్యూనిస్టు అగ్ర నాయకులు, వందలాది మంది కార్యకర్తలు



శివరామిరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న సురవరం, చాడా వెంకటరెడ్డి, ఓబులేసు తదితరులు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: కమ్యూనిస్టు నిర్మాతల్లో ఒకరు, మాజీ శాసనసభ్యులు ఎన్. శివరామిరెడ్డి అంత్యక్రియలు శుక్రవారం ఫిలింనగర్‌లోని మహాప్రస్థానంలో జరిగాయి. సీపీఐ అగ్రనాయకులు, కార్యకర్తలు, అభిమానుల నినాదాలు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యుల కన్నీటి నడుమ అంత్యక్రియలు పూర్తి అయ్యాయి. తొలుత ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి అంతిమయాత్ర ప్రారంభమై, వివిధ ప్రాంతాల మీదుగా ఫిలింనగర్ మహాప్రస్థానానికి చేరుకుంది. కుటుంబ సభ్యులు, సీపీఐ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. కడప జిల్లా నుంచి తరలివచ్చిన అనేక మంది శివరామిరెడ్డికి పుష్పాంజలి ఘటించారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, ఇప్సో జాతీయ ప్రధాన కార్యదర్శి డా.డి.సుధాకర్, ఏఐటీయూసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, కార్యదర్శి వర్గ సభ్యుడు, కడప జిల్లా కార్యదర్శి జి.ఈశ్వరయ్య, వైసీపీ నేత రామకృష్ణారెడ్డి, సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యుడు ఎన్.బాలమల్లేష్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు, ప్రజాపక్షం సంపాదకులు కె.శ్రీనివాస్‌రెడ్డి, హైదరా బాద్ నగర సమితి కార్యదర్శి ఈటీ నరసింహ, సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవరావు, ఇప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేపీఎల్, డా.రజని తదితరులు శివరామిరెడ్డి భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలుంచి అంజలిఘటించారు. ఆయన సేవలను స్మరించు కున్నారు. అంతిమయాత్ర సంద ర్భంగా కార్యకర్తలు విప్లవజోహార్లు అర్పించారు.' అమర్ హై అమర్ హై శివరామిరెడ్డి అమర్ హై , జోహార్లు జోహార్లు శివరామిరెడ్డికి జోహార్లు, శివరామిరెడ్డి ఆశయాలు సాధిస్తాం సాధిస్తాం' అంటూ నినదించారు.

స్ఫూర్తిప్రదాత శివరామిరెడ్డి : సురవరం

శివరామిరెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్న సురవరం సుధాకరరెడ్డి మాట్లాడుతూ 'శివరామిరెడ్డి నిష్కలంకమైన వ్యక్తి. అలుపెరగని పోరాట యోధుడు. తొలితరం కమ్యూనిస్టు. కడప జిల్లా కమలాపురం శాసనసభ్యుడిగా ఎన్నికై ప్రజా సంక్షే మం, జిల్లా అభివృద్ధి కోసం అవిశ్రాంతంగా కృషి చేశారు. కడప, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి శ్రమించారు. నేటితరం కమ్యూ నిస్టు ఉద్యమ నాయకులకు ఆయన స్ఫూర్తిప్రదాత. శివరామిరెడ్డి ఆశయ సాధనకు పార్టీ శ్రేణులు పునరంకితం కావాలి' .

శివరామిరెడ్డి మృతి తీరనిలోటు : పి. రామచంద్రయ్య

విశాలాంధ్ర - బ్యూరో, కర్నూలు : తొలితరం కమ్యూనిస్టునేత, మాజీ ఎమ్మెల్యే నర్రెడ్డి శివ రామిరెడ్డి మృతి కమ్యూనిస్టుపార్టీకి, రాయలసీమకు తీరనిలోటని ఏపీ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పి. రామచంద్రయ్య వెల్లడించారు. శివరామిరెడ్డి కడప జిల్లా కమ్యూనిస్టు నిర్మాణంలో ఏపీ రైతుసంఘం నాయకుడిగా, రాయల సీమ జిల్లాల వెనుకబాటుకు వ్యతిరేకంగా ఉద్యమిం చారన్నారు. సాగునీటి ప్రాజె క్టు కోసం సీపీఐ నాయ కులు వీకే ఆది నారాయణరెడ్డి, ఎద్దుల ఈశ్వరరెడ్డిలతో కలసి పెద్దఎత్తున పోరాటాలు చేశారని వివరించారు. హంద్రీనీవా, గంటికోట, వెలుగొండ ప్రాజెక్టుల కోసం నర్రెడ్డి ఎంతో కృషిచేశారన్నారు. ఆయన మృతి కమ్యూనిస్టుపార్టీకి, రాయలసీమకు తీరని లోటని శివరామిరెడ్డి మృతికి సంతాపం తెలియచేస్తూ, ఆయన కుటుంబానికి సానుభూతి తెలియచేశారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు ప్రోత్సాహం

సాంఘిక సంక్షేమశాఖ మంత్రి ఆనంద్‌బాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : విద్యార్థులు విద్యలోనే కాకుండా క్రీడల్లో కూడా రాణించే విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనంద్‌బాబు పేర్కొన్నారు. విజయవాడలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం సాంఘిక, గిరిజన సంక్షేమ వసతిగృహాల గురుకుల విద్యార్థుల బాల బాలికలకు క్రీడాపోటీలు జరిగాయి. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తొలిసారిగా గురుకుల సొసైటీ విద్యాలయాల క్రీడా పోటీలు నిర్వహించామన్నారు. విద్యార్థుల మానసిక ఎదుగుదలకు క్రీడలు దోహదపడ తాయన్నారు. ఏటా వేలాదికోట్ల రూపాయిలు ఖర్చు చేసి విద్యార్థులకు అనేక వసతులు కల్పిస్తున్నామన్నారు. అనంతరం విజేతలకు మంత్రి నక్కా ఆనంద్‌బాబు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామకృష్ణ, సాంఘిక గురుకుల విద్యాలయాల కార్యదర్శి కల్నల్ రాములు, డైరెక్టర్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

అసోం ఒప్పందం భుజమ్మీద తుపాకీ పెట్టి మోడీ సర్కారు తమ హిందూత్వ అజెండాను అమలుచేసేందుకు పూనుకొంటోంది. పౌరసత్వ సవరణ బిల్లు కారణంగా ఈశాన్యంలో అశాంతి రగులు తున్నా, తమతో అస్సాం గణపరిషత్ తెగతెంపులు చేసుకొన్నా లెక్కచేయకుండా బీజేపీ పాలకులు లోక్‌సభలో దాన్ని నెగ్గించుకున్నారు. పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్‌ల నుంచి వచ్చిన ముస్లిమేతర(హిందూ, సిక్కు, జైన, బౌద్ధ, క్రైస్తవ, పార్సీ) వర్గాల పౌరులకు భారత పౌరసత్వం ఇచ్చేందుకు ఉద్దేశించినదీ బిల్లు. శాసనపరమైన ఏ చర్య తీసుకున్నా ప్రజామోదాన్ని ప్రామాణికం చేసుకోవడం ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాల కనీస బాధ్యత. అందుకు విరుద్ధంగా మోడీ సర్కారు పౌరసత్వ సవరణ బిల్లును ముందుకు తీసుకుపోతోంది. పూర్తిగా అమలుకాని 1985నాటి అసోం ఒప్పందాన్ని సాకుగా చూపి, సరిహద్దులోని పొరుగు దేశాల నుంచి పొట్ట చేతపట్టుకొని వచ్చే ముస్లింలకు భారత పౌరసత్వం శాశ్వతంగా నిరాకరించడమే లక్ష్యంగా బీజేపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని తెస్తున్నదనడంలో ఏ మాత్రం సందేహం లేదు. అంటే లౌకికదేశంలో పౌరసత్వాన్ని తమ ప్రాతిపదికపై ఇచ్చే దుర్మార్గమైన వైఖరిని మోడీ సర్కారు చేపడుతున్నదన్నది స్పష్టమవుతోంది. ప్రభుత్వ తీరుకు నిరసనగా అసోం ర్యాలీలు, బంద్‌లతో రగులుతోంది. అసోంతోపాటు మేఘాలయ, మిజోరంలలో కూడా ఎన్డీయే కూటమి భాగస్వామ్య పక్షాలు బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఆ రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ సవరణ బిల్లు ఈశాన్య ప్రాంత ప్రజలకు తీరని అన్యాయం చేస్తుందని ప్రకటించారు. త్రిపుర, నాగాలాండ్, అరుణాచల్, మణిపూర్‌లలో కూడా నిరసనలు రాజుకున్నాయి. ఈ బిల్లును తొలిసారిగా 2016లో పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పుడు అసోంలోని వివిధ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దీంతో దాన్ని సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)కి పంపారు. జేపీసీలో ఎక్కువమంది బీజేపీ వారే ఉండడంతో ఆ పార్టీ ఆశించిన విధంగానే ఆ బిల్లు తిరిగి పార్లమెంటుకు వచ్చింది. మంగళవారం దాన్ని లోక్‌సభ ఆమోదించింది. రాజ్యసభ ఆమోదం పొందాల్సి ఉంది. ఒకపక్క జాతీయ పౌర గుర్తింపు(ఎన్‌ఆర్‌సీ) వ్యవహారం ఒక కొలిక్కిరాకుండానే ఈ పౌరసత్వ సవరణ బిల్లును రంగంలోకి తేవడం బీజేపీ అధినాయకత్వం ఎంత గుడ్డిగా, మూర్ఖంగా వ్యవహరిస్తున్నదో తేటతెల్లం చేస్తున్నది. ఈ బిల్లు ప్రకారం 2014 చివరినాటికి ఆ మూడుదేశాల నుంచి దేశంలోకి ప్రవేశించిన వారికి పౌరసత్వం దక్కుతుంది.. అయితే ముస్లింలకు తప్ప. ఈ బిల్లు కారణంగా కోటిమంది అక్రమ వలసదారులు స్థిరపడిపోతారని అసోం ఆగ్రహం. వాస్తవానికి అక్రమ వలసలకు వ్యతిరేకంగానే 1979-85 మధ్య అసోం ఉద్యమం సాగింది. చివరకు అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీకి, అసోం ఉద్యమకారులకూ మధ్య 1985లో ఒప్పందం కుదిరి ఉద్యమం చల్లబడింది. ఈ ఒప్పందం ప్రకారం అక్రమ వలసలను నిర్ధారించడానికి 1971ని ప్రాతిపదిక సంవత్సరంగా ప్రకటించారు. సుప్రీంకోర్టు కూడా 1951నాటి ఎన్‌ఆర్‌సీ జాబితాను అప్‌డేట్ చేసి అసలు పౌరులు ఎవరో తేల్చాలని ఆదేశించింది. ఒప్పందంలోని తేదీ ప్రాతిపదికగానే అసోంలోకి వచ్చిన బంగ్లాదేశీయులందరినీ విదేశీయులుగా గుర్తించాలని 2015లో మోడీ సర్కారు ఆదేశాలు ఇచ్చింది. కానీ, 2016లో ఇందుకు భిన్నంగా పొరుగుదేశాల నుంచి వలస వచ్చిన హిందువులకు భారత పౌరసత్వం ఇచ్చేలా పౌరసత్వ సవరణ బిల్లును ప్రతిపాదించింది. అసోంలో అక్రమ వలసలకు వ్యతిరేకంగా సాగిన మాట వాస్తవమే అయినా దానిలో కేవలం ముస్లిం వ్యతిరేకతను

మత ప్రాతిపదికన పౌరసత్వమా?

మాత్రమే చూడడం బీజేపీ హిందూత్వ భావనకు, దాని కుట్రకు నిదర్శనం. అది జాతి సమస్య. వారు వ్యతిరేకిస్తున్నది విదేశీయులను తప్ప, ముస్లింలను కాదు. లౌకిక దేశంలోకి ఒక వ్యక్తి అక్రమ ప్రవేశాన్ని మతం ప్రాతిపదికన తూచడాన్ని న్యాయస్థానాలు సైతం సమర్థిస్తాయని భావించాల్సిన పనిలేదు. ఎన్‌ఆర్‌సీలో కూడా మత కోణం లేదు. తగిన ఆధారాలుంటే పౌరులుగా గుర్తింపు పొందవచ్చు. విదేశీయులకు పౌరసత్వం మంజూరును భారత రాజ్యాంగంలోని 5 నుంచి 11వ అధికరణలు నిర్దేశిస్తున్నాయి. ఐదో అధికరణ ప్రకారం భారత రాజ్యాంగం అమలులోకి రావడానికి కనీసం ఐదేళ్లకు తక్కువ కాని కాలం నుంచి దేశంలో ఉన్న వారందరికీ పౌరసత్వం లభిస్తుంది. 8వ అధికరణం ప్రకారం తల్లిదండ్రులు, తాతలు ఈ దేశంలో జన్మించిన వారై విదేశాల్లో ఉంటున్న ఎవరైనా భారత పౌరసత్వానికి దరఖాస్తు చేసుకోవచ్చు. 1987 జూలై1 తర్వాత భారత్‌లో పుట్టినవారి తల్లిదండ్రులలో ఒకరైనా భారతీయులు కాకపోతే వారికి భారత పౌరసత్వం లభించదు. తమకుతాముగా ఏ విదేశీ పౌరసత్వం స్వీకరించినా ఇక్కడి పౌరసత్వం కోల్పోతారని రాజ్యాంగంలోని తొమ్మిదో అధికరణ స్పష్టంచేస్తున్నది. ఏ ఒక్క నిబంధన కూడా పౌరసత్వానికి మతాన్ని ప్రాతిపదికగా చేయలేదు. కానీ బీజేపీ ఈ బిల్లును మతంతో ముడిపెడుతోంది. కాబట్టి దాని అజెండాను అమలు చేయడానికే ఇదంతా చేస్తున్నదనేది స్పష్టమవుతోంది. అసోం ఉద్యమం తర్వాత బంగ్లాదేశ్ నుంచి వచ్చిన ముస్లింల సంగతలా ఉంచినా, 19వ శతాబ్దిలో అసోం టీ ప్లాంటేషన్లలో పనిచేయడానికి వెళ్లిన అవిభక్త బెంగాల్ ముస్లింలను కూడా శతాబ్దాలు గడిచినా విదేశీయులుగా చూసే ధోరణి ఏర్పడింది. దీనికి సామరస్యపూర్వక పరిష్కారాన్ని కనుగొనడమే జటిలమైన ప్రశ్నగా ఉన్నదశలో.. ఇప్పుడు బీజేపీ సర్కారు మూడు దేశాల నుంచి వచ్చిన ముస్లిమేతర వర్గాలకు చెందిన పౌరులకు పౌరసత్వం ఇచ్చే బిల్లు తేవడం సరికొత్త సమస్యలకు దారితీస్తున్నది. మయన్మార్ నుంచి ప్రాణాలరచేత పెట్టుకొచ్చిన రోహింగ్యా ముస్లింలకు ఆశ్రయం నిరాకరించిన భారత్ ఇప్పుడు ఆ మూడు దేశాల నుంచి వచ్చిన ముస్లిమేతరులకు పౌరసత్వం ఇవ్వడానికి సిద్ధం కావడం మానవత్వానికి కాకుండా మతానికే ప్రాధాన్యమిస్తున్న ధోరణి రుజువవు తున్నది. ఈ పౌరసత్వ సవరణ చట్టాన్ని కూడా దేశంలోకి ఉగ్రవాదుల ప్రవేశాన్ని అరికట్టేందుకే తెస్తున్నట్లు కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించడం కూడా పొరుగుదేశాల నుంచి వచ్చే ముస్లింలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యగానే పరిగణించవచ్చు. పెద్ద సంఖ్యలో వలసదారులకు అధికారికంగా భారత పౌరసత్వం దక్కితే స్థానిక భాషలు, సంస్కృతి, ఆర్థిక సామాజిక రంగాలు ఛిద్రమైపోతాయన్న భయాందోళనలతో వారు ఉద్యమ బాట పట్టారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా చేసుకున్న ఒప్పందం పూర్తిగా అమలుకాకపోగా, మోడీ ఈ తాజా బిల్లుతో తమ భవిష్యత్తును నాశనం చేస్తున్నారనే ఆందోళనలో ఉన్న అస్సామీయులు ఆగ్రహావేశాలకు లోనవుతున్నారు. నష్ట నివారణలో భాగంగా బీజేపీ పాలకులు చేస్తున్న ప్రకటనలు కూడా వివాదాన్ని మరింత రాజేస్తున్నాయి. అసోం ఒడంబడికలోని ఆరో షరతు ప్రకారం- స్థానికుల రాజకీయ హక్కుల పరిరక్షణకు కేంద్రం కట్టుబడి ఉందనీ, 371 రాజ్యాంగ అధికరణను వర్తింపజేసి పార్లమెంటరీ, శాసనసభ నియోజకవర్గాల్లో స్థానికులకు కోటా కట్టబెడతామంటోంది. అదే జరిగితే హిందూ బెంగాలీలతో పాటు ముస్లిమ్ బెంగాలీల నుంచీ నిరసన తప్పదు. ఇలా బీజేపీ సర్కారు సమస్యను మరింత జటిలం చేస్తున్నది. దీంతో ఈశాన్యంలో పరిస్థితులు మళ్లీ అదుపు తప్పే ప్రమాదం పొంచి ఉంది. కాబట్టి ఈ సవరణ బిల్లు ఆలోచనను బీజేపీ సర్కారు విరమించుకోవడం అన్ని విధాలా ఉత్తమం.

చురక

అస్సాంలో పౌరసత్వ
ఆందోళన పెరిగే చిచ్చు
ప్రశ్నిస్తే దేశద్రోహం
ప్రభుత్వం పన్నే ఉచ్చు

అక్రమ చొరబాటుకు
ఆమోదం తెలిపే బిల్లు
అస్తిత్వం స్థానికతలు
ఆవిరైతే కంట్లో నీళ్లు

– వేల్పుల నారాయణ

అభద్రతా భావమే అసలైన సమస్య

విశ్లేషణ


ఈదర శ్రీనివాసరెడ్డి

మన దేశం నేడు ఎదుర్కొంటున్న తీవ్రమైన సామాజిక సమస్య ఏదన్నాఉందంటే అది సామాజిక అసమానతే. మన భారతీయ సమాజం ఎదుర్కొంటున్న తీవ్రమైన ఆర్థిక సమస్య ఏదన్నా ఉందంటే అది దారిద్ర్యం కానే కాదు. ఆర్థిక అభద్రతా భావం మాత్రమే. మన దేశంలోని ఐదో వంతు జనాభా దారిద్ర్య రేఖకు దిగువున నివసిస్తున్నారు. దారిద్ర్య రేఖకు ఎగువన వున్న వర్గాలు సైతం భయానకమైన ఆర్థిక అభద్రతా భావానికి లోనవుతున్నారు. సరైన ఉద్యోగాలు లేక వృద్ధాప్యంలో ఆదుకునేవారు లేక, వయసు మీద పడే కొద్దీ ఆరోగ్య సమస్యలు ఎక్కువై, ఇలా రకరకాల సమస్యలతో ప్రతి ఒక్కరూ అభద్రతా భావానికి లోనవుతున్నారు. ఇటువంటి అభద్రతాభావనలు ప్రజల్లో ఎక్కువైనప్పుడు, సమాజంలో అలజడులు, ఆందోళనలు పెరిగి ప్రజలు వీధుల్లోకొచ్చే ప్రమాదం లేకపోలేదు.

ఒక్కోసారి ఆర్థికంగా సమస్యలు లేకపోయినా ఏదో కోల్పోతున్నాము అనే భావన బయలుదేరితే, అది అసహనంగా మారి ఆందోళనకు దారి తీస్తుంది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలు, రాష్ట్ర విభజనలు, ప్రత్యేక హోదా ఉద్యమాలు తీవ్ర రూపం దాల్చటానికి కారణం ప్రజల సహనాన్ని పరీక్షించటమే. ఇప్పుడు దేశవ్యాప్తంగా జరుగుతున్న అన్నదాతల ఆందోళనలు, నిరుద్యోగుల నిరసనలు ఇటువంటివే. వ్యవసాయ రంగంలోని సంక్షోభానికి కారణం, వ్యవసాయ దిగుబడులు తగ్గటం, మద్దతు ధరలు లభించకపోవటం, కౌలుదార్లకు ఎటువంటి ప్రభుత్వం సహాయం దొరకకపోవటం వంటివి ముఖ్యమైనవి. ఈ సంక్షోభానికి ఒక పార్టీనో, ప్రభుత్వాన్నో తప్పు పట్టలేం. దశాబ్దాల తరబడి అన్నిపార్టీ, ప్రభుత్వాలూ వ్యవసాయాన్ని, వ్యవసాయ అనుబంధ పరిశ్రమల్ని నిర్లక్ష్యం చేస్తూ రావటం వల్లే రైతుల్లో అసహనం పెరుగుతూ వచ్చి రోడ్లపైన నిరసనలు తెలుపుతున్నారు. ఎంత కాలం చూసినా వ్యవసాయం గిట్టుబాటు కావట్లేదని తెలిసి, వ్యవసాయానికి స్వస్తి చెప్పి, వ్యవసాయేతర పనుల వైపు పెద్దఎత్తున వలసపోతున్నారు. దీనివల్ల పరోక్షంగా ఉద్యోగ మార్కెట్లపై తీవ్ర ఒత్తిడి పెంచుతోంది.

ఇంతకాలం ఓపిక పట్టిన రైతులు ఇప్పుడెందుకు రోడ్లెక్కుతున్నారు. నిరుద్యోగ సమస్య కూడా దీర్ఘకాలంగా ఉన్న సమస్యే. మరిప్పుడెందుకు యువత తిరగబడే పరిస్థితికి వచ్చింది? వీటన్నింటికీ ఒకే సమాధానం వస్తుంది. అది రాజకీయ నాయకుల అవగాహన లేని ఎన్నికల వాగ్దానాలే. అటు కేంద్రప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు సాధ్యపడని వాగ్దానాలిచ్చి, నెరవేర్చలేక పోవటమే. ఇంటికో ఉద్యోగమిస్తామని ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తులు ప్రకటించటంతో ప్రజలు నిజమని నమ్మారు. కాని గడచిన నాలుగేళ్ళలో ఊరికో ఉద్యోగం కూడా ఇవ్వలేక పోయారన్నది నిజం. ఇచ్చిన ఒకటి అర ఉద్యోగాలు అస్మదీయులకు, లంచాలిచ్చిన వారికి కట్టబెట్టటంతో యువతలో నిరుత్సాహం గూడుకట్టుకుని ప్రభుత్వాన్ని నిలదీసే స్థాయికి వచ్చారు. దేశ వ్యాప్తంగా సమాజంలో అధిక సంఖ్యలో ఉన్న మరాఠాలు, పతిదార్లు, జాట్లు, కాపులు వంటి వాళ్ళ ఆందోళనల వెనుక ఉన్న కారణం ఆవర్గాలకు సరైన ఉద్యోగాలు లభించకపోవటమే.


రైతుల ఆందోళన (ఫైల్ ఫోటో)

పెద్దఎత్తున ఆర్థిక అభద్రతా భావాన్ని ప్రజల నుంచి తొలగించాలంటే, సామాజిక రక్షణ కల్పించే వివిధ పథకాలు, ప్రణాళికలు అమలు పరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందులో ఒక భాగమే ఉద్యోగ కల్పన. దేశంలోని నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు కల్పించటం చాలా కష్టసాధ్యమైన పనే. ఇది ఒకటి, రెండు సంవత్సరాల్లో జరిగే పని కూడా కాదు. ఏ రకంగా అయితే గ్రామీణ ప్రాంతాల్లోని వారికి ఉపాధి కల్పించటానికి మహాత్మాగాంధీ జాతీయగ్రామీణ ఉపాధి పథకం ద్వారా గ్రామాల్లో కనీస ఉపాధి కల్పిస్తున్నారో, అదే విధంగా పట్టణ ప్రాంతాల్లో జరిగే అభివృద్ధి, నిర్మాణ పనుల్లో నిరుద్యోగ యువతకు చోటు కల్పించే పథకాన్ని ప్రవేశ పెట్టగలిగితే ఈ అసహనాన్ని కొంత మేర చల్లార్చిన వాళ్ళమవుతాము.

ప్రజలను, ముఖ్యంగా రైతులను నిరాశకు గురి చేసిన మరో అరివికాని, ఆచరణాత్మకం కాని పథకం రుణమాఫీల, రైతులు చేసిన అప్పులు లక్ష నుంచి రెండు లక్షల వరకు మాఫీ చేస్తామని ఎన్నికలప్పుడు వాగ్దానాలు చేసి రైతుల్లో లేని ఆశలకు నీళ్ళు పోశారు. తీరా అధికారంలోకొచ్చిన తరువాత అది సాధ్యపడే విషయం కాదని తెలిసొచ్చింది. అయినా కూడా అధికారాన్ని కొనసాగించటానికి ఇంకా సుష్క వాగ్దానాలు చేస్తున్నారు. చివరకు దేశం మొత్తం ఈ పథకం అమలు చెయ్యాలని చూస్తున్నారు. ఒక వేళ అదే నిజమైతే 4ట్రిలియన్ రూపాయలు అవసరమవుతాయి. ఒక వేళ తెలంగాణ ప్రభుత్వం ప్రకటించినట్లు రైతులకు నగదు రూపేణా మద్దతు ఇచ్చినా 2 ట్రిలియన్ల పైనే ఖర్చవుతుంది. ఇటువంటి సమస్య అధిగమించడానికి ఒక కొత్త విధానం తెరపైకి వస్తోంది. అది "అంతర్జాతీయ ప్రాథమిక ఆదాయ అనుబంధ పథకం (యు.బి.ఐ.ఎస్)".

ప్రస్తుతం అమలవుతున్న రైతు బీమా, పంటల బీమా వంటి వాటిల్లో అతి తక్కువ ప్రీమియం కట్టటం వల్ల పంట నష్టాలకు బీమా సమకూరుతుంది. కాని క్షేత్ర స్థాయిలో మాత్రం వీటివల్ల ఏ ఉపయోగం లేదని తేలింది. ఎక్కువ బీమా కంపెనీలు ప్రైవేటు రంగంలోనివి కావటం వల్ల పంట నష్టాలకు ఇచ్చే బీమా సొమ్ము చెల్లింపులు సకాలంలో చెల్లించకపోవటం, చెల్లించిన సొమ్ము చాలా తక్కువగా ఉండటం వల్ల ఎక్కువ మంది వీటిపై ఆసక్తి కనబరచటం లేదు. అందుకనే వీటి స్థానంలో యు.బి.ఐ.ఎస్‌ను తీసుకురావటం జరుగుతోంది. యు.బి.ఐ.ఎస్ పథకం కేవలం రైతులే కాదు ఆర్థిక అసమానతలకు గురవుతున్న వారందరికీ ఇది వర్తిస్తుంది. పెద్ద ఎత్తున అమలయ్యే పథకానికి కూడా పెద్ద మొత్తంలో నిధులు అవసరమవుతాయనడంలో సందేహం లేదు. ఈ మొత్తాన్ని సమీకరించు కోవాలంటే, జనాభాలో దారిద్ర్య రేఖకు ఎగువునున్న కొన్ని వర్గాల వారు అనుభవిస్తున్న వివిధ సబ్సిడీ పథకాలకు మంగళం పాడాల్సివస్తుంది. ఇటువంటి సబ్సిడీలు మనదేశ జీడీపీలో 6 శాతంగా ఉన్నాయి. మరో 2 శాతం, సంపదపై పన్నులను పెంచటం వల్ల సమకూరుతుంది. ఇప్పటి దాకా ఆదాయ పన్ను పథకంలోకి రాని పట్టణ ప్రాంతాల్లోని ఎగువ మధ్య తరగతి వర్గాలను కూడా పన్ను పరిధిలోకి తీసుకురావటం, దీర్ఘకాల పెట్టుబడులపై వడ్డీరేట్లు తగ్గించటం వంటి కొన్ని సంస్కరణలను తీసుకురాగలిగితే మరికొంత సమకూర్చుకోవచ్చు. మొత్తం మీద ఓ పది శాతం (జీడీపీలో) ఆదాయాన్ని సమకూర్చు కోగలిగితే ఇటువంటి పథకాలు సాధ్యమౌతాయి. ముఖ్యం గా ఈ నిధుల అవసరమైన వర్గాల కుటుంబంలోని మహి ళలకందిస్తే కొంత మేరైనా సద్వినియోగం అవుతాయి.

కాని ఇటువంటి పథకాలన్నీ ఆలోచనల్లోనే సఫలీకృతమౌతాయి. ఆచరణలో కాదని మన ఆర్థిక మేధావులు ఏమాత్రం ఇటువైపు తమదృష్టి మరల్చకపోవటం దురదృష్టకరం. నిజానికి ఈ మేధావులు ఇప్పటిదాకా ఇటువంటి ఆలోచనలు చెయ్యలేదనే చెప్పవచ్చు. అందుకనే వీరి పాత్రను కూడా రాజకీయ నాయకులే నిర్వర్తిస్తున్నారు. వీరికున్న అరకొర మేధస్సుతో ప్రజాకర్షక పథ కాలు ప్రకటిస్తూపోతున్నారు. వీటికెంత ఖర్చవుతుంది. మనదేశ ఆదాయం ఎంత, ఎలానిధులు సమకూరుతాయి వంటి విషయాలు గురించి ఏమాత్రం విశ్లేషణ చేసిన సందర్భాలు కానరావు. ఇటువంటి ఆర్థిక సంబంధమైన పథకాలను ప్రకటించే ముందు ఒకరిద్దరు ఆర్థిక ఉద్దండులతో చర్చించి, తదనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలి. కాని రాజకీయ మూర్ఖులు కేవలం ఎన్నికల్లో గెలవాలనే ఏకైక లక్ష్యంతో ప్రజలను ఏమార్చుతున్నారు. పోనీ అధికారంలో కొచ్చిన తరువాతయినా వీటిపై ప్రతి పక్షాలతో కలిసి అర్థవంతమైన, ఆచరణాత్మకమైన ఆలోచనలు చేసినట్లయితే పరిష్కారాలు కనపడకపోవు. కాని దురదృష్టవశాత్తు అధికారం ఉందికదా అని మూర్ఖంగా ముందుకెళితే దేశ భవిష్యత్తునే పాడుచేసిన వాళ్ళవుతారు. ఇటువంటి సంఘటనలు ఇప్పటికే ఎన్నో పునారావృతమయ్యాయి. పెద్దనోట్ల రద్దు, జి.ఎస్.టీ, రిజర్వ్‌బ్యాంకు స్వయం ప్రతిపత్తి ఇలా చెప్పుకుపోతే, చాలా పరిణామాలు ప్రజల్లో ముఖ్యంగా మధ్యతరగతి, దిగువ మధ్యతి వర్గాల్లో అసహనాన్ని రేపాయన్నది నిర్వి వాదాంశం. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్నాయని ఉపశమన చర్యల పేరుతో తాయిలాలు ప్రకటించి మళ్ళీ కొత్త ఆశలను నాటటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

రాజకీయ నాయకుల వ్యాపారం అదే కాబట్టి వారిని తప్పు పట్టాల్సిన పనికూడా లేదు. ప్రజలే అటువంటి కలల బహారుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఇటువంటి అలవికాని పథకాలు అమలు చెయ్యాలని కొరుకోవటం కూడా దురాశ అవుతుంది. దురాశతో తమవి కానివి కూడా కోరుకునేవాళ్ళకు నిరాశే మిగులుతుంది. ఆ నిరాశ, నిస్పృహగా మారక ముందే అందరం మేల్కొంటే దేశ భవిష్యత్తుకు మంచిది. లేకపోతే "అచ్చేదినే ఆగయా" అంటూ ఒకళ్ళు, "బంగారుతెలంగాణా" అంటూ ఇంకొకరు, "అందాల అమరావతి" అని వేరొకరు మన కళ్ళకు గంతలు కడుతూనే ఉంటారు.

వ్యాస రచయిత : డీన్, ఆ.నా.వి.

ఓటింగ్ శాతం పెంచడానికి
ఎన్నికల సంఘం కృషి

శిరందాసు నాగార్జున

> ఓటు, పోలింగ్ స్టేషన్ వంటి విష యాలలో ఎవరికైనా ఏవైనా అను మానాలు ఉంటే ఎన్నికల సంఘం టోల్ ఫ్రీ నెంబర్ 1950కి ఫోన్ చేసి నివ ృత్తి చేసుకొనే వెసులుబాటు కల్పించారు. రాష్ట్ర శాసనసభ స్థానాలు, ఓటు హక్కు ప్రాధాన్యత, ఓటర్ నమోదు పత్రం... వంటి కమిషన్ కు సంబంధించిన సమాచారంతో 2019 కేలండర్ విడుదల చేశారు. జనవరి 26న జాతీయ ఓటర్స్ డే సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించి 18 ఏళ్లు నిండిన వారిలో అత్యధిక మందిని ఓటర్లుగా చేర్చడానికి కమిషన్ తగిన ఏర్పాట్లు చేస్తోంది.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రధాన్యతను పౌరులకు తెలియజేస్తూ ఎన్నికలలో ఓటు వేసేవారి శాతాన్ని పెంచడానికి భారత ఎన్నికల సంఘం క ృషి చేస్తోంది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆర్.పి .సిసోడియా ఇంకో అడుగు ముందుకు వేసి అవకాశం ఉన్నమేరకు అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి ఎన్నికలకు ఉన్న ప్రాధాన్యత తెలిపి, వారిలో అవగాహన పెంచడానికి చర్యలు చేపట్టారు. ఓటర్ ఐడీ(ఎలక్టొరల్ ఫొటో ఐడెంటిటీ కార్డ్)తో ఓటర్ సెల్ నెంబర్ అనుసంధానం చేసి ఎన్నికలు, ఎన్నికల సంఘానికి సంబం ధించిన సమాచారం ఓటర్‌కు అందజేయడానికి కమిషన్ ఏర్పాట్లు చేస్తోంది. దీనికి సంబంధించిన వెబ్ సైట్ ని రూపొందించి తుదిమెరుగులు దిద్దుతున్నారు. నాలుగు రోజుల్లో దీనిని ప్రారంభిస్తారు. వెబ్ సైట్ ద్వారా ప్రతి ఓటర్ తన ఓటర్ ఐడీతో సెల్ నెంబర్ ని అనుసంధానం చేసుకునే సౌకర్యం కల్పిస్తారు. దాంతో ఆ సెల్ నెంబర్ కు ఓటర్ పేరు, తండ్రి పేరు, ఊరు పేరు, పోలింగ్ కేంద్రం అడ్రస్, పోస్టల్ పిన్ కోడ్... తదితర వివరాలన్నీ జతవుతాయి. ఇటువంటి విధా నాన్ని దేశంలో తొలిసారిగా మన రాష్ట్రంలోనే మొదలు పెడుతున్నారు. రాష్ట్రంలో ఉన్న 3 కోట్ల 70 లక్షల మంది ఓటర్లలో దాదాపు 90 శాతం మందికి సెల్ ఫోన్లు ఉండే అవకాశం ఉంది. వారిలో ఎక్కువ శాతం మంది అను సంధానం చేసుకునే అవకాశం ఉంది. ఈ విధానం ద్వారా ఓటర్ కూడా కమిషన్ కు మెసేజ్ పంపి తనకు కావలసిన సమాచారం పొందే అవకాశం ఉంది. ఓటర్ వివరాలన్నీ సెల్ నెంబర్ తో అనుసంధానం కావడంతో మెసేజ్ రాగానే ఓటర్ కు కావసిన పోలింగ్ కేంద్రం అడ్రస్, ఓటర్ ఇంటి నుంచి కేంద్రం దూరం తదితర వివరాలు అతనికి పంపడానికి అవ కాశం ఉంటుంది. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే పట్టణ ప్రాంతాలలో పోలింగ్ శాతం తక్కువగా ఉంటుంది. అందువల్ల పట్టణ ప్రాంతాలలో ఓటర్ ని పోలింగ్ కేంద్రానికి రప్పించడానికి, పోలింగ్ శాతం పెంచడానికి కూడా కమిషన్ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఓటర్ కు తన ఇంటి నుంచి పోలింగ్ స్టేషన్ ఎంత దూరం ఉంటుందో, వెళ్లే మార్గం, పోలింగ్ స్టేషన్ లో ఏ సమయంలో ఎంతమంది బారులుతీరి ఉన్నారో తెలియజేసే ఏర్పాట్లు కూడా చేయనుంది. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరిని ఓటర్లుగా చేర్పించడానికి కూడా కమిషన్ అనేక చర్యలు తీసుకుంటోంది. ఓటు విలువను తెలియజెబుతూ ఎలక్ట్రానిక్, ప్రింట్, సోషల్ మీడియా వంటి అన్ని రకాల మాధ్యమాల ద్వారా విస్త ృత స్థాయిలో ప్రచారం చేస్తోంది. రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి, మండల, గ్రామ స్థాయిలో తొలిసారి కొత్తగా ఓటర్లుగా పేర్లు నమోదు చేయిం చుకున్న యువతీ, యువకులను, దివ్యాంగులను సన్మాని స్తున్నారు. రాష్ట్ర స్థాయిలో 20 మంది కొత్త ఓటర్లను సన్మా నించి, ప్రోత్సాహకంగా వారి కి ట్యాబ్ లు కూడా కమిషన్ అందజేసింది. ఇప్పటి వరకు నమోదైన ఓటర్ల పేర్లతో జనవరి 11న జాబితా విడుదల చేస్తుంది. పౌరులు ఆ జాబితాలో తమ పేరు ఉందో లేదో చూసుకొని లేని వారు తమ పేరు నమోదు చేయించు కోవచ్చు. ఓటర్ల పేర్ల నమోదు, జాబితా రూపొం దించడంలో ఎక్కడా ఎటువంటి అవకతవకలకు తావులేకుండా రాష్ట్ర వ్యాప్తంగా క్షేత్ర స్థాయిలో నలుగురు ఐఏఎస్ అధికారులు స్వయంగా పర్యవేక్షిస్తుంటారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కూడా వివిధ ప్రాంతాలలో పర్యటించి స్వయంగా పరిశీలిస్తారు. 85 ఏళ్లు దాటిన వృద్ధుల జాబితా ప్రత్యేకంగా తయారు చేశారు.

ఎన్నికలు అందరికీ అందుబాటులో ఉండేవిధంగా, అంద రూ ఓటు వేసే విధంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పించ నుంది. ఇందు కోసం 9 మందితో రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి, శాసనసభ నియోజకవర్గ స్థాయిలలో స్టీరింగ్ కమిటీలు సూచనలు సలహాలు ఇస్తాయి. వ ృద్ధులు, అంధులు, మూగ, చెవుడు గలవారు, దివ్యాంగులు, పోలింగ్ కేంద్రాలకు రావడానికి వాహనాలు ఏర్పాటు చేసే ఆలోచనలో కమిషన్ ఉంది. వారి కోసం పోలింగ్ స్టేషన్ల వద్ద వీల్ చైర్లు ఏర్పాటు చేస్తారు. వారు క్యూలో నిలబడకుండా నేరుగా వెళ్లి ఓటు వేసే సౌకర్యం కల్పిస్తారు. అవకాశం ఉన్నంత వరకు భవనాలలో పోలింగ్ కేంద్రాలు కిందే ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నారు. పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేవాటిలో ప్రభుత్వ ప్రైవేటు భవనాలను గుర్తించి పోలింగ్ కు అనువుగా వాటికి తీర్చిదిద్దుతున్నారు. ఓటర్ల జాబితాను చాలా పకడ్బందీగా రూపొందిస్తున్నారు. రెండుమూడు చోట్ల నమోదైన దాదాపు 27 లక్షల పేర్లను ఇప్పటికే జాబితా నుంచి తొలగించారు. పేర్లు తప్పుగా నమోదు కావడం, భర్త పేరు బదులు భార్య పేరు, భార్య పేరు బదులు భర్త పేరు, తండ్రి పేరు, ఇంటి నెంబర్.... ఇలా వివిధ రకాలుగా తప్పుగా నమోదైన 3 లక్షల 50 వేల పేర్లను కూడా తొలగించారు. అనుమానాస్పదంగా ఉన్న మరో లక్షా 30 వేల పేర్లను కూడా తొలగించారు. ఓటర్ల నమోదు, ఎన్నికల నిర్వ హణలో ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహ రిస్తుంది. ఎన్నికలు విజయ వంతంగా నిర్వహించడానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ వేసే చివరి రోజు వరకు ఓటర్లుగా నమోదు చేయించుకొనే అవకాశం కమిషన్ కల్పించింది. ఆ తరువాత ఎన్నికల ముందు తుది జాబితా విడుదల చేస్తారు. ఓటు, పోలింగ్ స్టేషన్ వంటి విష యాలలో ఎవరికైనా ఏవైనా అను మానాలు ఉంటే ఎన్నికల సంఘం టోల్ ఫ్రీ నెంబర్ 1950కి ఫోన్ చేసి నివ ృత్తి చేసుకొనే వెసులుబాటు కల్పించారు. రాష్ట్ర శాసనసభ స్థానాలు, ఓటు హక్కు ప్రాధాన్యత, ఓటర్ నమోదు పత్రం... వంటి కమిషన్ కు సంబంధించిన సమాచారంతో 2019 కేలండర్ విడుదల చేశారు. జనవరి 26న జాతీయ ఓటర్స్ డే సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించి 18 ఏళ్లు నిండిన వారిలో అత్యధిక మందిని ఓటర్లుగా చేర్చడానికి కమిషన్ తగిన ఏర్పాట్లు చేస్తోంది.

వ్యాస రచయిత : సీనియర్ జర్నలిస్ట్,
సెల్ : 9440222914

వి-మెయిల్స్



ఈశాన్యంలో మంటలు ఎవరి సౌజన్యం?

కొన్నేళ్లుగా ప్రశాంతంగా ఉన్న ఈశాన్య భారతం మళ్లీ ఆందోళనల బాట పట్టడం బాధాకరం. ఆసియా దేశంలోనే పొడవైన వంతెన నిర్మాణం సహా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో మిగతా ప్రాంతానికీ, ఈశాన్యానికీ మధ్య అంతరాలు తగ్గుతున్న వేళ మళ్లీ ఆ ప్రాంతంలో మంటలు రేగడం, 1980ల నాటి పరిస్థితులు పునరావృతమయ్యే సూచనలు పొడచూపడానికి కేంద్రమే భాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇప్పటి అలజడి లోక్‌సభలో ప్రభుత్వం తీసుకువచ్చిన పౌరసత్వ సవరణ బిల్లు ఫలితం. దాని ప్రకారం 2014 వరకూ అస్సాం మరియు ఈశాన్య ప్రాంతంలోకి పొరుగు దేశాలనుండి అక్రమంగా వలస వచ్చిన ముస్లిమేతరులు, ఆరేళ్లుగా స్థిర నివాసం ఉన్నట్లయితే భారత పౌరులుగా గుర్తింపబడతారు. ఆ ప్రాంతవాసుల అసలు ఆందోళన అక్రమ వలస దారులతో స్థానికుల అవకాశాలు, వనరులు చేజారుతున్నందున వారిని నియంత్రించమని. అందరినీ అడ్డుకోమని తప్పితే మతం వారీ అడ్డుకోమని కాదు.

ఆ దిశగా కుదిరిన అస్సాం ఒప్పందం 1971 తర్వాత అలా వచ్చి చేరిన వారందరినీ అక్రమ వలసదార్లుగా గుర్తించమని. ప్రభుత్వం చేపట్టిన జాతీయ పౌరసత్వ గణనలో పాటిస్తున్న నిబంధన అదే. ఇప్పుడు ఈ బిల్లు అలా అక్రమ వలసదారులన్న ముద్రపడిన వారిలో నలభై లక్షల మంది హిందువులు మరియు ఇతర ముస్లిమేతరుల్ని అస్సాంలో భారత పౌరులుగా గుర్తిస్తుంది. మిగిలిన వారిని మినహాయిస్తుంది. ఈ బిల్లు లబ్ధిదారుల్లో మతపరంగా విభజన తీసుకురావడం, అక్రమ చొరబాట్లపై నియంత్రణ సడలించడం అన్న వైపరీత్యపు భావాలు కలిగివుండడం అక్కడ స్థానికుల్లో, రాజకీయ పక్షాల్లో తీవ్ర అలజడికి కారణం. వారి న్యాయమైన కోరికల పట్ల సానుకూలంగా స్పందించాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉంది. అయితే గొంతెత్తి ప్రశ్నిస్తున్న ఆ ప్రాంతవాసుల్లో ముగ్గురిపై - ఒక సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, సీనియర్ జర్నలిస్టు, సమాచార హక్కు ఉద్యమకారుడు పై-దేశద్రోహం కేసు పెట్టిన ప్రభుత్వం అసలు సమస్యపై సానుకూలంగా స్పందిస్తుందన్న నమ్మకం కుదరడం లేదు.

– డా.డి.వి.జి.శంకరరావు
మాజీ ఎంపీ, పార్వతీపురం

జాతీయ సైన్సు కాంగ్రెస్ సభలను ఏర్పాటు చేస్తుంది ఎవరు?

పురాణాలు కల్పితం. చరిత్ర వాస్తవం. దేశ ప్రజలను మధ్య యుగాలలోకి తీసుకెళ్లాలని చూస్తుంది కేంద్రప్రభుత్వం. ఒక కుట్ర జరుగుతుంది. అందులో భాగమే సైన్సు సభలలో ఈ రకంగా వేదాలలో సైన్సు ఉన్నదని చెప్పటం. గత సభలలో ప్రధాని మోడీ వెదకాలంలో విమానాలున్నాయని, వినాయకుని తల అతికించటం శాస్త్రీయమనటం , ప్రస్తుత సభలలో మేధావులుగా చెలామణి అయ్యేవారు కొంతమంది శాస్త్రవేత్తలను కించపరిచేవిధంగా మాట్లా డటం, మానవ పరిణామవాదాన్ని కాదనటం, బ్రహ్మ డైనోసార్లను ముందుగానే చూచాడని చెప్పటం, కౌరవుల పుట్టుక కూడా నేటి సైన్సుతో పోల్చటం, రావణాసురుడికి 24 విమానాలుండేవని చెప్ప టం ఇదంతా కుట్రలో భాగమే .రావణాసురునికే విమానాలుంటే అవతార పురుషుడైన రాముడి కెందుకు లేవు? మీ దేవులకు గదలు, బాణాలు, చక్రాలు, త్రిశూ లాలు, ఆయుధాలుగా ఎందుకున్నాయి? పురాణాలు తెరిస్తే మంత్ర ము, మహిమలు వున్నాయి గదా! శత్రువులపై ఎందుకు ప్రయోగించరు ? అరణ్యవాస సమయంలో సీత కనిపించకపోతే రాముడు మంత్రంద్వారా, మహిమ ద్వారా సీత ఎక్కడుందో తెలుసు కొవచ్చుగదా! ఏడుస్తూ కూర్చోవటం ఎందుకు? విలన్ రావణాసురుని విమానాలున్నపుడు హీరో రాముడికి ఎందుకులేవు? ఆలోచించండి ఏకకణ జీవినుండి బహుకణ జీవి, అమీబా, ఇరకంగా లక్షల సంవత్సరాల పరిణామక్రమంలో ఆదిమ మానవునికి బట్టలేదు, భాషలేదు, ఇల్లులేదు. కొండగుహలలో, చెట్టుతొఱ్ఱలలో జీవించేవాడు. పచ్చిమాంసం తినేవాడు. వర్షం, ఎండ, గాలి ఎందుకు ఎలా వస్తున్నాయో తెలియదు. మనిషి ఆలోచన పెరిగేకొద్ది వాస్తవాన్ని గ్రహించాడు. అందుకు శాస్త్రవేత్తలు తమ జీవితాలను పణంగా పెట్టి ప్రయోగాల ద్వారా నూతన శకాన్ని ఆవిష్కరించారు.అలాంటి శాస్త్రవేత్తలను కూడా అవమానపరచేవిధంగా ఈ సూడో సైంటిస్టులు మాట్లాడుతున్నారు. వీరికి తగిన విధంగా బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉంది.

– నార్నె వెంకటసుబ్బయ్య
అధ్యక్షుడు, ఏపీ హేతువాద సంఘం

విశాలాంధ్ర
బతుకు
The Life
శనివారం
12 జనవరి 2019





కృష్ణాజిల్లా బట్లపెనమర్రులోని తొలితరం కమ్యూనిస్టు యోధుడు చలసాని వాసుదేవరావు స్మారక స్థూపం వద్ద ఆలపిస్తున్న వందేమాతరం, పక్కన ప్రజానాట్యమండలి కృష్ణాజిల్లా కార్యదర్శి కోసూరి అప్పారావు

ఈ తరాన్ని కదిల్చిన స్వరం

అతను ఎర్రజెండా పాట పాడితే...
రోమాలు నిక్కబొడుచుకుంటాయి..!
అమరవీరుల పాట పాడితే...
తనువు, మనస్సు జోహార్లర్పిస్తాయి..
ఉప్పెన పాట పాడితే...
కళ్లు చెమరుస్తాయి..!
ఆ గొంతు...గాంభీర్యం, మాధుర్యం కలబోత

ఆయన ఎవరో ఈపాటికే అర్థమైపోయి ఉంటుంది. "తరం మారుతు న్నది..ఆ స్వరం మారుతున్నది" అంటూ సరికొత్తగా వందేమాతరం గీతాన్ని వినిపించి..ఆ సినిమా టైటిల్‌నే తన పేరుగా మార్చుకున్న ప్రముఖ ప్రజాగాయకుడు, సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్. ఆయన నటుడిగానూ మనకు సుపరిచితమే. శ్రీనివాస్...వందేమాతరం శ్రీనివాస్‌గా ఎదగడం వెనక ఓ నిండైన వ్యక్తిత్వం, ఓ తాపత్రయం, గొప్ప కృషి, ప్రయత్నం ఉన్నాయి. ఆయన ఓ తరాన్ని కదిల్చిన గాయకుడు మాత్రమే కాదు ఎంతోమంది కొత్త వాళ్ళకు అవకాశాలిచ్చిన మనసున్న మంచి సంగీత దర్శకుడు. వందేమాతం శ్రీనివాస్‌ను రాష్ట్ర సంగీత, నృత్య అకాడమీ ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమించిన సందర్భంగా విశాలాంధ్ర ఆయనను పలకరించింది. ఆ వివరాలు...విశేషాలు...ఆయన మాటల్లోనే!

ప్రజానాట్యమండలిలోకి ప్రవేశం

నేను ప్రజానాట్యమండలిలోకి రావడం గురించి చెప్పాలంటే ముందుగా ప్రజానాట్యమండలి గురించి కొంత చెప్పాలి. మా పెద్దన్న అంజయ్య ప్రజానాట్యమండలిలో బుర్రకథలు, పాటలు నేర్పిస్తూ చురుగ్గా ఉండేవారు. ఆయన ద్వారా ఈ సంస్థ కార్యక్రమాలపై కొంత అవగాహన కలిగింది. 1975 సెప్టెంబరులో ఖమ్మంలో ప్రజానాట్యమండలి శిక్షణా శిబిరం జరిగింది. ఏడు రోజులు పాటు జరిగిన ఈ శిక్షణాశిబిరంలో ఎందరో కళాకారులు, గాయకులు తమ కళలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు. మొదటి మూడు రోజులు అక్కడే బయట తచ్చాడా. అలాంటి సమయంలో ఆ సభ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) లోపలికి పిలిచి ఏంటని అడిగారు. 'అన్నా ! నేనూ పాట పాడుతా' అని అడగ్గానే..నాలోని ఉత్సాహం చూసి పాడేందుకు అవకాశం ఇచ్చారు. శ్రీశ్రీ రాసిన 'తెలుగు వీర లేవరా..' పాటను పాడాను. ఇంత చిన్న కుర్రాడు ఎంత బాగా పాడుతున్నాడు...అని నల్లూరి మంత్రముగ్ధులయ్యారు. శ్రీనివాస్‌లో ప్రతిభను ఆనాడే గుర్తించిన అన్న ఒంగోలు రమ్మని కబురుపెట్టారు. వెంటనే రైలెక్కి ఒంగోలు చేరుకున్న శ్రీనివాస్‌ను అన్న తన ఇంటికి తీసుకువచ్చారు. ఠాగూర్ ట్యుటోరియల్ కళాశాలలో చేర్పించి మెట్రిక్యులేషన్ పూర్తి చేయించారు. ఇలా నేను ఇక్కడే ఉండి చదువుకుంటూ, పాటలు పాడుతూ ప్రజానాట్యమండలి సభ్యుడిగా, ఏఐఎస్ఎఫ్ కార్యకర్తగా పనిచేశాను. ఇక్కడ ప్రజానాట్యమండలి గురించి చెప్పాలి. జాతీయస్థాయిలో కమ్యూనిస్టు భావజాలాన్ని ప్రజల్లో వ్యాప్తి చేసేందుకు, దోపిడీ, దుర్మార్గాన్ని కళ్లకు కట్టినట్టు చూపించేందుకు స్వాతంత్ర్యానికి పూర్వం కమ్యూనిస్టు పార్టీకి ఆలంబనగా జాతీయస్థాయిలో 'ఇండియన్ పీపుల్స్ అసోసియేషన్' ఉండేది. దానికి అనుబంధంగా రాష్ట్రంలో ప్రజానాట్యమండలి ఏర్పడింది. క్రమశిక్షణ, నైతిక విలువలు, అభ్యుదయ భావాలు నింపుతూ మట్టిలోని మాణిక్యాలనెందరినో మేటి కళాకారులుగా తీర్చిదిద్దిన ఘనకీర్తి ఈ ప్రజానాట్యమండలిదే. మాదాల రంగారావు, టి.కృష్ణ వంటి హేమాహేమీలు ఈ సంస్థ సభ్యులే.



సీపీఐ రాష్ట్రమహాసభల సందర్భంగా కడపలో చైతన్య గీతం ఆలపిస్తూ...

విప్లవ గాయకుడిగా..

వందేమాతరం శ్రీనివాస్ అనగానే సాధారణంగా విప్లవ గాయకుడు అంటారు. కానీ, ఆయన పాడిన వందల పాటల్లో విప్లవగీతాలు ఉన్నది పదుల సంఖ్యలోనే అంటే ఆశ్యర్యం కలగక మానదు. కాని ఇది నిజం. 'శ్రమజీవుల హక్కులకై అసువులు బాసిన అమరులారా..', 'పల్లె కన్నీరు పెడుతుందో..', 'ఒక్కసారైనా ఒక్కరోజైనా కమ్యూనిస్టుగా బ్రతుకు నేస్తమా...', వంటి విప్లవగీతాలకు శ్రీనివాస్ గాత్రమే ప్రాణం. సీపీఐ రాష్ట్ర మహాసభల్లో ఆ పాట తప్పక ఉంటుంది. రాష్ట్రం నలుమూలల నుంచి బహిరంగసభకు తరలివచ్చిన కార్మికులు, కర్షకులు ఆయన పాటతో మరింత ఉత్తేజితులవుతారు. ఒక చేత్తో డప్పు వాయిస్తూ.."ఎర్రజెండ్..ఎర్రజెండ్..!" అంటూ వందేమాతరం గొంతెత్తితే ఆయనతో స్వరం కలుపుతూ సభ అంతా భావోద్వేగంతో జెండాకు వందనాలు పలకడం విశేషం.

విలక్షణ గాయకుడిగా

వందేమాతం శ్రీనివాస్ విప్లవగాయకుడే కాదు విలక్షణ గాయకుడు కూడా. గాంభీర్యంతో కూడిన పాటలే కాదు మాధుర్య ప్రధానమైన పాటలూ ఎన్నో పాడారు. 'ప్రియురాలి అడ్రస్ ఏమిటో..' పాటతో విలక్షణ గాయకుడిగా గుర్తింపు పొందారు. అలాగే "నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా" అనే పాటతో మరింతమంది అభిమానులను సంపాదించుకున్నారు. ఈ పాటకు ఆయనకు ఉత్తమ గాయకుడిగా నంది పురస్కారం అందుకున్నారు.

తన ప్రతిభాపాటవాలకు, సృజనాత్మకతకు అన్న నల్లూరి సారథ్యంలోని ప్రజానాట్యమండలిలో మెరుగులు దిద్దుకుని, వామపక్ష ప్రజాసంఘాల నుంచి అభ్యుదయ భావాలను ఒంటబట్టించుకొని చిత్రపరిశ్రమలో అడుగుపెట్టిన శ్రీనివాస్ అక్కడ తనదైన ముద్ర వేశారు. మరింత కృషి, పట్టుదలతో రాణిస్తున్నారు.

చిన్ననాటి సంగతులు

మా ఇంటి పేరు కన్నెబోయిన. మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో జన్మించా. చదువు...ఎంఏ, బీఎల్. మాది ఖమ్మం జిల్లా రామకృష్ణాపురం. ఆ ప్రాంతం ఎర్రజెండాలతో రెపరెపలాడే గడ్డ కావడంతో సహజంగానే వామపక్ష భావజాలం అబ్బింది. దీనికితోడు చిన్నప్పటి నుంచీ పాటలంటే పిచ్చి. రామకృష్ణాపురానికి 3 కి.మీ. దూరంలో ఉన్న ఖమ్మం వెళ్ళి సినిమాలు చూసేవాడిని. ఆ సినిమాలలో ఏదైనా పాట నచ్చితే అది నోటికి వచ్చే వరకూ మళ్లీ మళ్లీ ఆ సినిమాకు వెళ్లి నేర్చుకునేవాడిని. పెళ్లి వేడుకల్లో, శ్రీరామనవమి పందిళ్లలో మైకు దొరకగానే ఆ పాటలన్నీ పాడేసేవాడిని. అందరి మెచ్చుకోలుతో పాటలపై ఆసక్తి మరింత పెరిగింది.



ఒక పక్క చదువు, మరో పక్క ఉద్యమం

ఒంగోలులోని సీఎస్ఆర్ శర్మ కళాశాలలో బీఏ పూర్తి చేశాను. అక్కడ ఎఐఎస్ఎఫ్ తరఫున కళాశాల విద్యార్థి సంఘం ఛైర్మన్‌గా పోటీ చేసి అత్యధిక మెజారిటీతో గెలిచాను. అలా ఒక పక్క చదుకుంటూనే మరోవైపున ఉద్యమాల్లోనూ పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తిరుగుతూ ఎఐఎస్ఎఫ్, ప్రజానాట్యమండలి, సీపీఐ వేదికల మీద ఎన్నో చైతన్య గీతాలు ఆలపించాను.



అన్నతో అనుబంధం

సమాజంలో పేరుకుపోయిన రుగ్మతలను కడిగి పారేసేందుకు కళారూపాలతో జనంలో చైతన్యం తీసుకురావాలన్న ఆశయంతో అన్న నల్లూరి ప్రజానాట్యమండలి పునరుద్ధరణకు నడుంకట్టారు. దానికి జవసత్వాలు సమకూర్చిన అన్న నల్లూరి సాంస్కృతిక సైన్యంలో ఎందరో కళాకారులు సుశిక్షితులయ్యారు. వారిలో నేనూ ఒకడిని. అయితే అన్నకు నాకూ మధ్య ఉన్న అనుబంధం గురుశిష్యుల సంబంధం మాత్రమే కాదు...అంతకుమించిన గట్టి బంధం ఉంది. నా కృషి, పట్టుదల, ప్రయత్నాలకు ఆయన ఆదరాభిమానాలు తోడయ్యాయి కనుకనే నేను ఇంతవాడిని అయ్యాను.



'ఈ గౌరవం దక్కడం వెనుక నా గొప్పతనం ఏమీ లేదు. కృషి, ప్రయత్నంతో నన్ను నేను మలుచుకోవడానికి, తీర్చిదిద్దుకోవడానికి వేదికనిచ్చిన అన్న నల్లూరి, ప్రజానాట్యమండలి, కమ్యూనిస్టుపార్టీ, ప్రజాసంఘాలదే ఈ గొప్పతనమంతా. మట్టిముద్దను శిల్పంగా మలిచారు.
- వందేమాతరం శ్రీనివాస్

సినిమాల్లో అవకాశం

అన్న నల్లూరితో అనుబంధం ఉన్న మాదాల రంగారావు తీసిన 'విప్లవ శంఖం' సినిమాలో తొలిసారి పాట పాడే అవకాశం వచ్చింది. అయితే ఆర్కెస్ట్రాతో కలిసి సింగిల్ టేక్‌లో పాడే అలవాటు లేక పాడలేకపోయా. తర్వాత మళ్లీ మాదాల గారే నన్ను పిలిచి తాను తీస్తున్న "స్వరాజ్యం" సినిమాలో పాట పాడమన్నారు. ఆ పాటే...'కాలేజి కుర్రవాడ కులాసాగ తిరిగెటోడ...' సినిమాల్లో నేను పాడిన మొదటి పాట ఇదే. ఆ రోజుల్లో ఈ పాట కుర్రకారును ఉర్రూతలూగించింది. తర్వాత టి.కృష్ణ దర్శకత్వంలో "వందేమాతరం" సినిమాలో "తరం మారుతున్నది..."పాటను పాడాను. ఈ పాటే నా ఇంటిపేరుగా మారిపోయేంత పేరు తెచ్చిపెట్టింది. ఆ తర్వాత మరెంతోమంది నన్ను వెన్ను తట్టి ప్రోత్సహించారు. అక్కడ నుంచి గాయకుడిగా నా సినీ ప్రస్తానం కొనసాగుతూనే ఉంది. కొన్ని వందల పాటలు పాడాను. గాయకుడిగా చిత్రపరిశ్రమలో నిలదొక్కుకున్న నన్ను ఆర్.నారాయణమూర్తి సంగీత దర్శకుడిగా మార్చారు. అలా ఎర్రసైన్యం, ఎర్రోడు, ఒరేయ్ రిక్షా సినిమాలకు, దాసరి నారాయణరావు ఒసేయ్ రాములమ్మ.. చిత్రాలకు సంగీతం అందించాను.





1997లో గుంటూరులో వేదికగా జరిగిన ఏఐఎస్ఎఫ్ 40 వ రాష్ట్ర మహాసభలో వేదికపై అతిథుల మధ్య వందేమాతరం, దాసరి నాగభూషణరావు, డా॥ కె.నారాయణ, బాలమల్లేష్, జి.కోటేశ్వరరావు, సుబ్బరాజు తదితరులు.



- యడ్లపల్లి శాంతి

నేను - సుడిగుండం (నవల) 13

పి.చంద్రశేఖర అజాద్
సెల్: 92465 73575



నిన్నటి సంచిక తరువాయి

బస్ మా ఊరుకేసి ప్రయాణం చేస్తోంది. నా ఆలోచనలు కూడా అలానే సాగుతున్నాయి. లలితతో మొదటి పరిచయం. తనలో డాషింగ్ నేచర్ వుంది. అమితలా ఫిలసాఫికల్‌గా మాట్లాడదు. తను కొంత ఆధునికంగా వుంటుంది. అమిత ఆధునికం కాదు అని నా అభిప్రాయం కాదు.

అమిత డ్రెస్ సెలక్షన్ సింపుల్‌గా వుంటుంది. తనను చూడగానే ఎందుకో తెలియని గౌరవం కలుగుతుంది. తను ఓ మేధావిలా అనిపిస్తుంది. ఏదో తెలియని హుందాతనం వుంటుంది. తను పుట్టినప్పటి నుంచి అలానే వుందేమో!

బహుశా సైకాలజీ తీసుకోవటానికి కారణం అదే అయుంటుందా? ఒక్కోటప్పుడు నా ఆలోచనలు నాకే నవ్వు తెప్పిస్తుంటాయి. రూపం కూడా కొన్నింటిని నిర్ణయిస్తుందా అని. అదేంటో కొంతమందిని చూస్తే గౌరవం కలగదు. ఇంకొంత మందిని చూస్తుంటే భయం కలుగుతుంది. ఫేస్ ఈజ్ ది ఇండెక్స్ అంటారు కదా! మన భావాలు కూడా మనల్ని మనం తీర్చిదిద్దుకోవటానికి సహకరిస్తాయేమో.

లలిత మోడ్రన్ డ్రెస్లు ధరిస్తుంది. తను సినిమాల గురించి మాట్లాడుతుంది. స్నేహితుల్ని ఎన్నుకునే విషయంలో జాగ్రత్తగా వుంటుంది. అయితే అమితంత సెలక్టివ్ కాదు. మొదట్లో నేను మొహమాట పడ్డాను. నాలో వున్న సిగ్గుని పోగొట్టింది మాత్రం వాళ్లిద్దరే.

లలితతో నా పరిచయం, సంభాషణలు అంత గుర్తుంచుకునేవి కాదు. అమిత అలా కాదు. నాలో ఎంత బతుకు భయం వున్నా రొమాంటిక్ ఆలోచనలు వస్తుండేవి. ఎప్పటికప్పుడు వాటిని అణచుకున్నాను.

అమిత నాకు కొరుకుడు పడదు. నన్ను వారింటికి రమ్మని రెండు మూడుసార్లు అడిగింది. ఇప్పుడు నువ్వు మా ఇంటికి వస్తే నేను మీ ఇంటికి వస్తాను అంది. ఇది కేవలం స్నేహమేనా? నా మీదున్న అభిమానమా? నేనంటే ఇష్టపడుతోందా?

అప్పుడే బస్లో ఏదో గందరగోళం. ఎవరో అరుచుకుంటున్నారు. నా ఆలోచనలు తెగిపోయాయి. అయిదు నిముషాల్లో అంతా సర్దుకుంది. మళ్లీ ఆలోచనలు.

అప్పుడు సుధాకర్, వీరూలు నా పక్కన వున్నట్లు అనిపించింది.

“ఈ మాట మేం అన్నప్పుడు మా మీద విరుచుకు పడ్డావు. నీది నటనరా. మనసులో ఒకటి వుంచుకుని బయటకి ఇంకోటి మాట్లాడతావు” అంటున్నట్లు ఫీలయ్యాను.

నా మీద నాకు అసహ్యం కలిగింది. నాలో ఇంకెలాంటి ఆలోచనలున్నాయో తెలియదు. ఎప్పుడో అవి కలల రూపంలో బయటికి రావచ్చు. ఇలాంటి సమయాల్లో ముందుకు రావచ్చు. ఆ తర్వాత నేను ఆలోచించటానికి భయం కలిగింది. బలవంతంగా నిద్రపోయాను. మా ఊరుకి దగ్గరవుతున్నప్పుడు మెలకువ వచ్చింది.

****

ఇంటి దగ్గరకు వెళ్లాను.

అమ్మ ప్రేమ, నరసయ్య మావయ్యతో మాట్లాడటం ఇవన్నీ మామూలే. వెన్నెలలో కాస్త మార్పు మొదలయిందనుకున్నాను – ఆలోచనల్లో కాదు భౌతికంగా, అది కూడా పెద్దది అవుతోంది.

ఈసారి నేను అక్కడి మిత్రులని కలుసుకున్నాను. మొదటి సంవత్సరం ఎన్ని ఖర్చులు అయ్యాయో లెక్కలు వేసుకున్నాను. నా తోటి వారి ఖర్చులకీ, నాకు పొంతనే వుండదు. నేను చదువుకుంటూ ఏదన్నా పని చేస్తే ఎలా వుంటుంది అనిపించింది.

రెండో సంవత్సరం నుండి అలా చేయాలి అనుకున్నాను.

మా ఊర్లో ఒకతను అలానే చేస్తున్నాడు. ఎప్పుడో చేయటం కాదు ఈ సెలవుల్లో ఆ పని మొదలు పెట్టాలనుకున్నాను. అయితే ఓ మాట మావయ్యతో అనకుండా చేయటం కూడా నాకు ఇష్టం లేదు.

ముందు ఆశ్చర్యంగా చూసాడు.

“నీకెందుకు ఇలాంటి ఆలోచన వచ్చింది. నువ్వు డబ్బులకి యిబ్బంది పడుతున్నావా?” అన్నాడు.

అలాంటిదేం లేదన్నాను.

“పని చేయటం తప్పు కాదు. అయినా నువ్వు కొన్ని రోజులే వుంటావు. ఈ నాలుగు రోజులూ పని చేయాలా! పని చేయటానికి చాలా రోజులున్నాయి. ఇక్కడే కాదు. విశాఖ వెళ్లాక కూడా అలాంటి ఆలోచనలు రానీయకు. నువ్వు వచ్చేటప్పుడు క్లాసు పుస్తకాలు తెచ్చుకున్నావా?”

తలూపాను.

“అవి చదువుకో. చదువులో ఎప్పుడూ ముందుండాలి. నీలాంటి కుర్రాళ్లూ, పిల్లలూ కొత్త కొత్త వస్తువులను కనుక్కుంటున్నారంట. నువ్వు అలాంటి పని చేయాలి. అంతేగాని నా గురించో, మన ఇంటి పరిస్థితి గురించో నువ్వు ఆలోచించకూడదు” అని...



“అవసరం అయినప్పుడు మాత్రం నేను చదువుకున్నాను. ఇలాంటి మోటు పనులు చేయటం ఏంటి అనుకోకూడదు. మనం ఎప్పుడేం చేయాలో బతుకే నేర్పిస్తుంది” అన్నాడు ఎటో చూస్తూ!

ఆ తర్వాత హరిత విషయం అడిగాడు.

“మీకూ తెలిసిందా” అన్నాను.

“అప్పుడప్పుడు రేడియోలో వార్తలు వింటుంటాను” అన్నాడు.

“ఆడపిల్లలు బాగా చదువుకోవాలి. ఇంటి నుండి బయటకు వెళ్లినపుడు బాధ్యతగా వుండాలి. అంతేగాని సినిమాలు చూసి మనం కూడా ప్రేమించాలి అనుకుంటే ఇలానే అవుతుంది. అసలు ప్రేమంటే ఏంటో ఇప్పటి వాళ్లకు తెలియటం లేదు” అన్నాడు.

“లోకంలో ప్రేమంటూ వుండదా మావయ్యా” అన్నాను.

“ప్రేమ లేకపోతే లోకం ఇలా వుండదు అల్లుడూ”

నాకు తికమకగా అనిపించింది.

“ముందుగా ఆడా-మగా ఇద్దరే కదా. వాళ్లు ప్రేమించుకున్నారా? మనం ఏ మనుషులూ లేని దీవిలో వుండాల్సి వస్తే అప్పుడేం చేస్తాం?”

నా కళ్లు పెద్దవయ్యాయి.

“ప్రేమంటే కుర్రాళ్ల మధ్యన వుండేదే కాదు. అది బాధ్యత కూడా. మనుషులు తలుచుకోవాలే గాని ఎవర్నయినా ప్రేమించవచ్చు” అన్నాడు.

అంతకంటే ఏం ఎక్కువ మాట్లాడుకోలేదు. మావయ్య మా అందరంత చదువుకోకపోవచ్చు. తను ఈ చిన్న ఊరికి పరిమితం కావచ్చు. ఆలోచనలు ఎవరి స్వంతం. జీవితానుభవం అందరిదీ!

****

రెండో సంవత్సరం మొదలయింది.

ఈసారి నేను సెలవులకి కూడా ఇంటికి వెళ్లటం మానేసాను. నిరంజన్ నన్ను తరుచుగా కలుస్తున్నాడు.

ఓ రోజు మనం గిరిజన తండాల దగ్గరకు వెళ్తాం వస్తావా అని అడిగాడు. మొదట్లో నన్ను సముద్రం దగ్గరికి పిలిచింది గుర్తుకు వచ్చింది. నేను మాట్లాడక పోయేసరికి....

“మనం అందరి జీవితాలను చూడటానికి ప్రయత్నం చేయాలి. అది ఇప్పుడే కుదురుతుంది. చదువు అయిపోతే ఉద్యోగ వేటలో వుంటాం. తర్వాత పెళ్లి - పిల్లలు అంటూ సంసార బంధనంలో పడతాం” అన్నాడు..

నేను సరే అన్నాను.

విశాఖకు దగ్గర్లోనే అలాంటివి వున్నాయి. నేనూ, నిరంజన్ వెళ్లాం. ఖర్చులన్నీ అతనివే. నా ఆర్థిక పరిస్థితి అతనికి తెలుసు. ఈసారి మాత్రం వీరూ వాళ్లు అన్నట్లు ఏ కానుకలూ ఇవ్వకుండా తేరగా తిని వస్తావా అనే భావన రాలేదు. ఇందులో కుంచించుకు పోవాల్సిందేం లేదు అనుకున్నాను.

అప్పుడు సముద్రం చూసాను.

ఇప్పుడు అడవిని చూసాను.

ఓ వారం రోజుల పాటు ప్రయాణం సాగింది. అక్కడికి చేరుకోవాలంటే బస్సులు వుండవు. ఉన్నవి సమయానికి రావు. మేం నడక మొదలు పెట్టాం. దారిలో నిరంజన్ మాట్లాడుతున్నాడు. ఇంతకుముందు నేను నక్సలైట్ల గురించి విన్నాను.

వీళ్లు మైదానాలను, జనాన్ని వదిలి పెట్టి అడవుల్లోకి ఎందుకు వెళ్లారు అనుకునేవాడిని.

మేం నడిచింది తక్కువే. అడవుల్లో ప్రతిరోజూ సంచారం చేయటం ఎంత కష్టమో ఇప్పుడు నాకు అర్థం అయింది. ఒకప్పుడు ఇలా రావటం కూడా ప్రమాదకరమే అన్నాడు నిరంజన్.

ఇప్పుడు నక్సలైట్లకు ఎదురు దెబ్బలు తగలటంతో ఉద్యమం నివురు గప్పిన నిప్పులా వుంది. అంత హడావుడి లేదు.

“అసలు మీకు ఈ ఉద్యమంలోకి ఎందుకు రావాలనిపించింది. మీ కుటుంబం ఈ భావాలకు సంబంధించిందా?” అని అడిగాను.

అప్పుడు నిరంజన్ ‘మోహన్’ గురించి చెప్పాడు.


****

మోహన్ నిరంజన్ కజిన్. అతను ఇంటర్ మీడియట్ వరకు ఈ రాష్ట్రంలోనే చదువుకున్నాడు. తెలివిగలవాడు. మంచి మార్కులు వచ్చేవి. అతనికి ఓ చెల్లి వుంది.

అతన్ని ఐ.పి.యస్ కి గాని, ఐ.ఎ.ఎస్‌గాని చదివించాలని వుండేది. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తుంటారు. వాళ్లు అంతగా చదువుకోలేదు. నిరంజన్ కి, మోహన్ కి పది సంవత్సరాల వయసు తేడా వుంది.

(ఇంకా ఉంది)

2018 సంవత్సరానికిగాను ప్రపంచ సుందరిగా ఎవరు ఎంపికయ్యారు ?



➠ భారత నూతన ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఎవరు నియమితులయ్యారు ? **- సునీల్ అరోరా**

➠ భూమిమీద మానవులకు కనిపించని చంద్రుడి అవతలి భాగం గురించి తెలుసుకునేందుకు ప్రపంచంలో మొట్టమొదటిసారి 2018 డిసెంబరు 8వ తేదీన చైనా దేశం ఏ అంతరిక్ష నౌకను పంపింది ? **- చాంగే - 4**

➠ మహిళల విభాగంలో తొలిసారిగా ప్రవేశపెట్టిన బాలన్ డీఓర్ అవార్డుకు ఎవరు ఎంపికయ్యారు ? **- అదా హెగెర్‌బర్గ్ (నార్వే)**

➠ సాధారణ విమానాలు వెళ్లలేని ఎత్తుకు చేరుకుని ఏకంగా మూడు నెలలపాటు నిరంతరంగా ఆకాశంలోనే ఉండే సౌరశక్తి విమానాన్ని బోయింగ్ అనుబంధ సంస్థ అరోరా ఫ్లైట్ సైన్సెస్ రూపొందించింది. దాని పేరేమి ? **- అడీస్సియన్**

➠ బ్రిటన్‌కు చెందిన ‘స్మాల్ రోబో కంపెనీ’ రూపొందించిన రోబో విత్తనాలు చల్లడం, కలుపు తీయడం వంటి పనులను కచ్చితత్వంతో పూర్తిచేస్తుంది. ఆ రోబో పేరేమి ? **- టామ్**

➠ మిజోరం రాష్ట్ర ముఖ్యమంత్రిగా 2018 డిసెంబర్ 15న ప్రమాణస్వీకారం చేసింది ఎవరు ? **- జోరంథాంగ**

➠ ప్రపంచవ్యాప్తంగా అగ్రశ్రేణి వంద అత్యంత శక్తివంతమైన మహిళలతో ఫోర్బ్స్ రూపొందించిన జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది ఎవరు ? **- ఏంజెలా మెర్కెల్**

➠ భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో చరిత్రలోనే అతి బరువైన ఉపగ్రహాన్ని ఫ్రెంచ్ గయానాలోని కౌరూ అంతరిక్ష కేంద్రం నుంచి డిసెంబర్ 5వ తేదీన విజయవంతంగా ప్రయోగించారు. ఆ ఉపగ్రహం పేరేమి ? **- జీశాట్ 11**

➠ అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జ్ హెర్బర్ట్ వాకర్ బుష్ 2018 నవంబర్ 30న మరణించారు. సీనియర్ బుష్‌గా పిలుచుకునే ఆయన ఎప్పుడు అమెరికాకు 41వ అధ్యక్షునిగా సేవలందించారు ? **- 1989-1993 మధ్య కాలంలో**

➠ 2022లో జీ-20 దేశాల శిఖరాగ్ర సదస్సుకు ఏ దేశం ఆతిథ్యం ఇవ్వనుంది ? **- భారత్**

➠ ప్రతిష్ఠాత్మక స్వర్ణభారతి ఫెలోషిప్‌నకు కేంద్రప్రభుత్వం ఎవరిని ఎంపిక చేసింది ? **- డాక్టర్ అశిష్ కుమార్ సేన్**

➠ భారత్- రష్యాల మధ్య రక్షణ సహకార ఒప్పందంలో భాగంగా తూర్పు నావికాదళం ముఖ్య కేంద్రమైన విశాఖపట్నం తీరాన జరిగిన విన్యాసాల పేరేమి ? **- ఇంద్ర-2018**

➠ సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ (సీఏఆర్)లో దాదాపు ఎన్ని లక్షల మంది చిన్నారులు పౌష్టికాహార లోపంతో ఇబ్బంది పడుతున్నారని యూనిసెఫ్ నివేదిక వెల్లడించింది ? **- 15 లక్షలు**

➠ భారతీయ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్స్ టెక్నాలజీ (ఐసీటీ) పరిశ్రమలో ‘పినాకిల్’ పేరుతో ఓ అరుదైన కార్యక్రమం 2018 నవంబర్ 28న ఎక్కడ జరిగింది ? **- ముంబయి**

➠ ఏ సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా పాటించాలన్న భారత్ ప్రతిపాదనకు ఐక్యరాజ్యసమితికి అనుబంధంగా ఉన్న ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) ఆమోదం తెలిపింది ? **- 2023**

➠ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సమీకృత మత్స్య అభివృద్ధి పథకాన్ని (ఐఎఫ్‌డీఎస్) పర్యవేక్షిస్తున్న ఆన్‌లైన్ పోర్టల్ ‘ఈల్యాబ్ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్’కు కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా వారి ఏ అవార్డు దక్కింది ? **- నిహెలెంట్ ఈ-గవర్నన్స్ అవార్డు - 2018 (సీఎస్ఈజీ)**

➠ అల్ట్రా రన్నింగ్‌లో భారత్‌కు తొలి అంతర్జాతీయ పతకాన్ని (ఆసియా - ఓషియానియా ఛాంపియన్‌షిప్‌లో, కాంస్యం) అందించిన ఆటగాడిగా చరిత్ర సృష్టించింది ఎవరు ? **- ఉల్లాస్ నారాయణ్**

➠ దేశంలో విపరీతంగా పెరిగిన ఇంధన ధరలపై నిరసనలు ప్రకటిస్తూ ఫ్రాన్స్ ప్రజలు పోరుబాట పట్టారు. దీనివల్ల ఆ దేశ రాజధాని పారిస్ ఆందోళనలతో అట్టుడుకుతోంది. ఈ ఉద్యమాన్ని ఏమని పిలుస్తున్నారు ? **- ఎల్లో వేస్ట్**

➠ ఆంధ్రప్రదేశ్‌లో తలసరి ఆదాయంలో ఏ జిల్లా మొదటి స్థానం దక్కించుకుంది ? **- కృష్ణాజిల్లా**

➠ ఓ టెన్నిస్ మ్యాచ్‌లో అత్యధిక క్యాచ్‌లు అందుకున్న వికెట్ కీపర్‌గా రిషబ్ పంత్ ప్రపంచ రికార్డును సమం చేసి జాక్ రస్సెల్ (ఇంగ్లాండ్), ఏబీ డివిలియర్స్ (దక్షిణాఫ్రికా) సరసన నిలిచాడు. రిషబ్ అందుకున్న క్యాచ్‌లు ఎన్ని ? **- 11 క్యాచ్‌లు**

➠ ‘విమర్శిని’ వ్యాసరచనకుగాను తెలుగు విభాగంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ఎవరిని వరించింది ? **- ఆచార్య కొలకలూరి ఇనాక్**

➠ కేంద్రప్రభుత్వం ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా ఎవరిని నియమించింది ? **- అజయ్ నారాయణ్ ఝూ**

కరెంట్ ఎఫైర్స్ బిట్ బ్యాంక్

➠ 2018లో బాగా సంపాదించిన 100 మంది భారత సెలబ్రిటీలతో ‘ఫోర్బ్స్’ మేగజైన్ రూపొందించిన జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది ఎవరు ? **- సల్మాన్‌ఖాన్**

➠ ‘జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయం (జెడ్‌బీఎన్ఎఫ్)’గా రైతులు అనుసరిస్తున్న పాలేకర్ వ్యవసాయ విధానం పేరును ఏ పేరుగా మార్చారు ? **- ‘సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయం (ఎస్‌పీఎన్ఎఫ్)**

➠ చైనాలోని షెన్‌జెన్ నగరంలో ముగిసిన చైనా చెస్ లీగ్‌లో భారత స్టార్ చెస్ ఆటగాడు పెంటేల హరికృష్ణ సభ్యుడిగా ఉన్న ఏ క్లబ్ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచి టైటిల్‌ను సొంతం చేసుకుంది ? **- షాంఘై చెస్ క్లబ్**

➠ 13వ జీ -20 దేశాల శిఖరాగ్ర సదస్సు 2018 నవంబర్ 30 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు ఎక్కడ జరిగింది ? **- బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా)**

➠ వృద్ధుల కోసం ఉచిత తీర్థయాత్రల పథకం ‘ముఖ్యమంత్రి తీర్థయాత్ర యోజన’ 2018 డిసెంబర్ 5న ఏ రాష్ట్రంలో ప్రారంభమైంది ? **- ఢిల్లీ**

➠ ప్రముఖ చరిత్రకారుడు జామియా మిల్లియా ఇస్లామియా యూనివర్సిటీ మాజీ ఉప కులపతి ముషిరుల్ హసన్ 2018 డిసెంబర్ 10న న్యూఢిల్లీలో మరణించారు. ముషిరుల్ హసన్‌ను కేంద్రం ఏ సంవత్సరంలో పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది ? **- 2007లో**

➠ కేంబ్రిడ్జి బ్లాగ్ పాఠకులు, సోషల్ మీడియా ఫాలోవర్స్ అత్యధిక ప్రజాదరణగల పదంగా దేనిని ఎంపిక చేశారు ? **- నోమోఫోబియా**

➠ కర్ణాటకలోని కైగా అణువిద్యుత్ కర్మాగారం తొలి యూనిట్ ఏకధాటిగా ఎన్ని రోజులపాటు విద్యుత్ ఉత్పత్తి చేసి ప్రపంచ రికార్డును నెలకొల్పింది ? **- 941 రోజులు**

➠ ఆంధ్రప్రదేశ్‌లో రంగాలవారీగా జిల్లాల పనితీరు ఆధారంగా ఇచ్చిన ర్యాంకుల్లో అన్ని విభాగాలు కలిపి ఏ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది ? **- కృష్ణా**

➠ రాజస్థాన్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా 2018 డిసెంబర్ 17వ తేదీన ప్రమాణస్వీకారం చేసింది ఎవరు ? **- అశోక్ గెహ్లాట్**

➠ హైదరాబాద్‌లోని ఇండీవుడ్ కార్నివాల్‌లో జరిగిన ఇండీవుడ్ మ్యూజిక్ ఎక్సలెన్స్ 2018 పురస్కారాల ప్రదానోత్సవంలో ఇండీవుడ్ చైర్మన్ సోహన్‌రాయ్ ఎవరికి జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేశారు ? **- ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం**

➠ షూటింగ్‌లో అత్యున్నత పురస్కారమైన బ్లూ క్రాస్‌కు ఎవరు ఎంపికయ్యారు ? **- అభినవ్ బింద్రా**



➠ ప్రతిష్ఠాత్మకమైన కేంద్రప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారుగా ఎవరు నియమితులయ్యారు ? **- కృష్ణమూర్తి సుబ్రమణియన్**

➠ 2018 సంవత్సరానికిగాను ప్రపంచ సుందరి కిరీటాన్ని ఎవరు గెలుచుకున్నారు ? **- వెనెస్సా పోన్స్ డి లియోన్ (మెక్సికో)**

➠ రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్ కౌన్సిల్ (ఆర్‌సీఓఎస్‌సీ) అవార్డుకు ఎవరు ఎంపికయ్యారు ? **- డాక్టర్ పి.రఘురాం**

➠ జన్యువుల్ని ఎడిటింగ్ చేసి ఇద్దరు బేబీల్ని సృష్టించిన వివాదాస్పదమైన చైనా శాస్త్రవేత్త నిషేధానికి గురయ్యాడు. ఆయన పేరేమి ? **- హీ జియాన్‌కుయ్**

➠ గత యూపీఏ ప్రభుత్వ హయాంలో జరిగిన బొగ్గు కుంభకోణం కేసులో బొగ్గు గనుల శాఖ మాజీ కార్యదర్శి హెచ్‌సీ గుప్తాకు ఢిల్లీలోని ఓ ప్రత్యేక కోర్టు ఎన్నేళ్ల జైలుశిక్ష విధించింది ? **- మూడేళ్ల జైలుశిక్ష**

➠ రేషన్ లావాదేవీలను సామాన్య ప్రజలు తెలుసుకునేలా తెలంగాణ పౌర సరఫరాల శాఖ రూపొందించిన ‘టీ రేషన్’ యాప్‌కు ఏ అవార్డు లభించింది ? **- సీఎస్ఐ (కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఈ గవర్నెన్స్) అవార్డు**

➠ 2019 జనవరి 26న జరిగే భారత గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా ఎవరు హాజరు కానున్నారు ? **- దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా**

➠ ఐక్యరాజ్యసమితి వాతావరణ మార్పుల అంతర ప్రభుత్వ (ఐపీసీసీ) వార్షిక సదస్సు కాప్ 24.. 2018 డిసెంబర్ 2వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఎక్కడ జరిగింది ? **- కేటోవైస్ (పోలెండ్)**

➠ దివ్యాంగుల సాధికారత, వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసినందుకు జాతీయస్థాయిలో ఏ రాష్ట్రానికి ఉత్తమ పురస్కారం దక్కింది ? **- తెలంగాణ**

➠ టాటా ఓపెన్ ఇండియా ఇంటర్నేషనల్ ఛాలెంజర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ -2018లో పురుషుల సింగిల్స్‌లో ఛాంపియన్‌గా నిలిచింది ఎవరు ? **- లక్ష్యసేన్ (భారత్)**

➠ శ్రీలంక ప్రధానమంత్రిగా 2018 2018 డిసెంబర్ 16వ తేదీన ఎవరు ప్రమాణస్వీకారం చేశారు ? **- రణిల్ విక్రమసింఘె**

➠ యూట్యూబ్ ద్వారా అత్యధిక ఆదాయం పొందుతున్న ‘స్టార్’గా ఫోర్బ్స్ జాబితాలో ఏడేళ్ల బాలుడు చోటు సంపాదించాడు. ఆ బాలుడి పేరేమి ? **- రియాన్**

➠ ఆంధ్రప్రదేశ్‌లో జీడీడీపీ (గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రోడక్ట్), వృద్ధి రేటులో ఏ జిల్లా అగ్రస్థానంలో నిలిచింది ? **- పశ్చిమ గోదావరి**

➠ ఛత్తీస్‌గఢ్ మూడవ ముఖ్యమంత్రిగా డిసెంబర్ 17వ తేదీన ప్రమాణస్వీకారం చేసింది ఎవరు ? **- భూపేష్ బాఘెల్**

➠ ఆలిండియా పోస్టల్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన జట్టు ఏది ? **- పశ్చిమ బెంగాల్ సర్కిల్**

➠ లండన్ కేంద్రంగా పనిచేస్తున్న వార పత్రిక ‘ఈస్టర్న్ ఐ’ 50 మందితో రూపొందించిన జాబితాలో ఆసియాలో అత్యంత ఆకర్షణీయ మహిళగా నిలిచింది ఎవరు ? **- దీపికా పదుకొనే**

➠ ప్రతిష్ఠాత్మక ‘బ్రేక్‌థ్రూ టేబుల్ టెన్నిస్ స్టార్’ అవార్డును దక్కించుకున్న తొలి భారత టీటీ ప్లేయర్‌గా ఘనత సాధించింది ఎవరు ? **- మనిక బత్రా**

➠ రాష్ట్ర విభజన అనంతరం జరిగిన మొదటి ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ చైర్మన్‌గా ఎవరు ఎన్నికయ్యారు ? **- ఘంటా రామారావు**

➠ 2018 సంవత్సరానికిగాను ప్రతిష్ఠాత్మక బాలన్ డీఓర్ (వరల్డ్ బెస్ట్ ప్లేయర్) అవార్డుకు ఎవరు ఎంపికయ్యారు ? **- లూకా మోడ్రిచ్ (క్రొయేషియా)**

➠ జాతీయ స్థాయిలో అందించే రంగినేని ఎల్లమ్మ స్మారక సాహిత్య పురస్కారానికి ఎవరు ఎంపికయ్యారు ? **- రామా చంద్రమౌళి**

➠ తెలంగాణ ముఖ్యమంత్రిగా 2018 డిసెంబర్ 13వ తేదీన ప్రమాణ స్వీకారం చేసింది ఎవరు ? **- కె.చంద్రశేఖరరావు**

➠ టాటా ఓపెన్ ఇండియా ఇంటర్నేషనల్ ఛాలెంజర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2018లో మహిళల సింగిల్స్‌లో ఛాంపియన్‌గా నిలిచింది ఎవరు ? **- అస్మితా చాలిహా**

➠ మధ్యప్రదేశ్ 18వ ముఖ్యమంత్రిగా డిసెంబర్ 17న పదవీ ప్రమాణ స్వీకారం చేసింది ఎవరు ? **- కమల్‌నాథ్**

➠ విజయనగరంలోని ఆనంద గజపతి కళాక్షేత్రంలో 2018 డిసెంబర్ 4న జరిగిన కార్యక్రమంలో ఘంటసాల విశిష్ట పురస్కారాన్ని ఎవరికి ప్రదానం చేశారు ? **- కోటి**

➠ ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పథకాల లక్ష్య సాధనలో ఏ జిల్లా అగ్రస్థానంలో నిలిచింది ? **- తూర్పు గోదావరి**

➠ అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) గ్రేడ్-4 జూనియర్ సర్క్యూట్ టోర్నమెంట్‌లో మహిళల సింగిల్స్ టైటిల్‌ను ఎవరు కైవసం చేసుకున్నారు ? **- అమినేని శివాని (భారత్)**

➠ ఏ దేశంలో 1,20,000 మంది 19 ఏళ్ల లోపు యువత, బాలలు హెచ్‌ఐవీతో జీవిస్తున్నారని ఐక్యరాజ్యసమితి (ఐరాస) వెల్లడించింది ? **- భారత్**

➠ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల్లో లక్ష్య ఛేదనలో ఏ శాఖ అగ్రస్థానంలో నిలిచింది ? **- జలవనరుల శాఖ**

➠ 2018 సంవత్సరానికిగాను ప్రతిష్ఠాత్మక జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎవరు ఎంపికయ్యారు ? **- అమితవ్ ఘోష్**

➠ ఐక్యరాజ్యసమితి (ఐరాస)లో ఇండియన్ పర్మినెంట్ మిషన్ డిప్యూటీ చీఫ్‌గా ఎవరు నియమితులయ్యారు ? **- కాకనూరు నాగరాజు నాయుడు**


➠ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్ అండ్ ఫైనాన్స్ (ఐఎల్ అండ్ ఎఫ్ఎస్) గ్రూప్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ)గా ఎవరు నియమితులయ్యారు ? **- ఎస్.శివరామన్**

➠ ఆంధ్రప్రదేశ్‌లో తలసరి ఆదాయంలో ఏ జిల్లా చివరి స్థానంలో నిలిచింది ? **- శ్రీకాకుళం**

➠ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2018 డిసెంబర్ 6న ఆదరణ-2 కింద రెండు లక్షల మంది లబ్ధిదారులకు వృత్తి పరికరాలు, ఆదాయాన్ని పెంచుకునే వనరుల పంపిణీని ఎక్కడ ప్రారంభించారు ? **- తిరుపతి**

సౌత్ వెస్టర్న్ రైల్వేలో 963 ఖాళీలు

హుబ్లీలోని సౌత్ వెస్టర్న్ రైల్వే (ఎస్‌డబ్ల్యూఆర్) వివిధ డివిజన్/యూనిట్లలో ఖాళీగా ఉన్న 963 ట్రేడ్ అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.



డివిజన్ల వారీ ఖాళీలు : హుబ్లి డివిజన్-287, క్యారేజ్ రిపేర్ వర్క్‌షాప్ (హుబ్లి)-176, బెంగళూరు డివిజన్-280, మైసూర్ డివిజన్-177, సెంట్రల్ వర్క్ షాప్ (మైసూర్)-43.

ట్రేడులు : ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, ప్రోగ్రామింగ్ అండ్ సిస్టమ్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్, టర్నర్, మెషినిస్ట్, పెయింటర్, కార్పెంటర్, స్టెనో గ్రాఫర్ తదితర విభాగాలు.

అర్హత : పోస్టును బట్టి పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణత.

వయసు : 15-24 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తు ఫీజు : రూ.100 (ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మహిళలకు ఉచితం).

ఎంపిక : అకడమిక్ మార్కుల ఆధారంగా.

దరఖాస్తుకు చివరితేదీ : జనవరి 16, 2019.

వెబ్‌సైట్ : www.rrchubli.in

బీఎస్ఎన్ఎల్‌లో 150 ఉద్యోగాలు

భారత ప్రభుత్వరంగ సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) 150 మేనేజ్‌మెంట్ ట్రైనీ (టెలికాం ఆపరేషన్స్)ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత : టెలీ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్/ఐటీ, ఎలక్ట్రికల్‌లో బీఈ/ బీటెక్ లేదా తత్సమాన ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత.

వయసు : ఆగస్టు 1, 2019 నాటికి 30 ఏళ్లు మించకూడదు.

ఎంపిక : అసెస్‌మెంట్ ప్రాసెస్ (ఆన్‌లైన్), గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తు ఫీజు : ఓసీ, ఓబీసీలకు రూ.2200, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1100.

దరఖాస్తు ప్రారంభతేదీ : డిసెంబర్ 26, 2018.

దరఖాస్తుకు చివరితేదీ : జనవరి 26, 2019.

వెబ్‌సైట్ : www.bsnl.co.in

ఏపీపీఎస్సీ 109 ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పోస్టులకు నోటిఫికేషన్

ఆంధ్రప్రదేశ్ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సబార్డినేట్ సర్వీస్‌లో 109 ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి ఏపీపీఎస్సీ దరఖాస్తులు కోరుతోంది.

APPSC Extension Officer 109 Posts
Women Development

పోస్టు పేరు : ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ గ్రేడ్-1 (సూపర్‌వైజర్) (మహిళలకు మాత్రమే).

జోన్ల వారీ ఖాళీలు : జోన్ 1-27, జోన్ 2-25, జోన్ 3-29, జోన్ 4-28.

అర్హత : పోస్టును బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో బీఎస్సీ ఉత్తీర్ణత.

వయసు : జులై 1, 2018 నాటికి 18-42 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం : స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్ ఎగ్జామ్, ఇంటర్వ్యూ/ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తు ఫీజు : అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.250, ఎగ్జామినేషన్ ఫీజు రూ.80.

ఫీజు చెల్లించుటకు చివరితేదీ : జనవరి 17, 2019.

ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు : డిసెంబర్ 28, 2018 నుంచి జనవరి 18, 2019 వరకు.

మెయిన్ ఎగ్జామ్ నిర్వహణ తేదీ : ఏప్రిల్ 25, 2019.

పూర్తి వివరాలకు వెబ్‌సైట్ : www.psc.ap.gov.in

విశాలాంధ్ర బిజినెస్

-96.66 ▼ సెన్సెక్స్ 36,009.84	-26.65 ▼ నిఫ్టీ 10,794.95	0 ◀◀ బంగారం (విజయవాడ) 30,050 22 క్యారెట్లు, 10 గ్రాములు	బంగారం (విశాఖపట్నం) 30,770 ప్రొద్దుటూరు 30,720 22 క్యారెట్లు, 10 గ్రాములు	100 ▲ వెండి (విజయవాడ) 40,400 కిలో (రూపాయల్లో)	వెండి (విశాఖపట్నం) 41,400 ప్రొద్దుటూరు 42,049 కిలో (రూపాయల్లో)	డాలరు Vs రూపాయి 70.41

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
ఐటీసీ	295.35	1.99
యూపీఎల్	783.45	1.34
ఐఓసీ	131.20	1.00
ఓఎన్‌జీసీ	145.50	0.98
హిండాల్కో	207.95	0.91

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
ఇండస్‌ఇండ్ బ్యాంక్	1,515.15	-3.24
టాటా మోటార్స్	180.30	-2.93
భారతీ ఇన్‌ఫ్రాటెల్	277.20	-2.75
టీసీఎస్	1,875.00	-2.44
లార్సెన్	1,393.00	-1.65

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	70.41	70.49
యూరో	81.21	81.25
పౌండ్	89.71	90.29
ఆస్ట్రేలియా డాలర్	50.61	50.96
సింగపూర్ డాలర్	52.11	52.20

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	30,720	32,885
చెన్నై	30,720	32,855
బెంగళూరు	30,160	32,256
ముంబై	31,280	33,454
విజయవాడ	-	33,000
విశాఖపట్నం	30,770	32,200
ప్రొద్దుటూరు	30,720	32,260
ముడి చమురు	61.68	


ప్రాణాలు తీస్తున్న చైనా మాంజా



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: చైనా మాంజా జోరుతో ప్రాణాలు బేజారెత్తిపోతున్నాయి. చూసేందుకు చిన్నపాటి దారమే అయినా ప్రాణాలు తీయటంతో చాలా పదును గలదీ చైనా మాంజా. దీనిపై ప్రభుత్వ నిషేధం వున్నా అమ్మకాలు మాత్రం జోరుగా జరుగుతున్నాయి. సంక్రాంతి పండగకు పది రోజుల ముందు నుండే హైదరాబాద్ నగరంలో పతంగులు జోరు జోరుగా ఎగరేస్తుంటారు. గతంలో ఈ పతంగులను ఎగరేసేం దుకు కాటన్ మాంజాను వాడేవారు. పంతంగుల పోటీ..మార్కెట్ లో కూడా పోటీ పెరగడంతో ప్రస్తుతం మార్కెట్‌లో ప్రమాదకరమైన 'చైనా మాంజా' రాజ్యమేలుతోంది. రసాయనాలు పూసిన ఈ మాంజాతో మనుషులతో పాటు పక్షులకు కూడా ప్రాణాపాయం కలుగుతోంది. చైనా మాంజాపై రాష్ట్ర ప్రభుత్వం 2017, జూలై 11న నిషేధం విధించింది. పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 ప్రకారం అమ్మినా, కొనుగోలు చేసినా నేరమే. చైనా మాంజాను అమ్మితే ఏడేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా కూడా వుంటుంది. రెండేళ్ల క్రితం నిషేధ చట్టం చేసినా ఇప్పటికీ నగరంలోని మార్కెట్‌లో చైనా మాంజా విక్రయాలు జోరుగా సాగుతు న్నాయి. పంజేషా, ధూల్‌పేటతో పాటు తో నగరంలో పలు ప్రాంతాలలో చైనా మంజా విక్రయాలు రహస్యంగా..విచ్చలవిడిగా సాగిపోతున్నాయి. డబ్బులు ఎక్కువగా చెల్లిస్తే రహస్యంగా పేపర్‌లో చుట్టి చేతికిచ్చేస్తారు. చైనా మాంజా ముంబైతో పాటు ఉత్తరాది రాష్ట్రాల నుంచి నగరానికి దిగుమతి అయ్యేది. రెండేళ్ల నుంచి ప్రభుత్వ నిషేధంతో దీన్ని దిగుమతికి వ్యాపారులు కొద్దిగా వెనక్కి తగ్గినా, సీక్రెట్‌గా అమ్మేస్తున్నారు. చైనా మాంజా స్టిఫ్‌గా స్ట్రాంగా వుండటంతో ప్రాణాలకు ముప్పు వున్నా ప్రభుత్వ నిషేధం వున్నా, దొరికితే భారీ జరిమానాలు వున్నా, మార్కెట్‌లో మంచి గిరాకీ వుండటం, లాభాలు ఎక్కువగా వుండటంతో సీక్రెట్‌గా అమ్మేస్తున్నారు. ప్రజలు కూడా నైలాన్ దారంతోనే పతంగులు ఎగురవేయడానికి ఇష్టపడుతున్నారు. దీంతో చైనా మాంజాపై నిషేధాన్ని రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా అమలు చేయాలని, పక్షుల ప్రాణాలను కాపాడాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు. పతంగుల పోటీల్లో ఎదుటివారి గాలిపటాన్ని నేలకూల్చడంలో (క్రైంచీ) చేయటంలో ఈ చైనా మాంజా మంచిగా ఉపయోగపడుతుంది. ఈ ప్లాస్టిక్ దారానికి గాజుపొడి అద్ది తయారు చేయటంతో గాలిపటం ఎగురవేసే వారికి, పక్కనున్న వారి చేతులకూ గాయాలవటంతో పాటు చెట్లకు, కరెంట్ పోల్స్ లకు చిక్కుకోవటంతో చిక్కుకోవడంతో మాంజాకు తగిలే పక్షులు, జంతువులు కూడా మృత్యువాత పడుతున్నాయి. అంతేకాదు రోడ్లపై బైక్‌లపై వెళ్లేవారికి గాల్లో వేలాడుతు వచ్చిన ఈ మాంజాతో గొంతుకలు కట్ అయిపోయిన సందర్భాలు కూడా చాలానే జరిగాయి. ఈ క్రమంలో మనుషుల ప్రాణాలకు కూడా ముప్పుగా ఈ చైనా మాంజా వుంది. ఢిల్లీకి చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడి కుమారుడగ ఇలాంటి ప్రమాదం జరగడంతో అతడు కోర్టు పిటీషన్ వేసిన ప్రమాదానికి కారణాలను కోర్టు సబ్మిట్ చేశాడు. ఈ పిటీషన్ పై విచారించిన కోర్టు చైనా మాంజా నిషేధించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. గతంతో సంప్రదాయంగా తయారైన పంతంగుల దారం ఫిట్ గా పదునుగా వుండటంకోసం మాంజా దారానికి సాబుదానా అంటే సగ్గుబియ్యం, గంధకం, రంగులు వేసి మాంజాను తయారు చేసేవారు. ప్రస్తుతం ఈ చైనా మాంజా వినియోగంతో పక్షలు, జంతువులతో పాటు మనుషుల ప్రాణాలకు కూడా ప్రమాదంగా తయారయ్యింది. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి చైనా మంజాల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం చాలా వుంది.

విజ్ఞానం

పేగుకేన్సర్‌ను చెప్పే 'ప్రోటీన్'!



పేగు కేన్సర్‌ను ముందే గుర్తించే ప్రోటీన్‌ను పరిశోధకులు గుర్తించారు. కణాల వ్యాప్తి, కొత్త రక్తనాళాల అభివృద్ధిలో బీటా-1, 4-గాలక్టో సిల్‌ట్రాన్స్‌ఫరస్ అనే ప్రోటీన్ భాగమైనట్లుగా అమెరికాలోని జాన్ హాప్‌కిన్స్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ పరిశోధకుల అధ్యయనంలో తెలిసింది. దీనివల్ల సాధారణ కణజాలంతో పోలిస్తే పేగు కేన్సర్ కారక కణజాలాలు ఎక్కువగా పెరుగుతాయని పరిశోధకులు వెల్లడిం చారు. పేగు కేన్సర్‌ను ముందుగా నిర్ధారించే బయోమార్కర్‌గా ఈ ప్రోటీన్‌ను పేర్కొన్నారు.

సోషల్ మీడియాతో మానసిక రుగ్మత!



ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడపడం, తమను ఇతరులతో పోల్చుకోవడం వంటి ప్రతికూల లక్షణాలు తీవ్రమైన మానసిక రుగ్మతకు సూచనలని అమెరికాలోని టెక్సాస్ స్టేట్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఫేస్‌బుక్, ట్విటర్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ వంటి సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్న 504 మంది టీనేజర్లపై శాస్త్రవేత్తలు అధ్యయనం చేశారు. వారిలో ఎక్కువమందికి సోషల్ మీడియాలో గడపడం వ్యసనంగా మారి ఎదుటివారికంటే తాము తక్కువనే భావనలో ఉంటారని గుర్తించారు.

లాభాలకు బ్రేక్



- 96పాయింట్ల నష్టంతో సెన్సెక్స్
- కార్పొరేట్ ఆర్థిక ఫలితాలు, బ్యాంక్ షేర్ల పతనమే...

ముంబై: దేశీయ సూచీలు వారాంతంలో నష్టాలతో ముగిశాయి. లాభాలతో ప్రారంభమైన మార్కెట్లు మధ్యాహ్నం సమయానికి నష్టాల్లోకి జారుకున్నాయి. కంపెనీల త్రైమాసిక ఫలితాలు నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటిస్తున్నారు. గురువారం కూడా మదుపర్ల జాగ్రత్తతో సూచీలు నష్టాలతోనే ముగిశాయి. మార్కెట్ల ప్రారంభంలో సెన్సెక్స్ 80 పాయింట్లకు పైగా లాభంతో ప్రారంభం కాగా, నిఫ్టీ 10,800 పైన ఆరంభమైంది. చివరకు సెన్సెక్స్ 96.66 పాయింట్లు కోల్పోయి 0.27శాతంతో 36,009.84 వద్ద ముగిసింది. నిఫ్టీ 26.60 పాయింట్లు నష్టపోయి 10,795 పాయింట్లకు చేరింది. ఇంట్రాడేలో గేజ్ 35,214.26, 35,840 మధ్య తీవ్ర ఊగిసలాటకు లోనైంది. ప్రదానంగో ఇండస్‌ఇండ్ బ్యాంకు 3.26 శాతం, టాటామోటార్స్ 2.83శాతం, టిసిఎస్ 2.45శాతం,యస్‌బ్యాంకు 1.47శాతం, ఎల్ అండ్ టి 1.44శాతం నష్టపోయాయి. లాభాల్లో ఐటిసి 2.02శాతం, ఓఎన్‌జిసి 0.80 శాతం, వేదాంత 0.74శాతం నమోదయ్యాయి. రూపాయి 21పైసలునష్టపోయి 70.55 వద్ద నమోదైంది. బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ 1.10 శాతం పెరిగి బ్యారెల్ 62.36 డాలర్లు నమోదైంది.

నష్టాల్లో బ్యాంకు షేర్లు

ఇండస్‌ఇండ్ బ్యాంక్, కోటక్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐ షేర్లు గురువారం నాడు 2.36 శాతం నష్టపోయాయి. కాగా ఓఎన్‌జీసీ, మారుతి సుజుకీ, సన్ ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ, హీరో మోటోకార్ప్, ఐటీసీ, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు కూడా 1.31 శాతం నష్టపోయాయి. మరోవైపు మూడో త్రైమాసిక ఫలితాలు వెల్లడి కారణంగా టీసీఎస్ షేరు ఫ్లాట్‌గా ముగిసింది. కాగా టాటా మోటార్స్, ఎన్‌టీపీసీ, ఇన్ఫోసిస్, యెస్ బ్యాంక్, ఎ అండ్ ఎం, భారతి ఎయిర్‌టెల్, హెచ్‌యూఎల్ షేర్లు లాభాల్లో ముగిసాయి. నాలుగేళ్లుగా తర్వాత కార్పొరేట్ రంగంలో ఆర్థిక ఫలితాలు ఆశించిన స్థాయిలో ఉండకపోవచ్చన్న అంచనాలతో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారని తెలుస్తోంది. మరోవైపు డాలర్ మారకంలో రూపాయి పతనం కావటంతోపాటు అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా ట్రేడవటం, చమురు ధరలు 60 డాలర్ల పైకి చేరుకోవటం వంటి దేశీయ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపించాయని శర్మ తెలిపారు.

ఎఫ్‌పీఐ,డీఐఐల కొనుగోళ్లు..

విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌సీఐ) బుధవారం రూ.276.14 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేయగా దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు (డీఐఐ) రూ.439.67 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేసినట్లు బీఎసఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

హువీయ్ వై9 2019 స్మార్ట్ ఫోన్ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: హువీయ్ కన్స్యూమర్ బిజినెస్ గ్రూస్ ఇండియా తమ హువీయ్ వీ9 2019 స్మార్ట్‌ఫోన్‌ను ఆవిష్కరించింది. ప్రీమియం నాణ్యత, అత్యున్నత అనుభవాలను అందించడంపై అధికంగా దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపింది. 6.5 అంగుళాల స్క్రీన్, 3డీ కర్వ్ డిజైన్, శక్తివంతమైన బ్యాటరీ, అత్యాధునిక క్వాడ్ కెమెరా, ఫ్లాగ్‌షిప్ లెవల్ క్రాఫ్ట్‌మెన్‌షిప్ వంటివి ఉన్నాయి. ఈ స్మార్ట్‌ఫోన్ అత్యంత దృఢమైన మెటీరియల్‌తో తయారు చేశారు. హువీయ్ పరికరాలకు అంతర్జాతీయంగా అత్యున్నత శ్రేణి నాణ్యతా, మన్నిక పరంగా గుర్తింపు ఉంది.

గాలిలో హాయ్.. హాయ్



త్వరలో ఎయిర్ ట్యాక్సీలు

ముంబై: నిమిషాల్లో చేరుకోవాల్సిన గమ్యం.. రద్దీ కారణంగా గంటలు పడుతుంది. అంతర్జాతీయంగా న్యూయర్క్, లాస్ ఏంజెల్స్, హోస్టన్, అట్లాంటా వంటి నగరాల్లో వాహన రద్దీ అత్యధికంగా ఉంటుంది. దీనికి పరిష్కారంగా.. మెట్రో రైలు వంటి ప్రాజెక్టులు కొన్ని నగరాల్లో ఏర్పాటు చేశారు. అయితే ఈ మెట్రో రైలు వ్యవస్థ నిర్మాణం ఖర్చుతో కూడుకున్నదే కాక, కొంత ప్రయాస కూడా. అన్ని ప్రదేశాలకు అనుసం ధానమై ఉండే అవకాశం లేకపోవడమూ మరో ప్రతికూలాంశంగా పేర్కొనవచ్చు. వీటన్నింటికీ ప్రత్యామ్నాయంగా కొన్నేళ్ల క్రితం 'ఎయిర్ ట్యాక్సీ' అనే రవాణా వ్యవస్థ గురించి వార్తలొచ్చాయి. ట్రాఫిక్‌తో సంబంధం లేకుండా ఈ ట్యాక్సీలు గాలిలో ప్రయాణిం చడం వల్ల.. సమయం బాగా ఆదా అవుతుంది. ఎయిర్ ట్యాక్సీలను హెలికాప్టర్లకు హైబ్రీడ్ వెర్షన్‌గా చెప్పుకోవచ్చు. అయితే ఈ ఎయిర్‌ట్యాక్సీలను బెల్ నెక్సస్ అనే సంస్థ తయారు చేస్తోంది. దీనికి ఊబర్ సంస్థ అనధికార భాగస్వామి. ఈ ఏడాది లాస్ ఏంజిల్స్‌లో జనవరి 8 నుంచి 11 వరకూ జరుగుతున్న సీఈఎస్ సాంకేతిక ప్రదర్శనలో భాగంగా సంస్థ ఈ వాహన నమూనాను 'అర్బన్ ఎయిర్ మొబిలిటీ వెహికిల్' పేరుతో ఆవిష్కరించారు. ఈ ఎయిర్ ట్యాక్సీలను 2020ల్లో అన్ని ప్రధాన నగరాల్లో అందుబాటు లోకి తెచ్చే యోచనలో ఉన్నట్లు బెల్ నెక్సస్ సంస్థ కార్య నిర్వాహక ఉపాధ్యక్షుడు రాబర్ట్ హాస్టింగ్స్ వెల్లడించారు. ఈ రంగంలో ప్రస్తుతం తాము అనుసరిస్తున్న టెక్నాలజీ మరీ అంత కఠినమేమీ కాదని ఆయన అభిప్రాయ పడ్డారు. విద్యుత్‌తో నడిచే ఈ ఎయిర్ ట్యాక్సీ లకు హైబ్రీడ్ విద్యుత్ ప్రొపల్షన్ వ్యవస్థతో ఆరు ఫ్యాన్లు ఉంటాయి. ఎయిర్ ట్యాక్సీ ఎగరడం, దిగడం, వివిధ కోణాల్లో ముందుకు పోవడం, వేగాన్ని నియంత్రిం చడంలో ఈ వ్యవస్థే కీలకం కానుంది. వాహనం బరువు 6 వేల పౌండ్లు (2,721 కిలోలు). ఎగిరేటప్పుడు దుమ్ము, వర్షం వంటి పరిస్థితులకు తట్టుకొని ఉండగలదు. పక్షులు ఎదురైనా ప్రమాదమేమీ ఉండబోదు. ఈ ట్యాక్సీలు నిట్ట నిలువుగా ఎగరడం, దిగడం కోసం దీనిపై నాలుగేళ్లుగా దృష్టి సారించాం" అని హాస్టింగ్స్ వెల్లడించారు.



టీసీఎస్‌కు లాభాల పంట

ముంబై: దేశంలోనే అతి పెద్ద సాఫ్ట్‌వేర్ ఎగుమతిదారు టీసీఎస్ 2018 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో నికర లాభంలో 24.1 శాతం వృద్ధి నమోదుచేసింది. రూ.8,105 కోట్ల లాభం నమోదు చేసింది. గతేడాది ఇదే సమయానికి సంస్థ రూ.6,531 కోట్ల నికర లాభం నమోదు చేయడం గమనార్హం.టాటా గ్రూప్ సంస్థల్లోనే ఎక్కువ లాభాల్నినమోదు చేసే టీసీఎస్ ఈ త్రైమాసికానికి ఆదాయంలో 20.8 శాతం వృద్ధిరేటు నమోదు చేసింది. గతేడాది ఆదాయం రూ.30,904 కోట్ల నుంచి రూ.37,338 కోట్లకు పెరిగింది. కరెన్సీ ఆధారంగా ఆదాయ వృద్ధి 12.1 శాతంగా ఉంది. గత 14 త్రైమాసికాల్లో ఇదే అత్యధిక వృద్ధి రేటని సంస్థ సీఈవో, ఎండీ రాజేశ్ గోపీనాథన్ వెల్లడించారు. క్లయింట్లు, డిజిటల్ సేవల్లో అగ్రస్థానంలో ఉండటం, ఎక్కువ ఆర్డర్లు ఉండటంతో వినియోగదారులు టీసీఎస్ సామర్థ్యాలను గుర్తించారని ఆయన తెలిపారు. డిజిటల్ సేవల ద్వారా వచ్చే రాబడి ఆదాయంలో 30.1 శాతంగా ఉండగా వార్షిక వృద్ధి రేటు 52.7 శాతంగా నమోదైంది. ప్రధాన కరెన్సీలతో పోలిస్తే రూపాయి పలు ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నా, ఇతర మార్కెట్లలో వ్యాపార నిర్వహణ ఖర్చులు పెరుగుతున్నా టీసీఎస్ పటిష్ఠంగా ఉందని ఆ సంస్థ ముఖ్య ఆర్థిక అధికారి వి.రామకృష్ణన్ తెలిపారు. ఇక 2018 అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో టీసీఎస్ 6,827 మంది ఉద్యోగులను నియమించుకుంది. ఉద్యోగుల సంఖ్య 4,17,929కి చేరింది. పన్నెండు నెలల ఆధారంగా సంస్థను వదిలేస్తున్న వారి శాతం 11.2 శాతంగా ఉంది.

సంక్రాంతి సందర్భంగా బిగ్‌సిలో వినూత్న ఆఫర్‌లు

విశాలాంధ్ర-హైదరాబాద్: సంక్రాంతి పండుగ సందర్భంగా మొబైల్ రిటైల్ విక్రయరంగ సంస్థ బిగ్ సి వినూత్న ఆఫర్లను ప్రకటించింది. ఎంపిక చేయబడిన మొబైల్స్ కొనుగోళ్ళపై చక్కని, విలువైన బహుమతులను అందజేయనున్నట్లు బిగ్‌సి ప్రతినిధి తెలిపారు. ప్రతి పండుగను, పర్వదినాన్ని పురస్కరించుకొని వినూత్న ఆఫర్లు ప్రకటించడం బిగ్‌సి ప్రత్యేకత. సంక్రాంతి సందర్భంగా బిగ్‌సిలో మొబైల్స్ కొనుగోలుపై 0శాతం వడ్డీ, 0శాతం డౌన్ పేమెంట్, 0శాతం ప్రాసెసింగ్ ఫీ లాంటి ఆకర్షణీయమైన ఆఫర్లను ప్రకటించింది. అలాగే బజాజ్ ఫైనాన్స్ ద్వారా కొనుగోలు చేసిన ప్రతి మొబైల్‌పై 10 శాతం క్యాష్‌బ్యాక్, సామ్‌సంగ్ గెలాక్సీ జె6, జె6+, ఎ7 మొబైల్ కొనుగోలుపై 10 శాతం క్యాష్ బ్యాక్, ఒప్పో ఎఫ్9 ప్రో మొబైల్ కొనుగోలుపై రైస్ కుక్కర్, అన్ని వివో ఫోన్స్‌పై ప్రత్యేక బహుమతి అందివనున్నట్లు తెలిపింది.

లాభాల్లో బంధన్ బ్యాంక్

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగంలోని బంధన్ బ్యాంక్ నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో 10 శాతం పెరిగింది. గత క్యూ3లో రూ.300 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.331 కోట్లకు ఎగసిందని బంధన్ బ్యాంక్ తెలిపింది. ఈ బ్యాంక్ నికర లాభంపై కూడా ఐఎల్ అండ్‌ఎఫ్‌ఎస్ గ్రూప్ రుణ భారం ప్రభావం చూపించింది. ఈ సంస్థకు ఇచ్చిన రుణాలకు ఈ బ్యాంక్ పూర్తిగా కేటాయింపులు జరపాల్సి వచ్చింది. ఈ కేటాయింపులు లేకపోతే, నికర లాభం మరింతగా పెరిగి ఉండేది. కాగా ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్‌కు ఏ మాత్రం రుణాలిచ్చిం దనేది ఈ బ్యాంక్ వెల్లడించలేదు. ఐఎల్‌అండ్ ఎఫ్‌ఎస్ రుణాల పుణ్యమాని ఈ బ్యాంక్ మొండి బకాయిలు భారీగా పెరిగాయి.

54 శాతం పెరిగిన నికర వడ్డీ

గత క్యూ3లో రూ. 1,336 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం ఈ క్యూ3లో 41 శాతం వృద్ధితో రూ.1,884 కోట్లకు ఎగసిం దని బ్యాంక్ ఎమ్‌డీ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ చంద్ర శేఖర్ ఘోష్ తెలిపారు. రుణాలు 46 శాతం వృద్ధి చెంది రూ.35,599 కోట్లకు పెరిగాయని పేర్కొన్నారు. రుణ వృద్ధి జోరుగా ఉండటం, మార్జిన్లు పటిష్టంగా(10.5 శాతం) ఉండటంతో నికర వడ్డీ ఆదాయం 54 శాతం ఎగసి రూ.1,124 కోట్లకు పెరిగిందని తెలిపారు. ఇతర ఆదాయం 48 శాతం పెరిగి రూ.234 కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు. నిర్వహణ లాభం రూ.574 కోట్ల నుంచి 57 శాతం పెరిగి రూ.900 కోట్లకు చేరిందని తెలిపారు. గత క్యూ3లో 9.9 శాతంగా ఉన్న నికర వడ్డీ మార్జిన్ ఈ క్యూ3లో 10.3 శాతానికి పెరిగిందని వివరించారు.

తగ్గిన రుణనాణ్యత...

ఇన్ని సానుకూలాంశాలున్నా ఈ బ్యాంక్ రుణ నాణ్యత తగ్గింది. ఈ ఆర్థిక సంవత్సరం రెండో క్వార్టర్‌లో 1.29 శాతంగా ఉన్న స్థూల మొండిబకాయిల నిష్పత్తి ఈ క్యూ3లో 2.41 శాతానికి పెరిగింది. అలాగే నికర మొండి బకాయిలు 0.69 శాతం నుంచి 0.70 శాతానికి పెరిగాయి. ఈ క్యూ2లో రూ.124 కోట్లుగా ఉన్న కేటాయింపులు ఈ క్యూ3లో రూ.474 కోట్లకు పెరిగాయని ఘోష్ పేర్కొన్నారు. ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ కంపెనీకి ఇచ్చిన రుణాల కోసం రూ.385 కోట్ల మేర కేటాయింపులు జరిపామని వెల్లడించారు. ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ కేటాయిం పులు లేకపోతే మొత్తం కేటాయింపులు రూ.90 కోట్లుగానే ఉండే వని వివరించారు. హెచ్‌డీఎఫ్‌సీ గ్రూప్‌నకు చెందిన గృహ్ ఫైనాన్స్ కంపెనీని కొనుగోలు చేయడానికి ఈ బ్యాంక్ ఇటీవలనే ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ దీర్ఘకాలం లో ప్రయోజనం కలిగిస్తుందన్న ధీమాను బ్యాంక్ ఎమ్‌డీ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ చంద్ర శేఖర్ ఘోష్ వ్యక్తం చేశారు.



మార్ఫియస్ కస్తూరి ఐవీఎఫ్‌లో ప్రామాణిక సేవలు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఇండోజర్మన్ సహకారంతో సికింద్రాబాద్‌లోని మార్ఫియస్ కస్తూరి ఇంటర్నేషనల్ ఐవిఎఫ్ సెంటర్, తన కేంద్రంలో ప్రపంచస్థాయి సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. సంతాన సాఫల్యంలో అపార అనుభవం కలిగిన జర్మన్ వైద్యులు, కోర్ ఫెర్టిలిటీ నిపుణురాలు డా.కల్పన ఎంలు సంయుక్తంగా ఈ సేవలను అందించనున్నారు. ప్రస్తుత కాలంలో సంతానరాహిత్యం ఎక్కువ అవుతోందని దీనికి కారణాలు అన్వేషిస్తున్నామని, ముఖ్యంగా ఆహారపు అలవాట్లు, వాతావరణ కాలుష్యం వల్ల ఇన్‌ఫెర్టిలిటీ ఇబ్బందులకు గురౌతున్నట్లు గుర్తించామని కల్పన తెలిపారు. జర్మన్ సాంకేతికత అందిస్తున్న మార్ఫియస్ సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పారు. ఐవిఎఫ్ ద్వారా సంతానాన్ని పొందండ ఒకొక్కసారి జరగకపోవచ్చని, రెండవసారి కూడా ప్రయత్నించాల్సి వస్తుందని, అందుకే తాము ఒకేసారి అయ్యే ఖర్చుతోనే అవసరమైతే రెండవసారి ప్రయత్నానికి ఉచితంగా వైద్యం అందిస్తున్నామన్నారు.

13 వరకు కాటన్ సిల్క్ ప్రదర్శన

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: వస్త్ర ప్రపంచం ఒకే చోట కొలువుతీరింది. మహిళల అభిరుచులకు అనుగుణంగా వివిధ రాష్ట్రాలకు చెందిన సాంప్రదాయ చేనేతలు అందుబాటులో ఉన్నాయి. వస్త్ర మేళలో అడుగుపెడితే కావలసిన వస్త్రాలు కొనుగోలు చేయవచ్చు. టిటిడి కళ్యాణ మండపంలో సిల్క్ కాటన్ మేళ విశేషంగా ఆకట్టుకుంటుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన వస్త్రాలు, హస్త కళాఖండాలు, చేనేత వస్త్రాలు అందుబాటులో ఉన్నాయి. దాదాపు 60కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కాశ్మీర్, బెంగాల్, కర్నాటక, తమిళనాడు, ఇతర రాష్ట్రాలకు చెందిన ఆయా రాష్ట్రాల సాంప్రదాయ చేనేత వస్త్రాల విక్రయాలు సాగుతున్నాయి. ఈ నెల 13వ తేదీ వరకు జరిగే సిల్క్ కాటన్ మేళలో వివిధ రకాల వస్త్రాలపై రాయితీలు కూడా ఇస్తున్నారు. చేనేత కళాకారులు, మాస్టర్ డిజైనర్ల సమూహారమే క్రాఫ్ట్ వీవర్స్ అర్టిసన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వస్త్ర ప్రదర్శన కొనసాగుతుంది.

వ్యవసాయ ఎగుమతుల పెంపుపై దృష్టి

న్యూఢిల్లీ: వ్యవసాయ ఎగుమతుల పురోగతిపై కేంద్రం దృష్టి సారిస్తోంది. ఈ దిశలో రాష్ట్రాలకు రవాణా సబ్సిడీని అందించాలని యోచిస్తోంది. వాణిజ్య శాఖ మంత్రి సురేశ్ ప్రభు గురువారం ఈ విషయం తెలిపారు. అంతకుముందు వాణిజ్యం, అభివృద్ధి వ్యవహారాల మండలి సమావేశం జరిగింది. కర్ణాటక, పంజాబ్, తమిళనాడుసహా పలు రాష్ట్రాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వ్యవసాయ ఎగుమతుల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశం చర్చించినట్లు ప్రభు తెలిపారు. ఎగుమతి దారులు ఎదుర్కొంటున్న రుణ సంబంధ సమస్యలపై అడిగిన ప్రశ్నకు ఆయన సమా ధానం ఇస్తూ, ఫైనాన్స్ వ్యవహారాల కార్యదర్శి ఈ అంశంపై బ్యాంకర్లతో చర్చిస్తారని పేర్కొన్నారు. ఎగుమతుల రంగానికి రుణాన్ని ప్రాధాన్యతాపరమైనదిగా పరిగణించాలని డిమాండ్ ఉంది. అంతర్జాతీయ చట్టాలను ఏ విధంగానూ ఉల్లంఘించకుండా, ఇరాన్‌తో వాణిజ్య సంబంధాలు నెరపడానికి ప్రయత్నం చేస్తున్నట్లు మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. భారత్-చైనాల మధ్య వాణిజ్య సంబంధాలు పురోగతిలో ఉన్నాయని తెలిపారు.




'గూగుల్ రొటీన్' సెటప్, పనితీరు ఇలా..

సాఫ్ట్ వేర్ రంగంలో దూసుకుపోతున్న దిగ్గజ సంస్థ గూగుల్ ఎప్పటికప్పుడు తాజాగా తన ఫీచర్లను విడుదల చేస్తూ వస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా గత ఏడాది జూన్‌లో 'గూగుల్ రొటిన్' అనే కొత్త ఫీచర్ ని పరిచయం చేసింది. దీని ద్వారా గూగుల్ అసిస్టెంట్ ఒకేసారి రెండు ఫ్లాట్‌ఫాంల మీద పనిచేస్తుంది. వాయిస్ కమాండ్ సూచనలతో గూగుల్ రొటిన్ మల్టి టాస్కింగ్ ఫ్లాట్‌ఫాంల మీద పనిచేస్తుంది. మీరు ఈ ఫీచర్‌ని సెట్టింగ్స్‌లో చూడవచ్చు. దీన్ని మీరు అలారం బటన్ సెట్టింగ్స్‌లో చూడవచ్చు. ఇది అనేక రకాలైన పనులను మీకు చేసి పడుతుంది. మరి ఇది ఎలా పనిచేస్తుంది. దీన్ని ఎలా సెటప్ చేసుకోవాలో ఓ సారి చూద్దాం.

స్టెప్ 1

ముందుగా అలారం సెట్టింగ్స్‌ని ఓపెన్ చేయండి. అందులో మీకు లేబిల్ కింద Google Assistant Routine పేజీ కనిపిస్తుంది. దీన్ని మీరు యాక్టివ్ చేసుకుని అలారం పేజీ డిస్ మిస్ చేయండి



స్టెప్ 2

అక్కడ మీకు మీడియా అడ్జెస్ట్ వాల్యూం బటన్ కనిపిస్తుంది. దీన్ని సెట్ చేసుకోండి. ఇందులో వాతావరణం అలాగే ఇతర విషయాలను మీరు వాయిస్ కమాండ్ ద్వారా సెట్ చేసుకోవచ్చు. టుడే క్యాలండర్ లో మీరు ఇవి సెట్ చేసుకుని ఫోన్ సైలెంట్‌లో పెట్టుకోవచ్చు.

స్టెప్ 3

ఇవి ఆర్డర్‌లో సెలక్ట్ చేసుకున్న తరువాత గూగుల్ అసిస్టెంట్‌లో మీరు ఏ విషయం అడిగినా వెంటనే మీకు సమాధానం వస్తుంది.

స్టెప్ 4

News, Podcasts, Audiobook and Nothing ఇలాంటి విషయాలను మీరుటాస్క్ బార్‌లో చూడవచ్చు.

స్టెప్ 5

అలాగే న్యూస్ సోర్స్ ఎక్కడ నుంచి వచ్చిందనే విషయం కూడా మీకు గూగుల్ అసిస్టెంట్ చూపిస్తుంది.

స్టెప్ 6

ప్రాసెస్ అయిన తరువాత టాప్ రైట్ కార్నర్ లో కనిపించే టిక్ మార్క్ ఐకాన్ క్లిక్ చేయండి. ఇలా చేయడం వల్ల మీ మొబైల్ లాక్ స్క్రీన్‌లో ఉన్నప్పుడు కూడా మీకు ఈ వివరాలు కనిపిస్తాయి. అక్కడ కనిపించే అల్లో బటన్ ప్రెస్ చేస్తే సరిపోతుంది.

స్టెప్ 7

Google Assistant Routine అలారం కింద కనిపిస్తుంది. అక్కడ కనిపించే మైనస్ గుర్తును రిమూవ్ చేస్తే సరిపోతుంది. అప్పుడు మీకు అలారంతో పాటుగా గూగుల్ అసిస్టెంట రొటిన్ కూడా రోజు వారీ పనులను చేసి పెడుతుంది.

ఆధార్ కార్డు పోతే కొత్తది పొందండిలా..

ఇప్పుడు అన్ని ప్రభుత్వ సేవలకు ఆధార్ కార్డులు తప్పనిసరి. కానీ ఈ ఆధార్ కార్డు పోయినట్లయితే? అలాంటి సందర్భాలలో మనకు ఉన్న ఏకైక ప్రత్యామ్నాయం UIDAI వెబ్ సైట్ ద్వారా నకిలి కార్డు పొందటమే. ఈ నేపథ్యంలో UIDAI సరికొత్త సర్వీస్‌ను ప్రారంభించింది. మీ ఆధార్ కార్డు పోతే కేవలం రూ.50 పే చేస్తే చాలు మీ ఆధార్ కార్డు పొందవచ్చు. ఈ కొత్త ఆధార్ కార్డు స్పీడ్ పోస్ట్ ద్వారా కేవలం 5 రోజుల్లో మీ అడ్రస్‌కు చేరుతుంది.



పోగొట్టుకున్న ఆధార్ కార్డును పొందాలని చూస్తున్నారా? అయితే ఈ స్టెప్స్‌ను అనుసరించండి

గుర్తించుకోవాల్సిన మొదటి విషయం..

రీప్రింటింగ్ రిక్వెస్ట్‌ను రైజ్ చేయడానికి మీ ఆధార్ కార్డు నెంబర్ లేదా వర్చువల్ ఐడెంటిఫికేషన్ నెంబర్ (VID)ను గుర్తు పెట్టుకోవాలి.

స్టెప్ 1

పిసి బ్రౌజర్‌లో 'www.uidai.gov.in' సైట్‌ను ఓపెన్ చేయండి. 'Aadhar service' సెక్షన్‌ను ఓపెన్ చేసి Order Aadhaar Reprint (Pilot basis) అనే ఆప్షన్‌ను సలెక్ట్ చేయండి. వెంటనే వేరే ట్యాబ్ ఓపెన్ అవుతుంది. అందులో మీ ఆధార్ కార్డు నెంబర్ లేదా వర్చువల్ ఐడెంటిఫికేషన్ నెంబర్(VID)ను అలాగే సెక్యూరిటీ కోడ్ (captcha)ను డైలాగ్ బాక్స్‌లో ఎంటర్ చేయండి.

స్టెప్ 2

మీరు ముందే మీ నెంబర్‌ను రిజిస్టర్ చేసి ఉంటే 'Send OTP' అనే బటన్‌ను క్లిక్ చేయండి. ఒక వేళా మీరు రిజిస్టర్ చేసుకోకపోతే If you do not register your mobile number and proceed అనే డైలాగ్ బాక్స్‌పై క్లిక్ చేయండి

స్టెప్ 3

మీ ఫోన్ నెంబర్ కు వచ్చిన ఆ్రా ను ఎంటర్ చేయండి. మీ డీటైల్స్‌ను ఓకే సరి చెక్ చేసుకొని ' Make Payment ' అనే ఆప్షన్‌ను క్లిక్ చేసి మీకు ఈజీగా ఉన్న మోడ్‌లో పేమెంట్‌ను చేయండి.


స్టెప్ 4

ఈ ప్రక్రియ అంత పూర్తయ్యాక మీకు స్క్రీన్‌పైన కన్ఫర్మేషన్ మెసేజ్ వస్తుంది. అలాగే ఫ్యూచర్ రిఫరెన్స్ కోసం SRN number మెసేజ్ మీ ఫోన్‌కు వస్తుంది.

నోట్ : ఒక వేళా మీరు మీ ఫోన్ నెంబర్‌ను రిజిస్టర్ చేసుకోకపోయింటే స్టెప్ 2 లో చెప్పిన విధానంగా enter the mobile number to receive OTP అనే ఆప్షన్‌పై క్లిక్ చేయండి.

స్టేటస్‌ను ట్రాక్ చేయడానికి ఈ స్టెప్స్ ఫాలో అయిపోండి...

- www.resident.uidai.gov.in/check-aadhaar-reprint లింక్‌ను ఓపెన్ చేయండి
- మీ ఫోన్‌కు వచ్చిన SRN numberను ఎంటర్ చేయండి
- సెక్యూరిటీ కోడ్‌ను ఫిల్ చేసి సబ్మిట్ చేయండి.




వాట్సాప్‌లో మిమ్మల్ని బ్లాక్ చేసిన వ్యక్తితో మళ్లీ చాట్ చేయవచ్చు..

వాట్సప్ ప్రపంచంలోనే టాప్ మెసెంజర్ యాప్. ఎన్ని మెసేజ్ సర్వీసులు వచ్చిన వాట్సప్ టాప్‌లోనే ఉంటుంది.దానికి ముఖ్య కారణం ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్లతో యూజర్లకు కొత్త ఎక్స్‌పీరియెన్స్ అందించడమే. ప్రతీ నెల వాట్సప్ కొత్తకొత్త ఫీచర్లతో న్యూ లుక్ తీసుకొస్తోంది. ఈ ఫీచర్లు యూజర్లను బాగా ఆకట్టుకుంటున్నాయి కూడా. వీటితో పాటు వాట్సాప్ టు-స్టెప్ వెరిఫికేషన్, హైడింగ్ స్టేటస్, హైడింగ్ ప్రొఫైల్ పిక్చర్, బ్లాక్ వంటి సెక్యూరిటీ, ప్రైవసీ ఫీచర్స్ ను విడుదల చేసింది. అయితే వాట్సాప్‌లో మిమ్మల్ని ఎవరైనా బ్లాక్ చేస్తే తేలిగ్గా వాళ్ళతో మళ్లీ తిరిగి చాట్ చేయొచ్చు. అది ఎలాగో దిగువన పేర్కొన్న దశలు అనుసరించండి.

మొదటగా మిమ్మల్ని బ్లాక్ చేసారో లేదో తెలుసుకోవడానికి ఇలా చేయండి...

- మొదట మీ వాట్సాప్ కాంటాక్ట్ లిస్ట్‌లో ఆ వ్యక్తిని చూడవచ్చో లేదో చెక్ చేయండి



- వ్యక్తికి సంబంధించిన ఇతర ప్రొఫైల్ ఇన్ఫర్మేషన్ కనిపిస్తుందో లేదో చూడండి
- మీరు మెసేజ్ చేసాక సింగల్ టిక్‌ను మాత్రం చూస్తున్నారా ?

మీరు ఈ మూడు సమాచారాన్ని చూడలేకపోతే, మిమ్మల్ని ఆ వ్యక్తి బ్లాక్ చేసినట్లు అర్థం.

మీరు తిరిగి ఆ వ్యక్తి తో చాట్ చేయడం కోసం...

ఇప్పుడు, మీ ఇద్దరి మ్యూచువల్ ఫ్రెండ్‌తో ఒక వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేయండి .మిమ్మల్ని బ్లాక్ చేసిన వ్యక్తితో మీరు కొత్త గ్రూప్‌ను క్రియేట్ కాబట్టి మీరు ఇలా చేయండి. వేరే నెంబర్ ఉంటే ఆ నెంబర్‌ను మీ మ్యూచువల్ ఫ్రెండ్‌ను గ్రూప్ క్రియేట్ చేయమని చెప్పండి.

ఈ స్టెప్స్ ఫాలో అయిపోండి...

- మీ వాట్సాప్ ను ఓపెన్ చేయండి
- మీరు మీ ఇతర నంబర్‌ను వాడుతుంటే అప్పుడు ఆ గ్రూప్‌కు మూడవ వ్యక్తి(అకౌంట్ 3)ను యాడ్ చేయండి
- గ్రూప్ క్రియేట్ అయిన తర్వాత, గ్రూప్‌లో ఉన్న మూడు డాట్స్‌ను ఓపెన్ చేసి ' Group info ' అనే ఆప్షన్ ను క్లిక్ చేయండి
- ఇప్పుడు అకౌంట్ 3 ని అడ్మిన్‌గా అసైన్ చేయండి
- అకౌంట్ 1 గ్రూప్‌లో యాడ్ చేయమని అకౌంట్ 3కు చెప్పండి.

మన సినిమా కోసం వెయిటింగ్ : మహేష్





రంగస్థలం లాంటి వినూత్న సినిమాను తెరకెక్కించి తనలోని టాలెంట్‌ను మరోసారి నిరూపించుకున్నారు సుకుమార్. ఈ లెక్కల మాష్టారు పుట్టినరోజు నేడు (జనవరి 11). కెరీర్ స్టార్టింగ్ నుంచి డిఫరెంట్ సినిమాలను తెరకెక్కిస్తూ సక్సెస్‌ను అందుకుంటున్న ఈ డైరెక్టర్‌కు సినీ ప్రముఖులు విషెస్ చెబుతున్నారు. సూపర్‌స్టార్ మహేష్ బాబు, సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన వన్ నెనొక్కడినే మూవీ ఆశించినంతగా ఆకట్టుకోలేకపోయింది. అయితే మళ్లీ మహేష్-సుకుమార్ కాంబినేషన్‌లో ఓ సినిమా రాబోతోన్న సంగతి తెలిసిందే. నేడు సుకుమార్ బర్త్‌డే సందర్భంగా మహేష్ ట్వీట్ చేస్తూ.. 'మోస్ట్ హంబుల్, సూపర్ టాలెంటెడ్ సుకుమార్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు. మన సినిమా కోసం ఎదురుచూస్తున్నాను సర్' అని అన్నారు. మహేష్ ప్రస్తుతం మహర్షి షూటింగ్‌లో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే.

బాలాను చూసి భయపడ్డాను!

శాంఢ్రా ఎమి



'కాట్రిన్ మొళి' చిత్రం ద్వారా సినీరంగానికి పరిచయమైన శాంఢ్రా ఎమి తాజాగా 'వర్మ'లో నటించారు. బాలా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నటుడు విక్రమ్ కొడుకు ధ్రువ్ హీరోగా కోలీవుడ్‌కు పరిచయం కాబోతున్నాడు. సినిమాలో దేవి అనే పాత్రలో శాంఢ్రా నటించింది. ఈ సినిమా షూటింగ్‌లో బాలాతో ఎదురైన అనుభవాలను ఆమె ట్విట్టర్‌లో పంచుకున్నారు. "కాట్రిన్‌మొళి"కి ముందే 'వర్మ'కి కాల్షీట్ ఇచ్చాను. సినిమాలపైన ఆసక్తి ఉండే ఎవరైనా బాలా సినిమాలో నటించాలని తపించిపోతుంటారు. ఆడిషన్‌లో ఈ సినిమాకు నన్ను ఎంచుకున్నారు. మొదటి రోజు షూటింగ్‌లో చాలా భయపడ్డాను. బాలా బాగా భయపెడతారని యూనిట్‌వాళ్లు నాకు చెప్పారు. కానీ డైలాగ్‌లు సరిగ్గా చెప్పలేకపోయినా, సరిగ్గా నటించలేకపోతే మాత్రమే ఆయనకు కోపంవస్తుందన్న సంగతి నాకు తర్వాత తెలిసింది. ఆయనతో కలిసి పనిచేసేటప్పుడు నటనకు సంబంధించి చాలా విషయాలు తెలుసుకున్నాను. బాలా సినిమాలు ఎందుకు సూపర్‌హిట్టవుతాయన్న విషయం అప్పుడే నాకు అర్థమైంది' అని శాంఢ్రా ఎమి వివరించింది.

'వినయ విధేయ రామ' రొటీనే !



మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను దర్శకత్వంలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, కియారా అద్వాని జంటగా నటించిన చిత్రం 'వినయ విధేయ రామ'. రాక్ స్టార్ దేవిశ్రీ సంగీతం అందించిన ఈ సినిమాను డీవీవీ దానయ్య నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా కొందరు ప్రేక్షకులు ట్విటర్ ద్వారా సినిమాపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సినిమాపై ప్రేక్షకులు మిశ్రమ స్పందనను తెలియజేస్తున్నారు. రామ్ చరణ్ తన నటనతో ఆకట్టుకున్నాడని... కియారా తన అందం, డ్యాన్సులతో మెప్పించిందని నెటిజన్లు పేర్కొంటున్నారు. అలాగే ఈ సినిమాలో అజర్‌బైజాన్ సహా మరికొన్ని సీన్స్ సినిమాకు హైలైట్‌గా నిలుస్తున్నాయనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రతినాయకుడి పాత్రలో వివేక్ ఒబెరాయ్ మెస్మరైజ్ చేశారని టాక్.. కానీ హార్స్ రైడింగ్, యాక్షన్ ఎపిసోడ్స్ కొన్ని మాత్రం ప్రేక్షకులను పెద్దగా మెప్పించలేకపోయాయని నెటిజన్లు పేర్కొంటున్నారు. దేవిశ్రీ సంగీతం అందించారంటే ఆ చిత్రం ఆడియో బ్లాక్ బస్టర్ అనే భావన ప్రేక్షకుడిలో ఉంది. కానీ ఈ చిత్రంలో సంగీతం అంతగా ఆకట్టుకోలేకపోయిందని ప్రేక్షకుల టాక్. 'రంగస్థలం' సినిమాలో కథను బట్టి చెర్రీ పెద్దగా స్టెప్పులకు ప్రాధాన్యమివ్వలేదు. కానీ ఈ చిత్రంలో డ్యాన్సుల పరంగా దుమ్మురేపాడని నెటిజన్లు చెబుతున్నారు. ఫస్ట్ హాఫ్ కాస్త ఆకట్టుకున్నప్పటికీ సెకండాఫ్ మాత్రం రొటీన్ కథతో బోయపాటి ప్రేక్షకులను కాస్త నిరుత్సాహానికి గురి చేశారని టాక్. ఇంటర్వెల్ బ్యాంగ్, బీహార్ ఎపిసోడ్స్ మాత్రం ఆకట్టుకునేలా బోయపాటి చిత్రీకరించారనే అభిప్రాయం నెటిజన్ల నుంచి వ్యక్తమవుతోంది. ఎమోషన్, యాక్షన్ అంశాలపై దృష్టి పెట్టే బోయపాటి.. ఈ చిత్రం ద్వారా ప్రేక్షకులను కాస్త నిరుత్సాహానికి గురిచేశారనే అభిప్రాయం మాత్రం

17ఏళ్లుగా ముద్దులు పెడుతూ.. అలసిపోయా!



యుద్ధంలో పోరాడే యోధులుంటారు కదా.. అలాగే ముద్దుల యుద్ధంలో పోటీలేని ఓ వీరుడున్నాడు. ముద్దులుపెట్టడంలో అతన్ని మించినోడు లేడు. బాలీవుడ్‌లో సీరియల్ కిస్సర్‌గా ఫేమస్ అయ్యాడు ఇమ్రాన్ హష్మీ. ఆయన తీసిన ప్రతి సినిమాలో దాదాపు 20 లిప్‌లాక్‌లు ఉంటాయి. దీంతో బాలీవుడ్‌లో మోస్ట్ రొమాంటిక్ హీరోగా అమ్మాయిల గుండెల్లో స్థానం సంపాదించాడు. అయితే ఇమ్రాన్ ప్రస్తుతం చీట్‌ఇండియా అనే చిత్రంతో ప్రేక్షకులను పలకరించేందుకు రెడీ అవుతున్నాడు, ఈ చిత్రప్రమోషన్‌లో పాల్గొన్న ఇమ్రాన్.. పదిహేడేళ్లుగా ప్రతిసినిమాలో దాదాపు ఇరవై ముద్దులు పెడుతూ అలసిపోయానని చెప్పుకొచ్చాడు. ఇకపై తాను ఇలాంటి సీన్స్‌లో నటించకూడదని అనుకుంటున్నట్లుగా చెప్పుకొచ్చాడు. విభిన్న పాత్రల్లో నటించాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు. తాను చేస్తున్న ప్రస్తుత చిత్రం 'చీట్ ఇండియా'.. భారతీయ విద్యా విధానంలో ఉన్న మాఫియా నేపథ్యంలో సాగుతుందని తెలిపాడు.

తొమ్మిదిలో ప్రేమ... పదిలో బ్రేకప్



తెలుగు, తమిళ, బాలీవుడ్ పరిశ్రమల్లో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది తాప్సి. ఒకప్పుడు వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఆమె తాజాగా పీబీఎల్‌లోకి అడుగుపెట్టింది. పుణె 7 ఏసెస్ జట్టుకు సహ యజమానిగా వ్యవహరిస్తోంది. భువనేశ్వర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో తాప్సి పాల్గొంది. ఈ సందర్భంగా తన వ్యక్తిగత విషయాలను పంచుకుంది. 'నేను తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడు ప్రేమలో పడ్డాను. ఈ విషయం విని అందరూ ఆశ్చర్యపోవచ్చు. కానీ, నా స్నేహితులందరి కంటే నేనే ఆలస్యంగా ప్రేమించాను. కానీ నేను ప్రేమించిన అబ్బాయి పదో తరగతి పరీక్షలొస్తున్నాయని నన్ను వదిలేశాడు. అప్పుడు బాధేసింది. ఆ సమయంలో మాకు సెల్‌ఫోన్లు లేవు. మా ఇంటి పక్కనే ఉండే పీసీవో నుంచి తనకు ఫోన్ చేసి ఏడ్చేదాన్ని. నన్నెందుకు వదిలేశావ్? అని అడిగేదాన్ని. ఇప్పుడు అవన్నీ తలుచుకుంటే నవ్వొస్తుంది' అని తెలిపింది. ప్రేమ, పెళ్లి గురించి మాట్లాడుతూ..'నేను ఆగస్టు1 పుట్టాను. నాది సింహరాశి. నా వ్యక్తిగత జీవితంలోనూ, నేను చేసే పనిలో నేను హైలైట్‌గా ఉండాలనుకుంటాను. నేను పెళ్లాడబోయే వ్యక్తి ఆలోచనలు కూడా నాలానే ఉండాలి. మా అభిప్రాయాలు కలవాలి. తనను చూడగానే మర్యాద ఇవ్వాలని నాకు అనిపించాలి. నేను ఒకరితో ప్రేమలో ఉన్నప్పుడు ఆ విషయం గురించి బాహాటంగా చెప్పేస్తాను. నేను ఫలానా వ్యక్తిని పెళ్లాడబోతున్నానని అందరికీ తెలియజేస్తాను' అని చెప్పుకొచ్చింది.

'అదో రూమర్'



బిగ్ బాస్ ను తెలుగులో ఆదరిస్తారా అన్న అనుమానాలకు మొదటి సీజన్లోనే సమాధానం దొరికింది. ఇక రెండో సీజన్లో హోస్ట్ నానికి ఇబ్బంది ఎదురైనా ఓవరాల్‌గా బిగ్ బాస్ మాత్రం సక్సెసే. ప్రస్తుతానికి వస్తే మూడో సీజన్ బిగ్ బాస్ గురించి.. బిగ్ బాస్ ను హోస్ట్ చేయబోయే స్టార్ గురించి ఇప్పటికే మీడియాలో చాలా వార్తలు వస్తున్నాయి. సీనియర్ స్టార్ హీరో విక్టరీ వెంకటేష్‌ను బిగ్ బాస్ ఆర్గనైజర్స్ సంప్రదించినట్టుగా ప్రచారం సాగుతోంది. మరి ఈ విషయంపై వెంకీ స్పందన ఏంటి? వెంకటేష్ - వరుణ్ తేజ్ హీరోలుగా నటించిన 'ఎఫ్ 2' రేపే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా వెంకీ ఇంటర్వ్యూలు ఇస్తూ బిజీ బిజీగా గడుపుతున్నాడు. ఒక ప్రమోషనల్ ఇంటర్వ్యూలో బిగ్ బాస్ 3 హోస్ట్ చేయడం గురించి వెంకీకి ప్రశ్న ఎదురైతే 'అదో రూమర్' అంటూ తోసిపుచ్చాడు. అంటే.. అసలు బిగ్ బాస్ ఆర్గనైజర్స్ దగ్గుబాటి హీరోను సంప్రదించడం అనేది స్పెక్యులేషన్ అయినా కావచ్చు. లేదా వెంకీనే హోస్ట్‌గా చేయడం ఇష్టంలేక.. రూమర్ అని తోసిపుచ్చి ఉండవచ్చు. ఏదేమైనా రెండో సీజన్లో వివాదాల దెబ్బకు తెలుగు హీరోలు బిగ్ బాస్ హోస్టింగ్ అంటేనే కాస్త వెనకాముందూ ఆలోచిస్తున్నారు. మరి జూనియర్ ఎన్టీఆర్.. నానిల తర్వాత ఎవరు హోస్ట్‌గా చేస్తారనేదాని పై టీవీ ప్రేక్షకులకు మహా ఆసక్తిగా ఉంది. ఇదిలా ఉంటే జూన్‌లో బిగ్ బాస్ మూడో సీజన్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయట.

చిరు, మహేష్‌లతో సినిమాల గురించి



మాస్ సినిమాల దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు డైరెక్టర్ బోయపాటి శ్రీను. మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ హీరోగా ఆయన రూపొందించిన వినయ విధేయ రామ సినిమా సంక్రాంతి సందర్భంగా ఈరోజు (శుక్రవారం) ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమా ప్రమోషన్ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో చిరంజీవి, మహేష్‌బాబుతో సినిమాల గురించి బోయాపాటి మాట్లాడారు. చిరంజీవి ప్రస్తుతం సైరా సినిమాతో బిజీగా ఉన్నారు. అది పూర్తయిన తర్వాత వివిధ జోనర్లలో వరుసగా సినిమాలు చేయాలని చిరంజీవి అనుకుంటున్నారు. ఎప్పుడు నా జోనర్ వస్తుందో అప్పుడు నేను చేస్తా. మహేష్ బాబుతో మాత్రం కొంచెం తొందరగా సెట్ అవ్వొచ్చు. అయితే అది ఎప్పుడనేది మాత్రం ఇప్పుడే చెప్పలేనని బోయపాటి చెప్పారు.



నిర్మానుష్యంగా రహదారులు

అసోంలో 12 గంటల బంద్

రహదారుల దిగ్బంధం.. స్తంభించిన రవాణా వ్యవస్థ

గువహటి : అసోంలో 12 గంటల బంద్ జరిగింది. ఆందోళనకారులు రహదారులను దిగ్బంధించారు. రోడ్లపై చెట్ల కొమ్మలను అడ్డంగా పెట్టి, టైర్లను కాల్చారు. దీంతో వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. రాష్ట్రంలో ఆరు జాతులకు షెడ్యూల్డ్ ట్రైబ్(ఎస్‌టీ) హోదా కోరుతూ రూపొందించిన ఒక బిల్లును వ్యతిరేకిస్తూ అసోం గిరిజన సంస్థలు(సీసీటీవోఏ) సమన్వయ కమిటీ ఈ బంద్‌కు పిలుపు ఇచ్చింది. బోడోల్యాండ్ పరిసర ప్రాంత జిల్లాలు కోక్రాజహర్, ఉదల్గురి, చిరాంగ్, బక్సా, బొంగైగోన్‌తోపాటు, గిరిజన ప్రాబల్య ప్రాంతాలైన మోరిగాన్, నౌగాప్, హోజై, దిమా హసో, కర్బి అంగ్లాగ్ జిల్లాల్లో 12 గంటల బంద్ జరిగింది. బంద్ మద్దతుదారులు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను అడ్డుకున్నట్లు పోలీసులు తెలిపారు. డొబోకా వద్ద ఎన్‌హెచ్-36పై ట్రక్కులు నిలిచిపోయాయి. ఇక దుకాణాలు, మార్కెట్లు, విద్యా సంస్థలు, బ్యాంకులు, ప్రైవేటు కార్యాలయాలు మూతపడ్డాయి. బంద్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజా రవాణా నిలిచిపోవడంతో ప్రభుత్వ కార్యాలయాలకు సిబ్బంది అంతంత మాత్రంగానే హాజరయ్యారు. అయితే రాష్ట్ర రాజధానిలో మాత్రం బంద్ ప్రభావం కనిపించలేదని పోలీసులు తెలిపారు. ఇదిలాఉండగా పౌరసత్వ సవరణ బిల్లుపై కూడా పెద్ద ఎత్తున నిరసనలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో అసోంలో భద్రతను కట్టుదిట్టం చేశారు.

గని కార్మికులను రక్షించేందుకు నావికాదళ ఆర్‌వోవీలు

న్యూఢిల్లీ : మేఘాలయలోని తూర్పు జయంతియా హిల్స్ జిల్లాలో అక్రమ బొగ్గు గని లోపల చిక్కుకున్న 15 మంది కార్మికులను రక్షించేందుకు ఐదు రిమోట్ ఆపరేటెడ్ వెహికల్స్(ఆర్‌వోవీలు)ను భారత నావికాదళం మోహరించిందని సుప్రీంకోర్టుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం తెలిపింది. డిసెంబరు 13న ఈ బొగ్గు గనిలోకి ప్రవేశించిన కార్మికులు ప్రమాదంలో చిక్కుకున్నారు. కాగా ఈ అక్రమ గని నుంచి ఇప్పటి వరకు కోటి లీటర్ల నీటిని బయటకు తోడినట్లు జస్టిస్ ఎ.కె.సిక్రీ, ఎస్.అబ్దుల్ నజీర్‌లతో కూడిన సుప్రీంకోర్టు బెంచ్‌కు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. అయితే గని సమీపంలో నది ప్రవాహాల కారణంగా సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతుందని వివరించింది. కాగా అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న వారిపై చర్యలు ఏమైనా తీసుకున్నారా అని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది నుంచి సుప్రీంకోర్టు ధర్మాసనం వివరణ కోరింది. దీనికి న్యాయవాది సమాధానమిస్తూ, ఈ ఘటన జరిగిన ప్రాంతంలోని అక్రమ గని నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు చెప్పారు. కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, సహాయక చర్యలకు సాధ్యమయ్యే చర్యలన్నింటినీ చేపడుతున్నట్లు కోర్టుకు తెలిపారు. ప్రమాద స్థలి వద్దకు అవసరమైన పరికరాలు, సిబ్బందిని తీసుకువెళ్లేందుకు భారత వైమానిక దళం విమానాలను, హెలికాప్టర్లను ఏర్పాటు చేసిందని తెలిపారు.

ఈ కేసు తదుపరి విచారణను జనవరి 18వ తేదీకి బెంచ్ వాయిదా వేసింది. అక్రమ గనిలో కార్మికులను రక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ ఆదిత్య ప్రసాద్ సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)ను దాఖలు చేశారు. మేఘాలయ ప్రభుత్వం సహాయక చర్యలపై స్థితి నివేదికను కోర్టులో దాఖలు చేసింది. అయితే గని ప్రాంతానికి సంబంధించి బ్లూ ప్రింట్ లేదని పేర్కొంది. ఈ గని అత్యంత క్లిష్టమైన ప్రాంతంలో ఉన్నందున సహాయక చర్యలు నిర్వహించడం కష్టసాధ్యంగా మారినట్లు వివరించింది. ఇక్కడ ప్రజా సేవలు, మౌలిక సదుపాయాలు, అవసరమైన సామగ్రి సులభంగా అందుబాటులో లేదని తెలిపింది.

2021 డిసెంబరులో 'గగన్‌యాన్'

- మానవసహిత అంతరిక్ష మిషన్
- ముగ్గురు వ్యోమగాముల్లో మహిళ కూడా..
- ఇస్రో చైర్మన్ శివన్



బెంగళూరు : మానవసహిత అంతరిక్ష యానం 'గగన్‌యాన్'కు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) సన్నద్ధమవుతోంది. 2021 డిసెంబరు నాటికి భారతీయ వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ఇస్రో చైర్మన్ కె.శివన్ శుక్రవారం వెల్లడించారు. ఇందులో ఒక మహిళ వ్యోమగామి ఉండే అవకాశం ఉందన్నారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ గగన్‌యాన్ ప్రాజెక్టుపై ప్రకటన చేసిన నేపథ్యంలో ముగ్గురు సిబ్బందితో మానవ ప్రయాణానికి ఇస్రో ఒక కొత్త కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. '2019వ సంవత్సరం గగన్‌యాన్‌కు ప్రత్యేకం. 2020 డిసెంబరులో తొలి మానవసహిత మిషన్‌కు ప్రణాళిక చేస్తున్నాం. 2021 జూలైకి ఆ పని పూర్తి చేస్తాం. ఆ లక్ష్య సాధన దిశగా బృందం ముందుకు సాగుతుంది' అని శివన్ చెప్పారు. ఇటీవల ఈ కార్యక్రమానికి రూ.9,023 కోట్ల నిధుల మంజూరుకు కేంద్ర కేబినెట్ ఆమోదించింది. ఇక్కడ ఇస్రో ప్రధాన కార్యాలయంలో శివన మాట్లాడుతూ ఇస్రో ఇటీవల సాధించిన విజయాలు, భవిష్యత్తు కార్యక్రమాలను విలేకరులకు వివరించారు.

గత ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోడీ ఇస్రో తన సొంత సామర్థ్యాలతో 2022 నాటికి మానవ సహిత అంతరిక్ష మిషన్‌ను చేపడుతుందని ప్రకటించారు. ఒక ప్రశ్నకు సమాధానంగా ఇస్రో చైర్మన్ మాట్లాడుతూ 'ఈ మానవ సహిత అంతరిక్ష మిషన్‌లో మహిళా వ్యోమగాములు కూడా ఉండాలని కోరుకుంటున్నాం. అది మా లక్ష్యం. పురుషులు, మహిళలు ఇద్దరికీ శిక్షణ ఇవ్వాలన్నది నా అభిప్రాయం' అని తెలిపారు. ముగ్గురు వ్యోమగాములను వారం పాటు అంతరిక్షంలోకి పంపనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం రష్యా ఫ్రాన్స్‌లతో భారత్ ఒప్పందం కుదుర్చుకుంది. గగన్‌యాన్ ప్రారంభానికి ప్రధాన విస్తరణ జరిగిందన్నారు. 'గగన్‌యాన్‌కు - ఇంజినీరింగ్, మానవులు అనే రెండు కోణాలున్నాయి. అంతరిక్షంలో మనిషిని పంపడం మాత్రమే కాదు. ఇది ప్రధాన విస్తరణ. మానవ సహిత మిషన్ ఒక గొప్ప మలుపు' అని శివన్ అన్నారు. ముగ్గురుతో కూడిన సిబ్బందిని తక్కువ భూమి కక్ష్యకు తీసుకువెళ్లడం, అలాగే వారిని తిరిగి భూమికి సురక్షితంగా తీసుకురావడం ఈ మిషన్ లక్ష్యమన్నారు. ఈ మానవ సహిత అంతరిక్ష మిషన్ కేంద్రానికి సీనియర్ శాస్త్రవేత్త ఉన్నికృష్ణన్ నాయర్ డైరెక్టరుగా వ్యవహరిస్తారు. ప్రాజెక్టు డైరెక్టరుగా డాక్టర్ ఆర్ హట్టన్ ఉంటారని ఇస్రో చైర్మన్ వివరించారు. ఇక భారత వైమానిక దళం నుంచి ఒకరితో సహా భారత్ నుంచి గగన్‌యాన్‌కు సిబ్బంది ఉంటారన్నారు. గగన్‌యాన్ ప్రారంభ శిక్షణ దేశంలోనే ఉంటుంది. మరింత ఆధునిక శిక్షణ విదేశాల్లో, బహుశా రష్యాలో ఉండవచ్చని చెప్పారు. గగన్‌యాన్ ద్వారా వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపితే.. స్వతంత్రంగా మనుషులను అంతరిక్షంలోకి పంపిన నాలుగో దేశంగా భారత్ ఘనత దక్కించుకోనుంది.

ఏప్రిల్‌లో చంద్రయాన్-2

ఈ ఏడాది ఏప్రిల్‌లో చంద్రుడిపైకి 'చంద్రయాన్-2'ను పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని శివన్ వెల్లడించారు. కాగా ఇస్రో తొలుత 'చంద్రయాన్-2'ను జనవరి నుంచి ఫిబ్రవరి 16 మధ్యలో చేపడతామని తెలిపింది. అయితే కొన్ని పరీక్షలు పూర్తికాకపోవడం వల్ల తేదీని మార్చారు. మార్చి 25 నుంచి ఏప్రిల్ చివరి నాటికి ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు సిద్ధమవుతున్నామని శుక్రవారం శివన్ తెలిపారు. పదేళ్ల క్రితం పంపిన చంద్రయాన్-1కు ఇది ఆధునిక శ్రేణి. రూ.800 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు చేపట్టారు.

'చార్‌ధామ్' ప్రాజెక్టులకు సుప్రీం ఓకే



న్యూఢిల్లీ : చార్‌ధామ్ అభివృద్ధి ప్రణాళిక కింద కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టుల పనులను కొనసాగించేందుకు సుప్రీంకోర్టు అనుమతినిచ్చింది. అయితే పలు ప్రాజెక్టుల పనులపై ఉన్న స్టే మాత్రం తదుపరి ఆదేశాలు జారీ అయ్యేంత వరకు కొనసాగుతుందని తెలిపింది. జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఆదేశాలపై స్టేను కోరుతూ దాఖలైన ఫిర్యాదును జస్టిస్ ఆర్‌ఎఫ్ నారిమన్, జస్టిస్ వినీత్ సరన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం విచారించింది. దీనిపై అఫిడవిట్ సమర్పించాలని కేంద్రప్రభుత్వాన్ని ఆదేశించింది. పవిత్రక్షేత్రాలైన యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్, బద్రినాథ్‌లకు అన్ని వాతావరణ పరిస్థితుల్లో రోడ్ కనెక్టివిటీ ఉండేలా చూడటమే చార్‌ధామ్ ప్రాజెక్టు ముఖ్యఉద్దేశం. ఈ ప్రాజెక్టు వల్ల పర్యావరణానికి తీరని నష్టం జరుగుతుందని, 10 హైడ్రో పవర్ ప్రాజెక్టుల వల్ల జరిగేంత నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పిటిషనర్ ఎన్జీవో సిటిజన్స్ ఫర్ గ్రీన్‌దూన్ తరపు న్యాయవాది సంజయ్ పారేఖ్ వాదించారు. పర్యావరణ అంశాలను నిర్లక్ష్యం చేస్తే 2013లో కేదార్‌నాథ్‌ను వరదలు ముంచెత్తి నట్లు విధ్వంసం జరగవచ్చునన్నారు. ఈ ప్రాజెక్టు కింద పనులు చట్టవ్యతిరేకంగా జరుగుతున్నాయని, పర్యావరణ అనుమతులు లేకుండా సాగుతున్నాయని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తదుపరి ఆదేశాలు జారీ అయ్యేంత వరకు స్టే విధించబడిన పనులను చేపట్టేందుకు వీల్లేదంటూ కేంద్రానికి సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. అలాగే, ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణాలను కొనసాగించవచ్చునని పేర్కొంది.

స్వల్పంగా పెరిగిన పెట్రోలు, డీజిల్



న్యూఢిల్లీ : చాలా రోజుల తర్వాత పెట్రోలు, డీజిల్ రేట్లు స్వల్పంగా పెరిగాయి. ఇన్‌పుట్ వ్యయం పెరగడంతో పెట్రోలు19 పైసలు, డీజిల్ 28 పైసలు పెరిగినట్లు కేంద్రం తెలిపింది. దీంతో ఢిల్లీలో లీటరు పెట్రోలు రేటు రూ.69.07కు పెరిగింది. గురువారం వరకు రూ.68.88లు, డీజిల్ లీటరు రూ.62.53 గా ఉన్నాయి. ముంబైలో పెట్రోలు లీటరు 74.72,డీజిల్ 62.53కు పెరిగాయి. రాష్ట్రాల్లోని పన్నులను బట్టి దీని రేటు మారుతుంది. జనవరి 7న పెట్రోలుపై 21, డీజిల్‌పై 8 పైసలు పెరిగింది. అయితే 8,9ల్లో పెట్రోలు రేట్లు పెరగలేదు. గతేడాది ఆగస్టు 15నాటికి ముంబైలో పెట్రోలు 84.58 ఢిల్లీలో రూ.77.14గా ఉంది. ఆగస్టు 16 తర్వాత డీజిల్ పెట్రోలు రేట్లు అంతకంతకు పెరిగి, ముంబైలో రూ. 91.34,ఢిల్లీలో రూ.84కి ఎగబాకగా, అక్టోబరు 18 నుంచి పెట్రోల లీటరు రేటు 68.29, డీజిల్ రూ. 62.29గా ఉంది. ఆగస్టు 16 నుంచి అక్టోబరు 4 మధ్య పెట్రోలు రూ.6.86 పెరిగింది. ఆపై పెట్రోలు రూ.14.54, డీజిల్‌పై రూ.13.53 తగ్గింది. అంతర్జాతీయంగా పెట్రోలు రేట్లు పెరగడంతో అక్టోబరు 17నాటికి ఢిల్లీలో వాటి రేట్లు రూ. 82.83, రూ.75.69గా పెరిగాయి. అయితే చమురు ధరలు తగ్గడంతో పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గుముఖం పట్టాయి.

అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం



శ్రీనగర్ : అసెంబ్లీ ఎన్నికలకు పరిపాలనా విభాగం సంసిద్ధంగా ఉందని జమ్మూకాశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ వెల్లడించారు. స్థానిక ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచులకు నిర్వహించిన ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన పైవిధంగా తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసినందున ఐఏఎస్ అధికారి షా ఫజల్ రాజీనామాపై స్పందించలేనని గవర్నర్ స్పష్టం చేశారు. రాష్ట్రానికి ఆరునెలల్లో ఎన్నికలు జరుపుతామని నవంబరులో ఎన్నికల కమిషన్ తెలిపింది. లోక్‌సభ ఎన్నికలకు ముందే ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నట్లు సీఈవో ఓపీ రావత్ వెల్లడించారు. మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ వీలయినంత తొందరలో ఎన్నికలు నిర్వహించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికలు త్వరగా జరగకుండా కొంతమంది నాయకులు, బ్యూరోక్రాట్లు అడ్డుపడుతున్నారన్నారు.

పిల్లల సమస్యలు పట్టవా..?

- రాజ్యసభలో చర్చకు రాని మానవ అక్రమ రవాణా బిల్లు
- రాజకీయ వర్గాలపై సత్యార్థి అసంతృప్తి



న్యూఢిల్లీ : పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో భాగంగా రాజ్యసభలో మానవ అక్రమ రవాణా బిల్లుపై చర్చ జరగకపోవడంపై నోబెల్‌గ్రహీత కైలాష్ సత్యార్థి అసంతృప్తి వ్యక్తంచేశారు. రాజకీయ వర్గాలకు, ప్రజా ప్రతినిధులకు పిల్లల సమస్యలు పట్టవా అంటూ ప్రశ్నించారు. పశువుల కన్నా తక్కువ ధరకు విక్రయించబడుతున్న చిన్నారులకు న్యాయం చేయడంలో రాజకీయ వర్గాలు విఫమయ్యాయని ఆయనన్నారు. రాజకీయంగా బాలలకు ప్రాముఖ్యత దక్కకపోవడం బాధాకరమని, దేశంలోని లక్షలాది మంది పిల్లలకు అన్యాయం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. బాలల భద్రత, విద్య, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించేందుకు కనీసం ఒక్క రోజైనా కేటాయించే విధంగా అన్ని పార్టీలు కలిసివస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఎన్జీవో బచ్‌పన్ బచావో ఆందోళన్ జారీచేసిన ప్రకటన ప్రకారం రాజ్యాసభలో మానవ అక్రమ రవాణా బిల్లు చర్చకు రాకపోవడంపై సత్యార్థి తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేసినట్టు తెలుస్తోంది. 'సురక్షిత బాల్యం, సురక్షిత భారతం' అనే అంశంపై లాల్‌బహదూర్ శాస్త్రి 25వ స్మారక ఉపన్యాసం చేసిన ఆయన రాజకీయ వర్గాల తీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేశారు. 'భారత రాజకీయ వర్గం మరోసారి లక్షలాది మంది బాల బాలికలకు న్యాయం చేయడంలో విఫలమైంది. పశువుల కన్నా తక్కువ ధరకు పిల్లలు విక్రయించబడుతున్నారు. ఈసారి రాజ్యసభలో మానవ అక్రమ రవాణా బిల్లుపై చర్చ జరుగుతుందని, తమకు న్యాయం లభిస్తుందని ఆశించిన బాధితులకు నిరాశే మిగిలింది. నినాదాలు చేయడం, వాక్చాతుర్యాన్ని ప్రదర్శించడం ద్వారా న్యాయం జరిగిపోదు.. సమాజంలో మార్పు సంభవించదు. ప్రజాస్వామ్య ఆలయంగా భావించే పార్లమెంటు.. రాజకీయ, ఎన్నికల ప్రయోజనాలకు వేదికగా మారిపోయింది. బాల్యాన్ని చిదిమేస్తున్న సమస్యలు మన ప్రజాప్రతినిధులకు పట్టడంలేదు' అంటూ సత్యార్థి భావోద్వేకంగా మాట్లాడారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలలో భాగంగా రాజ్యసభలో మానవుల అక్రమ రవాణా (నివారణ, రక్షణ, పునరావాసం) బిల్లు, 2018పై చర్చ జరగాల్సి ఉండగా అది జరగలేదు. ఆ బిల్లుకు సభ ఆమోదమూ లభించలేదు. గతేడాది జూలైలో జరిగిన వర్షాకాల సమావేశాల్లో భాగంగా ఈ బిల్లును లోక్‌సభ ఆమోదించిన విషయం తెలిసిందే.



ఒప్పందంపై సంతకాలు చేసిన సీఎంలు

నీటి సమర్ధ నిర్వహణే కీలకం : గడ్కరీ

న్యూఢిల్లీ : భారత్‌లో సరిపడ నీరు ఉంది.. ఈ విలువైన నీటివనరులను సమర్థవంతంగా నిర్వహించుకోవడమే ప్రధాన అంశమని నీటివనరులు, నదులాభివృద్ధి మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. శుక్రవారం రేణుకాజీ డ్యామ్ ప్రాజెక్టుపై కుదిరిన అవగాహన ఒప్పందం (ఎంఓయూ)పై సంతకాలు చేయడాన్ని చారిత్రక ఘట్టంగా ఆయన అభివర్ణించారు. దీనికి సాధ్యమైనంత త్వరగా కేంద్ర కేబినెట్ ఆమోదం లభించేలా ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. ఎగువ యమునా బేసిన్‌లోని అన్నింటికి ఉపయోగపడేలా రేణుకాజీ డ్యామ్ నిర్మాణానికి సంబంధించిన ఈ ఒప్పందంపై గడ్కరీతో పాటు ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, హర్యానా, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు సంతకాలు చేశారు. 'వన్ సిటీ వన్ ఆపరేటర్' ఉద్దేశంతో అలహాబాద్‌లో హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ కింద నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా; యూపీ జల్ నిగమ్, ప్రయాగ్‌రాజ్ వాటర్ లిమిటెడ్ మధ్య నమమీ గంగే ప్రాజెక్టులకు సంబంధించిన ఒప్పందంపైనా సంతకాలు జరిగాయి. గడ్కరీ మాట్లాడుతూ 'దేశంలో సరిపడ నీటివనరులు ఉన్నాయి. అయితే, వాటి సమర్థ నిర్వహణ కీలకం. ఇండస్ నీటి ఒప్పందం కింద భారత్‌కు కేటాయించిన వాటా ఇప్పటికీ పాకిస్థాన్‌కు వెళుతోంది. మిగులు జలాలను నిల్వచేసి వాటిని పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీకి మళ్లిస్తే ఆయా రాష్ట్రాలకు ప్రయోజనం చేకూరుతుంది' అని అన్నారు. యమునా నదిపై కిషౌ ప్రాజెక్టుకు సంబంధించిన ఒప్పందంపై త్వరలోనే సంతకాలు జరుగుతాయని తెలిపారు. 2018, ఆగస్టు 28న లఖ్వార్ ప్రాజెక్టు నిర్మాణానికి ఒప్పందం కుదిరిందని గుర్తుచే శారు. ఈ ప్రాజెక్టులతో నదీపరివాహక ప్రాంతాలకు లబ్ధి చేకూరుతుందని, ఆయా రాష్ట్రాలన్నింటికి లాభదా యకంగా ఉంటుందని గడ్కరీ అన్నారు. వచ్చే 50 ఏళ్ల వరకు ఢిల్లీలో నీటి సమస్యలు ఉండబోవని, రాజస్థాన్‌కూ తాగు, సాగునీరు అందుతుందన్నారు. రేణుకాజీ ప్రాజెక్టు ద్వారా 40మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, దాని నిర్వహణ హిమాచల్‌ప్రదేశ్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీపీసీఎల్) చూసుకుంటుందని గడ్కరీ తెలిపారు. డ్యామ్ నీటినిల్వ నుంచి హత్‌నీ కుండ్ బ్యారేజి, వజిరా బాద్ బ్యారేజి, ఓఖ్లా బ్యారేజి ద్వారా యూపీ, హర్యానా, ఢిల్లీ రాష్ట్రాలకు నీరు అందుతుందన్నారు.


నీటివాటా వివరాలు : హర్యానా, ఉత్తరప్రదేశ్ / ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాలకు 47.82శాతం, 33.65శాతం, 3.15శాతం, 9.34శాతం, 6.04శాతం చొప్పున లభించనుంది.

యూపీలో కాంగ్రెస్ ఒంటరి పోరు



లక్నో : ఉత్తరప్రదేశ్ ఎన్నికల బరిలో కాంగ్రెస్ ఒంటరిగా దిగాలని నిశ్చయించుకుంది. సమాజ్‌వాదీపార్టీ (ఎస్పీ), బహుజన సమాజ్‌వాదీ పార్టీ (బీఎస్పీ)లు కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు ఆరెండు పార్టీల అధినేతలు అఖిలేష్ యాదవ్,మాయావతి సంయుక్తంగా ప్రకటించడంతో కాంగ్రెస్ ఈ నిర్ణయానికి వచ్చింది. కాంగ్రెస్‌కు ఇప్పటికే 45 సీట్లు లోక్‌సభలో ఉన్నాయని మీడియా కోఆర్డినేటర్ రాజీవ్ బక్షీ తెలిపారు.భావసారూప్యత కలిగిన పార్టీలతో కలసి ముందుకెళతామన్నారు. పార్టీలో అంతర్గత విభేదాలు ఉన్నా వాటిని పరిష్కరించుకొని ముందుకెళతామన్నారు కాంగ్రెస్‌ను తక్కువ అంచనావేయొద్దని రాహుల్ వెల్లడించడాన్ని మరో సీనియర్ నేత గుర్తు చేశారు. యూపీ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజ్‌బబ్బర్‌ను త్వరలో రాహుల్ కలసి కమిటీని ఏర్పాటు చేస్తారని ఆరాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి గులాంనబీ ఆజాద్ వెల్లడించారు.

నళినీ చిదంబరంపై చార్జిషీట్



కోల్‌కతా : శారదా చిట్‌ఫండ్ కుంభకోణానికి సంబంధించి మనీల్యాండరింగ్ విచారణలో మాజీ కేంద్ర మంత్రి పి. చిదంబరం భార్య నళినీనిపై సీబీఐ శుక్రవారం చార్జిషీట్‌ను నమోదు చేసింది. కోల్‌కతాలోని బరాసత్ కోర్టులో ఈ చార్జిషీట్‌ను సమర్పించింది. నళినీ చిదంబరం రూ 1.4 కోట్లు ముడుపులు స్వీకరించినట్టు ఆరోపించింది. శారదా గ్రూప్ యజమాని, ప్రమోటర్ సుదీప్త సేన్‌తో కుమ్మక్కైన నళిని మోసపూరిత కుట్ర, నిధుల దుర్వినియోగానికి పాల్పడుతూ 2010-14 మధ్య రూ 1.4 కోట్లు చేజిక్కించుకున్నారని సీబీఐ పేర్కొంది. సెబీ, ఆర్‌ఓసీ విచారణల నిర్వహణకుగాను 2010-12 మధ్య సేన్ కంపెనీల నుంచి ఆమె రూ 1.4 కోట్లు రాబట్టారని వెల్లడించింది. శారదా చిట్ ఫండ్ స్కామ్‌లో నళినిని తొలుత 2016 సెప్టెంబరులో సాక్షిగా దర్యాప్తుసంస్థలు పిలిచాయి. ఓ టీవీ చానల్ డీల్‌కు సంబంధించి కోర్టుకు హాజరైనందుకు శారదా గ్రూప్ తరపున వాదనలు వినిపించినందుకు ఆమె రూ 1.26 కోట్లు ఫీజుగా వసూలు చేశారు. శారదా స్కామ్‌లో దాఖలైన ఆరవ అనుబంధ చార్జిషీటులో నళినీ చిదంబరంతో పాటు అనుభూతి ప్రింటర్స్ అండ్ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, సుదీప్త సేన్‌లను సహ నిందితులుగా సీబీఐ పేర్కొంది.

సీబీఐ వర్సెస్ సీబీఐ

రాకేష్ ఆస్థానాకు ఎదురుదెబ్బ

- ఎఫ్ఐఆర్ రద్దుకు ఢిల్లీ హైకోర్టు తిరస్కృతి
- గత మధ్యంతర ఉత్తర్వులు రద్దు
- 10 వారాల్లో దర్యాప్తు పూర్తినకు ఆదేశం

న్యూఢిల్లీ : సీబీఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేష్ ఆస్థానాకు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అవినీతి ఆరోపణల వ్యవహారంలో తనపై కేసును కొట్టివేయాలంటూ ఆస్థానా వేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టేసింది. ఈ కేసులో దర్యాప్తు జరపాల్సిందేనని సీబీఐని ఆదేశించింది. అంతేకాకుండా ఆస్థానాపై క్రిమినల్ దర్యాప్తు చేపట్టకుండా గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను కూడా న్యాయస్థానం రద్దు చేసింది. దీంతో ఈ కేసులో ఆస్థానాను అరెస్టు చేసే అవకాశముంది. ఈ కేసులో సీబీఐ డిప్యూటీ సూపరింటెండెంట్ దేవేంద్ర కుమార్, మధ్యవర్తిగా ఆరోపించబడుతున్న మనోజ్ ప్రసాద్‌లపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల రద్దుకు కూడా న్యాయమూర్తి నజీవ్ వజీర్ తిరస్కరించారు. కేసు వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవడానికి కుమార్ అవసరం లేదని, ఆస్థానాను విచారించేందుకు ముందస్తు అనుమతిని మంజూరు చేస్తున్నట్లు న్యాయమూర్తి చెప్పారు. 10 వారాల్లోగా ఆస్థానా, ఇతరులపై కేసులో దర్యాప్తును పూర్తి చేయాలని సీబీఐని హైకోర్టు ఆదేశించింది. అలోక్ వర్మపై నేరారోపణ వివరాలు వెల్లడి కాలేదని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. అలోక్ వర్మ, ఆస్థానాల మధ్య అనేక నెలలపాటు విభేదాలు కొనసాగాయి. ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు చేసుకున్నారు. కాగా తమపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని సవాలు చేస్తూ ఆస్థానా, కుమార్, ప్రసాద్‌లు దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు తోసిపుచ్చింది. ఆస్థానాపై అవినీతి నిరోధక చట్టం సెక్షన్ల క్రింద నేరపూరిత దుష్ప్రవర్తన, నేరపూరిత కుట్ర, అవినీతి అభియోగాలు నమోదయ్యాయి. మాంసం ఎగుమతిదారు మొయిన్ ఖురేషీ కేసులో తనను తప్పించేందుకు ఓ మధ్యవర్తి ద్వారా రాకేష్ ఆస్థానాకు తాను లంచం ఇచ్చినట్లు హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త సతీశ్ బాబు చెప్పడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.



ఆస్థానాపై అవినీతి, బెదిరింపు, తీవ్రమైన దుష్ప్రవర్తన ఆరోపణలను సతీష్ బాబు చేశారు. ఈ కేసులో జాయింట్ డైరెక్టర్ ఏకే శర్మ, వర్మ, కుమార్, ఆస్థానా, కేంద్రం, సీబీఐ తరఫు న్యాయవాదుల వాదనలు విన్న తర్వాత వేర్వేరు పిటిషన్లపై 2018, డిసెంబరు 20న న్యాయమూర్తి వజీర్ తీర్పును రిజర్వు చేశారు. అక్టోబరు 22న అరెస్టయిన కుమార్‌కు అక్టోబరు 31న బెయిల్ మంజూరు చేశారు. సతీష్ ప్రకటన రికార్డులో ఫోర్జరీ ఆరోపణలపై ఈ కేసులో తొలుత విచారణాధికారిగా ఉన్న కుమార్‌ను అరెస్టు చేశారు. అయితే 2018, అక్టోబరు 17న ప్రసాద్ అరెస్టు కాగా, డిసెంబరు 18న బెయిల్ మంజూరయ్యింది. ఈ కేసుకు సంబంధించి సీబీఐ తప్పనిసరిగా 60 రోజుల్లో ఛార్జిషీటు సమర్పించలేకపోయింది. సీబీఐతోపాటు ప్రసాద్, కుమార్, ఆస్థానాలకు వ్యతిరేకంగా తగిన ఆధారాలు, సాక్ష్యాలు ఉన్నాయని వర్మ ఒక అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ప్రాథమిక దర్యాప్తులో నేరాలు వెల్లడయిన తర్వాత ఎఫ్ఐఆర్ నమోదయ్యింది. ఆస్థానా పిటిషన్ తప్పుగా, అపరిపక్వంగా ఉందని, ఈ విషయంలో దర్యాప్తు ఆరంభ దశలోనే ఉందని ఆయన పేర్కొన్నారు. ఇదిలాఉండగా ఈనెల 8న అలోక్ వర్మ పునఃనియామకానికి ఆదేశించినప్పటికీ, ఎటువంటి ప్రధాన విధాన నిర్ణయం తీసుకోవద్దని ఆయనను సుప్రీంకోర్టు ఆదేశించింది. తన అధికారాల న్నింటినీ కేంద్రం రద్దు చేయడాన్ని సుప్రీంకోర్టులో వర్మ సవాలు చేశారు. ఆస్థానాతో విభేదాల నేపథ్యంలో అలోక్ వర్మను సెలవుపై పంపారు. వర్మ అధికారాలను ఉపసంహరించడంలో కేంద్రం సరైన నిబంధనలు పాటించ లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఒక వారంలోగా సీవీసీ నివేదిక ఆధారంగా వర్మపై ఆరోపణలను పరిశీలించాలని సీబీఐ డైరెక్టరును ఎంపిక చేసే అత్యున్నత కమిటీని అత్యున్నత న్యాయస్థానం కోరింది. జనవరి 31న పదవీ విరమణ చేయనున్న వర్మ గురువారం సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి తొలగించబడ్డారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున ఖర్గే, జస్టిస్ ఏకే సిక్రీలతో కూడిన ఒక హైపవర్ కమిటీ 2:1 నిష్పత్తితో వర్మను పదవి నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. జస్టిస్ సిక్రీని భారత ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ నామినేట్ చేశారు. ఈనెల 8న తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు బెంచ్‌లో భాగంగా ఉన్న సీజేఐ, సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎ.కె.సిక్రీని నామినేట్ చేయడం ద్వారా కమిటీ నుంచి తాను వైదొలిగాడు. ఈనెల 9-10 తేదీల్లో హైపవర్ కమిటీ సమావేశం అయ్యింది. ఇదిలాఉండగా, అగ్నిమాపక దళ సేవలు, పౌర రక్షణ, హోం గార్డుల డైరెక్టర్ జనరల్‌గా గురువారం బదిలీ అయిన వర్మ శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు.

బీజేపీ జాతీయ సమావేశాలు ప్రారంభం

న్యూఢిల్లీ : సామాజిక న్యాయం కోసం మోడీ ప్రభుత్వం తలపెట్టిన రెండు రోజుల జాతీయ సమావేశాలను ఆపార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా శుక్రవారం ప్రారంభించారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దళితులు, ఇతర వెనుకబడిన వర్గాల కోసం బీజేపీ ఈ సమావేశాన్ని రూపొందించింది. ఈ జాతీయ సమావేశాల్లో 12 వేల మంది పాల్గొంటారని అంచనా.. శనివారం జరిగే ముగింపు సభలో ప్రధాని మోడీ పాల్గొంటారు. సమావేశాల్లో ఆర్థిక,సామాజిక,రాజకీయ న్యాయం కోసం మూడు తీర్మానాలను ప్రవేశపెడతారని తెలుస్తోంది. రామాలయం నిర్మాణ విషయంపై సీనియర్లు, ఆర్‌ఎస్‌ఎస్ వంటి హిందూత్వ సంస్థలు పెదవి విప్పడం లేదు. అగ్రకులాల పేదలకు విద్యా, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా బీజేపీ ఎన్నికల్లో ప్రణాళికా బద్దంగా ముందుకెళుతోంది. మోడీ ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేకూర్చుతారని పార్టీ వర్గాలు వెల్లడించారు.

మా కుటుంబంలో చిచ్చుపెట్టే కుట్ర

రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి భూమా అఖిలప్రియ

విశాలాంధ్ర - ఆళ్ళగడ్డ : మా కుటుంబ సభ్యుల మధ్య చిచ్చుపెట్టేందుకే అసత్య ప్రచారం సాగుతోందని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి భూమా అఖిలప్రియ పేర్కొన్నారు. కర్నూలుజిల్లా రుద్రవరంలో జన్మభూమి కార్యక్రమం అనంతరం విలేఖరుల సమావేశంలో అఖిలప్రియ మాట్లాడుతూ సడన్‌గా నేను పార్టీ మారుతున్నారని వార్తలు ఎందుకు వస్తున్నాయో అర్థం కావడంలేదన్నారు. ఇష్యూ జరిగింది ఒకదాని గురించి, నేను ఫైట్ చేసేది ఒకదాని గురించి, ముఖ్యమంత్రి మీదగానీ, పార్టీమీద గానీ నేను అలగలేదు. ఏదైతే చెకింగ్‌లు జరిగాయో అవి ఒక పద్ధతి ప్రకారం జరగలేదన్నారు. ఈ విషయం ఎస్పీతో మాట్లాడామన్నారు. జిల్లాకు ఏ ఎస్పీ వచ్చినా తప్పుడు సమాచారం ఇస్తున్నారని, అది ఎవరు ఇస్తున్నా రన్న విషయం అర్థం కావడంలేదన్నారు. ఆ విషయం గురించి పార్టీకానీ, పోలీస్ శాఖ, ప్రభుత్వం కానీ లోతుగా విచారణ చేయకపోతే నష్టపోయేది మేమే. ఆ విష యంపై పోట్లాడుతున్నామే తప్ప, పార్టీలో అన్యాయం జరుగుతుందని కానీ ముఖ్యమంత్రి అన్యాయం చేశారని కానీ పార్టీలో మర్యాదలేదనో నేను ఎక్కడా అనలేదన్నారు.

భార్యను హత్యచేసి భర్త ఆత్మహత్య



విశాలాంధ్ర - ఉరవకొండ : అనంతపురము జిల్లా ఉరవకొండ మండలం వ్యాసాపురం గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మారెన్న తన భార్య విశాలక్ష్మిని శుక్రవారం తెల్లవారుజామున గొడ్డలితో అతి దారుణంగా హత్యచేశాడు. అనంతరం ఇంటి సమీపంలోని వేపచెట్టుకు ఉరి వేసుకుని మారెన్న కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం గురువారం రాత్రి మారెన్న, విశాలక్ష్మి దంపతులు తీవ్ర స్థాయిలో గొడవపడ్డారు. అనంతరం విశాలక్ష్మి(38) నిద్రిస్తున్న సమయంలో ఇంట్లోని గొడ్డలితో తల, మెడపై నరికి చంపాడు. తర్వాత మారెన్న(42) కూడా సమీపంలోని వేపచెట్టు వద్దకు వెళ్లి ఉరివేసుకున్నాడు. ఈ హత్య, ఆత్మహత్యపై ఉరవకొండ పోలీసులు విచారణ చేపట్టారు. ఈ దంపతులకు వంశీ(5), హేమాంజలి(1) పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రులు మృతి చెందడంతో అనాథలుగా మారారు.

యువకుడ్ని బలిగొన్న కిడ్నీ మహమ్మారి



విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : శ్రీకాకుళం జిల్లా ఉద్దాన ప్రాంతంలోని బైపల్లి గ్రామంలో ఓ యువకుడ్ని కిడ్నీ మహమ్మారి బలితీసుకుంది. బైపల్లి గ్రామ యువకుడు తామాడ రాజు(30) గురువారం రాత్రి కిడ్నీవ్యాధితో మృతిచెందాడు. మూడేళ్ళ క్రితం అన్నపూర్ణతో రాజుకు వివాహమైంది. ఏడాది వయస్సున్న కుమారుడు, తల్లిదండ్రులు ఉన్నారు. ట్యాక్సీ ఆధారంగా జీవనం సాగిస్తున్న రాజుకు ఈ వ్యాధి చుట్టుముట్టినట్టు ఆరు నెలల క్రితమే తెలిసింది. వైద్యానికి డబ్బు లేకపోవడంతో జీవనోపాధికి ఆధారమైన ట్యాక్సీ అమ్మేసే పరిస్థితి వచ్చిందని కుటుంబీకులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షులు శిరీష, ఎంపీటీసీ అమర నీలకంఠం, చంద్రశేఖర్‌లు పరామర్శించారు. ప్రభుత్వ సహాయం వచ్చేలా కృషి చేస్తామన్నారు.

రోడ్ల విస్తరణకు రూ.6,500 కోట్లు!

- న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు రుణానికి ఆర్అండ్‌బీ ప్రతిపాదనలు
- ఆరు ప్యాకేజీల కింద రోడ్లు, బ్రిడ్జిల అభివృద్ధిపై కన్సల్టెంట్లకు బాధ్యతలు

విశాలాంధ్ర - విశాఖ సిటీబ్యూరో : రాష్ట్రంలో రహదారులు, బ్రిడ్జిల విస్తరణకు న్యూడెవలప్‌మెంట్ బ్యాంకు (ఎన్డీబీ) రుణం కోసం ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందించింది. ఏపీ మండల కనెక్టివిటీ, రూరల్ కనెక్టివిటీ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టు (ఏపీఎంసీఆర్‌సీఐపీ) కింద 13 జిల్లాల్లో 3,011 కిలోమీటర్ల రోడ్లు, 432 వంతెనల విస్తరణకు రూ.6,500 కోట్లతో ప్రణాళిక తయారుచేశారు. ఆరు ప్యాకేజీల కింద జిల్లాలను విభజించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీకి కన్సల్టెన్సీ కోసం టెండర్లు ఆహ్వానించిన సంగతి తెలిసిందే. డిసెంబర్ నెలాఖరు నాటికి చైనా షాంఘైలోని న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకుకు డీపీఆర్ పంపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

రోడ్ల స్థాయి తగ్గింపుతో రుణానికి అడ్డంకులు

రాష్ట్ర ప్రభుత్వం 15 వేల కిలోమీటర్ల రోడ్లను జిల్లా ప్రధాన రహదారులుగా (ఎండీఆర్‌లుగా) మార్చేసింది. రోడ్ల స్థాయి తగ్గిస్తే కేంద్రం ద్వారా ప్రపంచ బ్యాంకు నిధులు అందటం కష్టమేనని ఆర్అండ్‌బీ వర్గాలు అప్పట్లో ఆందోళన వ్యక్తం చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం అనాలోచితంగా తాత్కాలిక ఆదాయం కోసం రోడ్ల అభివృద్ధిని అడ్డుకుందని, రోడ్డు రవాణా ఉత్పాదకత కోల్పోయేలా నిర్ణయం తీసుకుందని పలువురు ఇంజనీరింగ్ నిపుణులు పేర్కొన్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో రోడ్ల స్థాయి తగ్గించడంతో కేంద్ర ప్రభుత్వం ప్రపంచబ్యాంకు రుణాలకు అడ్డంకులు తలెత్తినట్లు సమాచారం.



ఎన్‌డీబీ రుణం మంజూరైతే ఇలాంటి రోడ్లు జిల్లాల్లోనూ దర్శనమిస్తాయి

జిల్లాల వారీ రోడ్లు, బ్రిడ్జిల విస్తరణ ఇలా..

ప్యాకేజీ నెం జిల్లాలు	రోడ్ల పొడవు (కి.మీ)	వంతెనలు
1. శ్రీకాకుళం, విజయనగరం విశాఖపట్నం	559	64
2. ఉభయ గోదావరి	385	87
3. కృష్ణా, గుంటూరు	617	74
4. ప్రకాశం, నెల్లూరు	479	58
5. చిత్తూరు, వైస్సార్ కడప	453	93
6. అనంతపురం, కర్నూలు	518	56
మొత్తం	3.011	432

నేటి నుంచి శ్రీశైలంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు



విశాలాంధ్ర - శ్రీశైలం : శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు ఏడు రోజులపాటు సంక్రాంతి బ్రహ్మోత్సవాల నిర్వహణకు శ్రీశైల దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేసింది. సంప్రదాయాలను అనుసరించి శ్రీశైల క్షేత్రంలో మల్లికార్జునస్వామి వారికి ఏటా రెండుసార్లు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. మకర సంక్రమణాన్ని పురస్కరించుకొని ఒకటి, మహా శివరాత్రి సందర్భంగా మరోసారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. బ్రహ్మోత్సవాల్లో రోజూ స్వామి అమ్మవార్లకు విశేష పూజలు, మండపారాధనలు, నిత్యం రుద్రహోమం ఉంటాయి. నేటి నుంచి 18వ తేదీ వరకు స్వామి అమ్మవార్లకు జరిగే శాశ్వత ఆర్జిత సేవలైన రుద్రహోమం, మృత్యుంజయ హోమం, నవగ్రహ హోమం, కళ్యాణం, ఏకాంత సేవ, సర్వసేవ పథకాలు నిలుపుదల చేశారు. ఆర్జిత సేవా టికెట్లను కౌంటర్లు, ఆన్‌లైన్‌లలో సైతం నిలిపివేశారు. 15వ తేదీన దేవస్థానం తరపున మాత్రమే బ్రహ్మోత్సవ కళ్యాణం నిర్వహిస్తారు.

లోకేష్‌కూ తప్పని నిరసన సెగ



విశాలాంధ్ర ప్రతినిధి - కాకినాడ : జన్మభూమి సాక్షిగా ప్రజల నిరసన సెగ రాష్ట్ర మంత్రి లోకేష్‌కూ తప్పలేదు. ప్రజలు నిలదీయడంతో సమాధానం చెప్పకుండానే సభ మధ్యలోనే వెనుదిరగాల్సివచ్చింది. రోడ్డు సదుపాయం కల్పించకుండా ప్రజలను ఇబ్బందుల పాల్జేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారుల తీరును ఎండగడుతూ ప్రజలు రెండో రోజూ జన్మభూమిని బహిష్కరించి అధికారులను నిర్బంధించిన పరిస్థితి తూర్పులో ఎదురైంది. ఇలా ప్రజా సమస్యలను జన్మభూమి సభల్లో ప్రజలు లేవనెత్తి ప్రభుత్వ తీరును ఎండగడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో జన్మభూమి ప్రారంభం నుంచీ ప్రజాప్రతినిధులను నిలదీస్తూ ప్రజా సమస్యలను ప్రజలు ఏకరువు పెడుతూనే ఉన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా జన్మభూమి కార్యక్రమాలు ఎందుకని అధికారులు, ప్రజాప్రతినిధులను నిలదీస్తూ నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం జిల్లాకు వచ్చిన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖా మంత్రి నారా లోకేష్ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పెద్దాపురం నియోజకవర్గం కట్టమూరు గ్రామంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ప్రభుత్వ పనితీరు, చేసిన అభివృద్ధి గురించి మంత్రి లోకేష్ ప్రజలకు వివరిస్తున్నారు. ఈ దశలో కట్టమూరు మూడవ వార్డుకు చెందిన మహిళలు ఒక్కసారిగా లేచి తమ నిరసన తెలిపారు. మా గ్రామానికి రోడ్డు లేకుండా చేశారని, వర్షం వస్తే అనేక ఇబ్బందులు పడుతున్నామని, మహిళలు ఒక్కసారిగా లేచి తమ గ్రామంలో మంచి నీటి సమస్య ఎందుకు పరిష్కారం చేయలేదని, తమ వార్డుల్లో సీసీ రోడ్లు ఎందుకు నిర్మించడం లేదని నిలదీశారు. నాయకులు, అధికారులు వివక్షత చూపుతున్నారని మండిపడ్డారు. సంక్షేమ పథకాల పంపిణీలోనూ తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఒక్కసారిగా మహిళలు ప్రశ్నించడంతో కంగుతిన్న మంత్రి లోకేష్ వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. అన్ని సమస్యలు పరిష్కరిస్తామని తమకు సమయం ఇవ్వాలన్నారు. అయినా మహిళలు శాంతించకపోవడంతో విసుగుచెందిన లోకేష్ సభ నుండి మధ్యలోనే బయటకు వెళ్ళిపోయారు. ఉపముఖ్యమంత్రి చినరాజప్ప జోక్యం చేసుకుని నాలుగేళ్ల క్రితం గ్రామ పరిస్థితికి, ప్రస్తుత గ్రామ పరిస్థితికి బేరీజు వేసుకోవాలన్నారు.ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని చెప్పి వెళ్ళిపోయారు. పెద్దాపురం నియోజకవర్గం శంఖవరంలోనూ ప్రజలు రెండో రోజూ జన్మభూమి సభను బహిష్కరించారు. శంఖవరం మండల కేంద్రం నుండి పెద మల్లాపురం వరకూ రోడ్డు వేయకుండా ఆర్టీసీ బస్సును సైతం లేకుండా చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కొత్తపల్లి గ్రామానికి చెందిన ప్రజలు జన్మభూమిని బహిష్కరించారు. గ్రామానికి అధికారులు చేరుకోగానే వేదిక ముందుకు ప్లకార్డులు చేతబూని మాకు రోడ్డు కావాలని, జన్మభూమి వద్దని నిర్బంధించారు. మాజీ సర్పంచ్ ఈగల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. నెలాఖరులోగా రోడ్డుకు టెండర్ వేసి వెంటనే నిర్మిస్తామని హామీ ఇవ్వడంతో అధికారులను విడిచిపెట్టారు. ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ ప్రతి రోజూ జన్మభూమిలో ప్రజల నిలదీతలు, నిరసనలు చోటుచేసుకుంటున్నాయి.



ప్రాణాలు తీసిన కోడిపందేలు

- పోలీసుల దాడితో పందెంరాయుళ్ల పరుగు
- బావిలో పడి ఇద్దరు యువకుల దుర్మరణం
- కృష్ణాజిల్లా చిత్తపూరులో ఘటన

విశాలాంధ్ర - చాట్రాయి/చాట్రాయి రూరల్ : కోడి పందేలు ఇద్దరు యువకుల ప్రాణాలను బలితీసుకున్నాయి. అర్ధరాత్రి వేళ జోరుగా పందేలు కాస్తూ సందడి చేస్తుండగా, పోలీసులు రావడంతో పందెంరాయుళ్లు పొలాల్లోకి పరుగులు తీశారు. ఈ క్రమంలో ఇద్దరు యువకులు నేలబావిలో పడి మరణించారు. ఈ ఘటన కృష్ణా జిల్లా చాట్రాయి మండలం చిత్తపూరు గ్రామ శివారులో గురువారం అర్ధరాత్రి జరిగింది. చిత్తపూరు, కొండపర్వ గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఇటీవల చిత్తపూరు శివారులో పెద్ద ఎత్తున కోడి పందేలు నిర్వహిస్తున్నారు. సమీప గ్రామాల నుంచి పందెంరాయుళ్లను సమీకరించి ఒక్కో పందేనికి రూ.25 వేల నుంచి రూ.30వేల వరకు పందేలు కాసేలా చేస్తున్నారు. రోజుకు లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నట్లు తెలిసింది. యథావిధిగా గురువారం రాత్రి కూడా చిత్తపూరు గొల్లగూడెం ఇళ్ల వెనుక పొలాల్లో పిల్లలు వాలీబాల్ ఆడుకునే మైదానంలో లైట్లు ఏర్పాటు చేసి భారీగా కోడి పందేలు నిర్వహిస్తున్నారు. కోడి పందేలపై గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రాత్రి 11 గంటల సమయంలో పోలీసులు ఘటనాస్థలికి వచ్చారు. దీంతో పందెంరాయుళ్లు పొలాల్లోకి పరుగులు తీశారు. ఈ క్రమంలో ఇద్దరు యువకులు నేలబావిలో పడిపోయారు. వెంటనే అప్రమత్తమైన పోలీస్ కానిస్టేబుల్ బాలాజీ సాహసోపేతంగా నూతిలో దూకి వారి ప్రాణాలను కాపాడేందుకు యత్నించినా ప్రయోజనం లేకపోయింది. శుక్రవారం ఉదయం చాట్రాయి ఎస్ఐ ఎండీ అహ్మద్ ఆధ్వర్యాన బావిలోని నీటిని ఆయిల్ ఇంజిన్ల సాయంతో తోడి, ఇద్దరు యువకుల మృతదేహాలను బయటకు తీశారు. మృతిచెందిన యువకులను చిత్తపూరుకు చెందిన చిట్టూరి శ్రీనివాసరావు(20), విస్సన్నపేట మండలం కొండపర్వ గ్రామానికి చెందిన కుక్కల చెన్నారావుగా గుర్తించారు. శ్రీనివాసరావుకు పెళ్లి కాలేదు. చెన్నారావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అమెరికన్ కంపెనీతో గీతం ఎంఓయూ



విశాలాంధ్ర - విశాఖపట్నం (మధురవాడ) : కృత్రిమ మేథపై అధ్యయనానికి అమెరికన్ కంపెనీ లెపెటస్ సొల్యూషన్స్‌తో గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం శుక్రవారం అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. గీతం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, గీతం హైదరాబాద్ ప్రాంగణం ప్రో-వైస్ ఛాన్స్‌లర్ ఎన్.శివ ప్రసాద్ సమక్షంలో ఇక్కడ లెపెటస్ సొల్యూషన్స్ ప్రతినిధులు అమృత సేతురామ్, హరీ ఎత్వాల్ ఒప్పంద పత్రాలపై సంతకం చేశారు. కృత్రిమ మేథ, డీప్ న్యూరల్ నెట్‌వర్క్‌లకు అవసరమైన సమాచార సేకరణ, క్రోడీకరించడం, విశ్లేషించడంలో గీతం పరిశోధకులు, విద్యార్థుల సహకారం తీసుకుంటామని కంపెనీ ప్రతినిధులు వెల్లడిం చారు. కృత్రిమ మేథపై గత 15 సంవత్స రాలుగా అమెరికాలోని నార్త్ కెరోలినా కేంద్రంగా తాము పనిచేస్తున్నట్టు వెల్లడించారు. గీతం ఫిన్‌టెక్ అకాడమీ విద్యార్థులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.షీలా, గీతం ఫిన్‌టెక్ అకాడమీ కో-ఆర్డినేటర్ లెబిన్ జాన్సన్ పాల్గొన్నారు.

కాకినాడ గేట్ వే పోర్టుకు కొత్త కళ

- మోడల్ పోర్టు చేసేలా జీఎంఆర్ ప్రణాళిక
- రూ.3 వేల కోట్ల పెట్టుబడులతో అభివృద్ధి
- నిరుద్యోగ యువతకు ఉపాధిపై ఆశలు

విశాలాంధ్ర ప్రతినిధి - కాకినాడ : కాకినాడ గేట్‌వే పోర్టును ఆధునిక పద్ధతుల్లో మోడల్ పోర్టుగా తీర్చిదిద్దేందుకు జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థ ప్రణాళికలు రూపొందించింది. రూ.3 వేల కోట్లతో పనులు చేపట్టేలా ప్రాజెక్టు తయారు చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంతో జీఎంఆర్ సంస్థ ఒప్పందం చేసుకోవడంతో ఇటీవల కాకినాడకు వచ్చిన సీఎం చంద్రబాబునాయుడు శంకుస్థాపన కూడా చేశారు. ఈ పోర్టు ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని ఆ సంస్థ ప్రతినిధులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు.

తూర్పుగోదావరి జిల్లా కోన గ్రామ సమీపంలో గ్రీన్ ఫీల్డ్ వాణిజ్య నౌకాశ్రయం అభివృద్ధికి భూమి పూజ కూడా నిర్వహించారు. కాకినాడ గేట్ వే పోర్టును జీఎంఆర్ గ్రూప్‌నకు చెందిన జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన కాకినాడ సెజ్ లిమిటెడ్ ప్రమోట్ చేస్తుంది. ఈ పోర్టు కోసం 2018 నవంబరు 21న కాకినాడ పోర్టు డైరెక్టర్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు. డిజైన్, బిల్డ్ ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్ఓటీ) పద్ధతిలో ఈ నౌకాశ్రయ అభివృద్ధి కోసం రాయితీ ఒప్పందం చేసుకు న్నారు. ఈ రాయితీని రెవెన్యూ వాటాలో 2.7 శాతం, కన్సెషన్ ఫీజును సీఓడీ, మొదటి 30 సంవత్సరాలలో రాయితీతోపాటు 31 నుంచి 40 సంవత్సరాలలో రెవెన్యూ వాటాలో 5.4 శాతం, 41 నుండి 50 సంవత్సరాల కాలంలో రెవెన్యూ వాటాలో 10.8 రాయితీ అందించాలని ఒప్పందం జరిగింది. ఈ నౌకాశ్రయాన్ని కేఎస్ఈజెడ్‌కు చెందిన 1,811 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయను న్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాయితీ ఒప్పంద కాలంలో 133 ఎకరాల సీ ఫ్రంట్ ల్యాండ్‌ను లీజుకు అందించాల్సి ఉంది. ఈ పోర్టు బొగ్గు, సాధారణ కార్గో, లిక్విడ్ కార్గోను కన్సెషన్ పీరియడ్‌లో నిర్వహించనున్నట్టు అంచనా. రూ. 3 వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ నౌకాశ్రయం ద్వారా జిల్లా లోనూ, తొండంగి మండలంలోనూ వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయని జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. దేశంలోనే మోడల్ పోర్టుగా తీర్చిదిద్దుతామని జీఎంఆర్ సంస్థ హామీ ఇచ్చిందని తెలిపారు. ప్రపంచంలోనే అత్యుత్తమ నమూనా నౌకాశ్ర యంగా నిలుస్తుందని, కాకినాడ ప్రాంతంలో పారిశ్రామికీ కరణకు నూతన అధ్యాయాన్ని ఈ పోర్టు సృష్టించనుందని జీఎంఆర్ గ్రూపు చైర్మన్ బీవీఎన్ రావు విశ్వాసం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఈ పోర్టుకు కాకినాడ సెజ్‌కు చెందిన పారిశ్రామిక భూమి 8,521 ఎకరాలు బ్యాక్ యార్డ్‌లో ఉంది. వైజాగ్-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లోని ఈ పోర్టు, ఇండస్ట్రియల్ పార్కు కలిసి దేశంలోని తూర్పు తీరానికి గేట్‌వేగా నిలుస్తుందని భావిస్తున్నారు. గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్‌తో ప్రభుత్వం ఒప్పందం చేసు కుని పారిశ్రామిక పార్కులోని పరిశ్రమలకు సహజ వాయు వును పైప్‌ల ద్వారా సరఫరా చేస్తుందని చెబుతు న్నారు. దేశ తూర్పు తీరంలోని సహజ వాయువును పైపుల ద్వారా అన్ని పారిశ్రామిక యూనిట్లకు సరఫరా చేసిన మొదటి పారిశ్రామిక పార్కుగా నిలువనుందని నివేదికల్లో పేర్కొన్నారు.

జీఎంఆర్ నౌకాశ్రయం రాకతో కాకినాడ సెజ్‌లో మరికొన్ని పరిశ్రమల స్థాపనకు వివిధ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. కెమి కల్స్, పెట్రో కెమికల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, సోలార్ ఎక్విప్ మెంట్ మాన్యుఫాక్చరింగ్, పరిశ్రమల స్థాపనతో వేలమందికి ఉపాధి అవకాశాలు దొరుకుతాయంటున్నారు.



జీఎంఆర్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న చిత్రంలో సీఎం చంద్రబాబు (ఫైల్)

ఐకానిక్ వంతెనకు నేడు శంకుస్థాపన



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాజధాని అమరావతి నగరాన్ని విజయవాడతో అనుసంధానం చేస్తూ కృష్ణానదిపై నిర్మించనున్న భారీ ఐకానిక్ వంతెనకు శనివారం ఉదయం 10 గంటలకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేయనున్నారు. రాజధాని నిర్మాణంలో మరో చారిత్రాత్మక ఘట్టానికి ఈసారి ఇబ్రహీంపట్నం సమీపంలోని పవిత్ర సంగమం వేదిక కానుంది. అమరావతి డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ (ఏడీసీ) ఆధ్వర్యంలో 'యోగ ముద్ర' ఆకారంలో 3.2 కిలోమీటర్ల పొడవుతో ఉండే ఈ వంతెన నిర్మాణానికి రూ. 1,387 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. ప్రముఖ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ ఈ వంతెన నిర్మాణాన్ని చేపట్టనుంది. ఇటు హైదరాబాద్ జాతీయ రహదారిని, అటు అమరావతి రీజియన్‌లోని ఉద్దండరాయునిపాలెం సమీపంలో ఉన్న ఎన్10 రహదారితో ఈ ఐకానిక్ వంతెన కలుపుతుంది. దీని నిర్మాణానికి పూర్తిగా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు ఏడీసీ అధికారులు చెబుతున్నారు. తీగతో (కేబుల్ స్టేడ్) స్ట్రక్చర్ ఉండడం ఈ వంతెన ప్రత్యేకత. వంతెన పూర్తయితే విజయవాడ నుంచి తక్కువ సమయంలోనే రాజధాని ప్రాంతానికి చేరుకో వచ్చని తెలిపారు. వంతెనతో పాటు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు కూడా సీఎం శంకుస్థాపన చేయనున్నారు. రాజధాని నగరంలో భవిష్యత్తులో వినియోగించే నీటిని శుద్ధి చేసేందుకు ఈ ప్లాంట్ ఉపయోగపడనుంది. ఈ కార్యక్రమానికి స్పీకర్ కోడెల శివప్రసాదరావు, జలవనరుల శాఖమంత్రి దేవినేని ఉమామహేశ్వర రావుతోపాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరుకానున్నారు.

లాల్ బహదూర్ శాస్త్రికి కాంగ్రెస్ నేతల నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రికి కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో శుక్రవారం లాల్‌బహదూర్ శాస్త్రి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పీసీసీ ఉపాధ్యక్షుడు ఎంజే రత్నకుమార్ తదితరులు పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండో-పాకిస్తాన్ యుద్ధ సమయంలో జైజవాన్, జైకిసాన్ నినాదంతో ప్రజల హృదయాల్లో ఆయన చెరగని ముద్రవేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధానకార్యదర్శి రాజు, విజయవాడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్నాథం పాల్గొన్నారు

ఎన్టీఆర్ జీవితం అందరికీ స్ఫూర్తి

కథానాయకుడు చిత్రం అద్భుతంగా ఉందంటూ సీఎం ప్రశంస



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఎన్టీఆర్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, కథానాయకుడు సినిమా అద్భుతంగా తీశారని సీఎం చంద్రబాబు కొనియాడారు. శుక్రవారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో కల్సిన నందమూరి బాలకృష్ణ, చిత్ర నిర్మాత క్రిష్‌లను చంద్రబాబు దుశ్శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా తాను గురువారం రాత్రి చూసిన కథానాయకుడు సినిమా గురించి పలు వ్యాఖ్యలు చేశారు. ఎన్టీఆర్ సినిమా ఎనలేని స్ఫూర్తిని నింపింది. 30ఏళ్ల చరిత్రను 3గంటల్లో చూపారు. తన భావాలతో రాజీపడలేక ఉద్యోగాన్నే ఎన్టీఆర్ వదిలేశారు. మద్రాసు వెళ్లి అష్టకష్టాలు పడ్డారు. అయినా మనోధైర్యం కోల్పోలేదు. అచంచల విశ్వాసంతో ముందుకు పోయారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. తుఫాన్ బీభత్స నష్టాలను ఎన్టీఆర్ ప్రత్యక్షంగా చూశారు. తుఫాన్ సందర్భంలో ఇల్లు కూలకుండా నిట్టాడికి తన భుజం మోపారు. ఆ బాధలను ప్రత్యక్షంగా అనుభవించారు. రైతులు, పేదల విపత్తు కష్టాలను చిన్ననాడే చూశారు. కాబట్టే సినీనటుడు కాగానే జోలెపట్టి విరాళాలు సేకరించారు. తానే స్వయంగా విరాళం ఇచ్చి స్ఫూర్తి నింపారు. ప్రభుత్వాలకు, సినీనటులకు, సమాజ సేవకులకు ఆదర్శంగా నిలిచారు. తుఫాన్లలో బాధితులను ఆదుకోవడం ఎన్టీఆర్ నేర్పిందేనని చెప్పారు. ఆయన లాంతర్ వెలుగులో చదువుకున్నారు. ఏ విద్యార్థికి ఆ కష్టాలు రాకూడదని ఆకాంక్షించి ప్రతి గ్రామానికి విద్యుత్ సరఫరా లక్ష్యం పెట్టుకున్నారు. గుడిసెల్లో నివసించే కుటుంబాల బాధ చూశారు. అందుకే కాంక్రీట్ శ్లాబుతో పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇవన్నీ తెరకెక్కించి మహానటుడి జీవితాన్ని, త్యాగాన్ని, అకుంఠిత కార్యదక్షతను ప్రజలకు అర్థమయ్యేలా చిత్రరూపమిచ్చిన దర్శకుడు క్రిష్‌ను సీఎం ప్రత్యేకంగా అభినందించారు. ఎన్టీఆర్‌గా బాలకృష్ణ నటన బ్రహ్మాండంగా ఉందని, ఇతర నటులు, సాంకేతిక వర్గం గొప్పగా చేశారని ముఖ్యమంత్రి ప్రశంసించారు.

జగన్‌పై కేఈ ఫైర్



విశాలాంధ్ర - బ్యూరో కర్నూలు: రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులపై ప్రధాని మోడీని ప్రశ్నించే దమ్మూ,ధైర్యం వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డికి లేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి విలేకరుల సమావేశంలో జగన్‌పై ఫైర్ అయ్యారు. విభజన హామీల్లో కడప ఉక్కుఫ్యాక్టరీ, విశాఖ రైల్వేజోన్ తదితర ప్రాజెక్టులు ఇవ్వకుండా మోడీ, గుజరాత్‌కు వేలకోట్ల రూపాయలు నిధులు ఇస్తున్నా రని, దీనిపై ఏపీ ప్రజలు బీజేపీపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. జగన్ సీఎం చంద్రబాబుపై అవినీతి పరుడని పుస్తకం విడుదల చేయడం దారుణమని, కేసుల నుంచి బయటపడటానికి మోడీ ఆశీర్వాదం కోసం జగన్ ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణా ప్రభుత్వం విద్యుత్ బకాయిలు ఇవ్వకున్నా ప్రశ్నించరని, కేసీఆర్ తెలంగాణాలో విజయం సాధిస్తే సంబరాలు చేస్తారని కేఈ విమర్శించారు. జగన్‌కు ఏపీ ప్రయోజనాల కంటే , సీఎం సీటు ముఖ్యమన్నట్లుగా పనిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ రాజ్యాంగ వ్యవస్థను ముఖ్యంగా న్యాయవ్యవస్థ, సీబీఐ, రక్షణ వ్యవస్థ ధ్వంసం చేశారన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో రూ.200 కోట్లు వ్యయంతో 88 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన భవనం, బెంగళూరు లోని గ్రీన్ బెల్టులో 32 ఎకరాల విస్తీర్ణంలో రూ.400 కోట్ల వ్యయంతో నిర్మించిన భవంతి వివరాలు తెలియపరలేదన్నారు. జగన్ సీఎం మాత్రం కాలేడన్నారు. పత్తికొండ టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాం బాబు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నాగేశ్వర రావు యాదవ్, నాయకులు వేమన్నగౌడ్, జేమ్స్, హనుమంతరాయచౌదరి ఉన్నారు.

టీజీఐలో రహస్య దర్యాప్తు!

- మూడురోజులుగా జిల్లాలోనే కేంద్ర దర్యాప్తు బృందం
- రహస్యంగా ఉంచిన మైన్స్ అధికారులు



విశాలాంధ్ర బ్యూరో-శ్రీకాకుళం: ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్(ఐబీఎమ్), అటామిక్ మైనింగ్ డిపార్ట్‌మెంట్ (ఏఎండీ), బాబా అటమిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలు మూడురోజులుగా శ్రీకాకుళం జిల్లాలోనే ఉన్నాయి. ప్రయివేటు సంస్థ ట్రాన్స్‌వరల్డ్ గార్నెట్‌లో అవి దర్యాప్తు నిర్వహిస్తున్నాయి. సముద్రపు ఇసుక నుంచి ఖనిజాలు వేరు చేసి అంతర్జాతీయంగా విక్రయిస్తున్న ఈ సంస్థకు పర్మిట్లు నిలిపివేస్తూ మూడు నెలల కిందట కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఆ సంస్థ కార్యకలాపాలను నిలిపివేసినా, యాజమాన్యాన్ని రప్పించి రికార్డులు పరీక్షించి, సముద్రతీర ప్రాంతంలో సంస్థ తవ్విన చోట్ల కొలతలు వేస్తూ, ప్లాంట్ మొత్తం కలియ తిరుగుతూ మూడు దర్యాప్తు సంస్థలు నిశితపరిశీలన చేస్తున్నాయి. ఈ విషయాన్ని గనులు, భూగర్భశాఖ అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్.సూర్యచంద్రరావు ఇందుకు సంబంధించిన వివరాలు బయటకు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. ఫోన్‌లు కూడా ఎత్తకపోవడంతో దర్యాప్తులో గతంలో ప్లాంట్‌కు సహకరించిన అధికారుల పాత్రపైనా పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. సముద్రపు ఇసుక నుంచి ఖనిజాలు వేరు చేసేందుకు జిల్లాలో ట్రిమక్స్ సాండ్స్ సంస్థతో పాటు ట్రాన్స్‌వరల్డ్ గార్నెట్‌కు మాత్రమే అనుమతులున్నాయి. గార్నెట్, ఇలమనైట్, సిలికా, జిర్కాన్, రుటైల్ లాంటి ఖనిజాలను వేరు చేసి అంతర్జాతీయ వ్యాపారం చేస్తున్న ఈ కంపెనీలు మోనోజైట్ అనే ఖనిజానికి లెక్కలు చెప్పడం లేదని, అవి రేడియో ధార్మికతతో కూడుకున్నవని, అణు సంబంధిత కార్యకలాపాలకు ప్రభుత్వం వాటిని వినియోగించుకోవాల్సి ఉండగా, వాటిని కూడా అమ్మేసుకున్నట్లు తేలింది. ఇందులో భాగంగానే టీజీఐ పరిశ్రమపై మూడు రోజులుగా కేంద్ర ప్రభుత్వ సంస్థలు దర్యాప్తు నిర్వహిస్తున్నాయి. ఖనిజాల్లో ఉన్న అణు ధార్మిక పదార్థాలను పరిశీలించి, అందులో యురేనియం ఎంతశాతం ఉన్నదో లెక్కలు గట్టి ప్రతీ వారం కేంద్ర సంస్థలకు సమాచారం ఇవ్వాల్సి ఉండగా, తప్పుడు లెక్కలు ఇచ్చినట్లు దర్యాప్తులో తేలినట్లు సమాచారం. బంకర్ కంట్రోల్‌లో నిల్వ ఉంచిన అంశాలను, దాని సామర్థ్యం, రేడియో ధార్మికత తదితర విషయాలపై దర్యాప్తు జరిగినట్లు తెలుస్తోంది. 11.37కి.మీల పొడవున, కుందువానిపేట నుంచి శ్రీకూర్మం వరకూ 95 హెక్టార్లలో తవ్వకాలు జరిగినట్లు నిర్ధారించారు. భారతీయ అణు సామర్థ్యాన్ని పెంపొందించేలా ఆయా పరిశ్రమలు వ్యవహ రించాల్సి ఉండగా, దేశానికి వెన్నుపోటు పొడిచి ఖనిజాలను అమ్ముకున్నట్లు సదరు సంస్థ పనితీరు ఉన్నట్లు అనుమానిస్తు న్నారు. గనులు భూగర్భశాఖ జాయింట్ డైరెక్టర్ (అమరావతి) పుల్లయ్య, డిప్యూటీ డైరెక్టర్ ప్రసాదరావు, అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ సూర్యచంద్రరావు, ఏజీఆర్ ప్రతాపరెడ్డిలు కేంద్ర బృందంతో పాటు ఈ మూడురోజులూ పర్యటించారు. కేంద్ర ప్రభుత్వ అధికారి మనీష్ ప్రశ్నల వర్షం కురిపించగా, అధికారులంతా పరుగులు పెడుతున్నారని సమాచారం.

పరీక్షల కన్వీనర్ల నియామకం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల్లో 2019-20 సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షల కన్వీనర్లను తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నియమించింది. ఎంసెట్ కన్వీనర్‌గా యాదయ్య(జేఎన్టీయూ హెచ్), ఈసెట్ కన్వీనర్‌గా గోవర్ధన్(జేఎన్టీయూ), పీఈసెట్ కన్వీనర్‌గా వి.సత్యనారాయణ(ఎంజీయూ), ఐసెట్ కన్వీనర్‌గా సీహెచ్ రాజేశం(కేయూ, లాసెట్, పీజీఎల్‌సెట్ కన్వీనర్‌గా బీబీరెడ్డి(ఓయూ), పీజీ ఈసెట్ కన్వీనర్‌గా ఎం.కుమార్ (ఓయూ), ఎడ్‌సెట్ కన్వీనర్‌గా టి.మృణాళిని(ఓయూ) నియమితులైయ్యారు.

'ఆర్ఐఎంసీ' 8వ తరగతి ప్రవేశాలకు ప్రకటన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కాలేజీ(ఆర్ఐఎంసి)-డెహ్రాడూన్‌లో 8వ తరగతి ప్రవేశాల కోసం ఏపీపీఎస్సీ ప్రకటన విడుదల చేసింది. ఈ మేరకు కమిషన్ సెక్రటరీ ఏకే మౌర్య శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రవేశానికి దరఖాస్తు చేసే విద్యార్థులు ప్రస్తుతం గుర్తింపు పొందిన పాఠశాలలల్లో ఏడవ తరగతి చదువుతూ ఉండాలి. పదకొండున్నర ఏళ్ల నుంచి 13ఏళ్లలోపు(1-1-2020 నాటికి) వయస్సు కలిగి ఉండాలి. అర్హులైన వారందరికీ జూన్1వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సిలబస్, ఫీజు వివరాలను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

సంక్రాంతి ఎఫెక్ట్

ప్లాట్‌ఫారం టికెట్ల ధర రెట్టింపు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: సంక్రాంతి రద్దీని క్రమబద్ధీకరించే చర్యల్లో భాగంగా రైల్వేశాఖ ప్లాట్‌ఫారం టికెట్ల ధరలను తాత్కాలికంగా రెట్టింపు చేసింది. ప్రస్తుతం రూ.10లుగా ఉన్న ప్లాట్‌ఫారం టికెట్ ధరను రూ. 20లకు పెంచింది. ప్రధాన రైల్వేస్టేషన్లు విజయవాడ, రాజమహేంద్రవరం, నెల్లూరులలో ఈనెల 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ 10 రోజులపాటు ఈ ధరల పెంపు వర్తిస్తుందని విజయవాడ డివిజన్ అధికారులు తెలిపారు. పండుగ సెలవులకు వచ్చే ప్రయాణీకులకు స్వాగతం పలకడం, సాగనంపేందుకు వారి బంధుమిత్రులు స్టేషన్లకు రావడం వల్ల ప్లాట్‌ఫారాలపై రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

వైఎస్ జగన్‌కు ఘనంగా వీడ్కోలు

విశాలాంధ్ర - తిరుమల: తిరుమల శ్రీవారి ఆశీస్సుల కోసం విచ్చేసిన రాష్ట్ర ప్రతిపక్ష నేత, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డికి పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు ఘనంగా వీడ్కోలు పలికారు. గురువారం రాత్రి శ్రీవారి దర్శనానంతరం విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానంద స్వామి ఆశీస్సులు పొందిన ఆయన స్థానిక శ్రీకృష్ణ అతిథిగృహంలో బస చేసి, శుక్రవారం ఉదయం వైఎస్ఆర్ కడప జిల్లా పర్యటనకు బయలుదేరి వెళ్లారు. వీడ్కోలు పలికిన వారిలో పార్టీ సీనియర్ నాయకులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, వరప్రసాద్‌లు ఉన్నారు.

ఏపీఆర్వో పోస్టులపై అయోమయం..

- 26 ఏళ్ల కిందటి విద్యార్హతను ప్రకటించిన వైనం
- అర్హులుగా డిగ్రీ, డిప్లమో అభ్యర్థులు, అనర్హులుగా పీజీ అభ్యర్థులు

విశాలాంధ్ర-విశాఖసిటీ: ఏపీ ప్రభుత్వం ఇటీవల ఏపీపీఎస్సీ ద్వారా అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ (సహాయ పౌర సంబంధాల అధికారి) పోస్టులకు ఇచ్చిన నోటిఫికేషన్ అభ్యర్థులను అయోమయంలో పడేసింది. ఈ పోస్టులకు కనీస విద్యార్హతగా డిగ్రీలో జర్నలిజం, పబ్లిక్ రిలేషన్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలని, ఆయా సబ్జెక్టుల్లో డిప్లమో ఉన్నవారు అర్హులేని నోటిఫికేషన్ పేర్కొంది. అయితే జర్నలిజం, పబ్లిక్ రిలేషన్స్ ఒక సబ్జెక్టుగా బోధించే కోర్సులు ఉన్న కళాశాలలు రాష్ట్రంలో చాలా తక్కువ. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఉండే బీజెఎంసీ కోర్సును 19 ఏళ్ల క్రితం ఎంజేఎంసీగా మార్చారు. ఉమ్మడి రాష్ట్రంలో అన్నీ యూనివర్సిటీలు బీజేఎంసీని ఎంజేఎంసీ (పీజీ)గా మార్చాయి. బీజేఎంసీ అప్పటి వరకు డిగ్రీ తరువాత ఒక ఏడాది కాలపరిమితితో ఉండేది. దీన్ని యూజీసీ తప్పుపట్టడంతో ఆ కోర్సును మార్చారు. కొన్ని చోట్ల జర్నలిజంలో పీజీ డిప్లమోను ప్రవేశ పెట్టినా తర్వాత తీసివేశారు. ప్రస్తుతం ఎంజేఎంసీ (జర్నలిజం పీజీ), డిప్లమో ఇన్ జర్నలిజం కోర్సులు ఏయూ సహా మరో రెండు వర్సిటీలు అందిస్తున్నాయి. వాటి అనుబంధ కళాశాలలను లెక్కకట్టినా తక్కువ కాలేజీలు ఈ కోర్సును నిర్వహిస్తున్నాయి. కొన్ని కళాశాలల్లో బీఏ (జర్నలిజం) కోర్సుకి ఆదరణ లేక ఎత్తివేశారు. పబ్లిక్ రిలేషన్స్ సబ్జెక్టు కొన్ని మేనేజిమెంట్ కోర్సులతో కలిపి ఉంది. జర్నలిజం, పీఆర్ రంగాలకు వెళ్లాలనుకునే వారు డిగ్రీ తరువాత ఎంజేఎంసీ కోర్సును చదువుతున్నారు. ప్రస్తుతం వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పీఆర్‌లుగా పని చేస్తున్న వారంతా ఎంజేఎంసీ చదివిన వారే. కాగా, ఈ పోస్టులకు సంబంధించి విద్యార్హతలు 1992లో ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 339 ప్రకారం ఉన్నాయి. ఇప్పుడున్న ఎంజేఎంసీ స్థానంలో అప్పట్లో బీజేఎంసీ కోర్సు ఉండేది. 26 ఏళ్ల తరువాత అదే విద్యార్హతను నిర్ణయించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. దీంతో ఏపీఆర్వో పోస్టులకు వివిధ డిగ్రీలు పూర్తి చేసి, ఎంజేఎంసీ చదివిన వారు దరఖాస్తు చేసుకోవడానికి అనర్హులుగా మారారు. జర్నలిజం, పబ్లిక్ రిలేషన్స్ ఒక సబ్జెక్టుగా డిగ్రీ చదివిన వారు, టెన్త్, ఇంటర్ తరువాత జర్నలిజం డిప్లమో చేసిన వారు అర్హులయ్యారు. దీంతో అభ్యర్థుల్లో గందరగోళం నెలకొంది. విద్యార్హతను సవరించకపోతే తామంతా అవకాశం కోల్పోతామని వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

వినతులు నాలుగున్నర లక్షలే..!


- అదే మొదటి జన్మభూమిలో 40 లక్షలు
- నాలుగేళ్లు.. 670 అవార్డులు
- టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: నాలుగేళ్లలో వివిధ రంగాల్లో సాధించిన ప్రగతికి దాదాపు 670 అవార్డులొచ్చాయంటే ఇదే మన ప్రగతికి నిదర్శనమని సీఎం చంద్రబాబు అన్నారు. జన్మభూమి చివరి రోజు సందర్భంగా శుక్రవారం వివిధ జిల్లాల కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజా ప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నాలుగేళ్లలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం. స్వయం కృషి, పట్టుదలతోనే ఇది సాధ్యమైందన్నారు. విభజన రోజు దిక్కుతోచని స్థితి. అనూహ్యంగా ఇప్పుడు అద్భుత ప్రగతి సాధించాం. దీంతో యావత్ ప్రపంచమే మన దిక్కు చూస్తోందన్నారు. ఇంత పెద్ద పండుగ ప్రజలకు చేరువ చేసిన పాలనా యంత్రాంగానికి, ప్రజా ప్రతినిధులకు అభినందనలని సీఎం తెలిపారు. 2014లో కొందరు రాష్ట్రానికి రావడానికి ఆసక్తి చూపలేదు. కొంత మంది మాత్రమే ఏపీ వచ్చేందుకు ఆసక్తి చూపారు. ఏపీ బృందాన్ని బలహీనమన్నారు. ఇప్పుడు ఆ బృందంతోనే అద్భుతాలు సృష్టించాం. దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను అత్యున్నత రాష్ట్రం చేశాం. గతంలో 9 ఏళ్లు ముఖ్యమంత్రిగా నేను ఒక్కడినే పరుగెత్తాను. ఇప్పుడు ఆ విధంగా కాదు. ఒక బృందంగా పరుగు తీస్తున్నాం. అందుకే ఫలితాలు కూడా గొప్పగా సాధిస్తున్నామని ఆనందం వ్యక్తం చేశారు. 16 వేల గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించడం ఒక చరిత్ర. 16 వేల గ్రామాభివృద్ధి ప్రణాళికలను అప్‌లోడ్ చేయడం రికార్డు. పోలవరం కాంక్రీట్ పనుల్లో గిన్నిస్ రికార్డు సాధించామని గుర్తు చేశారు. మన ఆర్టీజీని మొన్న బ్రిటన్ మాజీ ప్రధాని టోని బ్లెయర్ ప్రశంసించారు. నిన్న సింగపూర్ మంత్రి ఈశ్వరన్ అభినందించారు. సింగపూర్‌లో లేని వ్యవస్థకు మనం శ్రీకారం చుట్టాం. 1100 పరిష్కార వేదిక ప్రపంచానికే నమూనా. అది పేదల సమస్యల సత్వర పరి ష్కార వేదిక అన్నారు. ఒక్క రోజులో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు ఒక చరిత్ర. లక్షా 30 వేల మంది యువతకు ఉపాధి మరో చరిత్ర. అదాని రూ.30 వేల కోట్లతో డేటా పార్కులు, రూ.40 వేల కోట్లతో సోలార్ పార్కులు విశాఖలో ఏర్పాటు చేయనున్నారు. ప్రకాశంలో కాగితం గుజ్జు పరి శ్రమ వస్తోంది. దీనివల్ల 50 వేల రైతు కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. మొదటి జన్మభూమికి 40 లక్షల వినతులు వచ్చాయి. ఈ జన్మభూమికి 4.5 లక్షలు మాత్రమే వినతులు అందాయన్నారు. ప్రజల్లో సంతృప్తి శాతానికి ఇదే రుజువు. అనేక సమస్యలు నాలుగేళ్లలో పరిష్కరించాం. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో కూడా పని చేసి రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టాలని ముఖ్యమంత్రి కోరారు.

ఆ ఇళ్లకు బిల్లుల చెల్లింపులేవి..?

- 2015లో నిర్మించిన గృహాలకు సొమ్ములివ్వలేదు
- ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైతే చెల్లించే పరిస్థితే లేదు
- ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు
- రూ.800 కోట్లు నిధులు కావాలి



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలినాళ్లలో ఎలాంటి గృహ నిర్మాణ పథకాలను ప్రవేశపెట్టలేదు. దీంతో నాయకులు ఇచ్చిన హామీల మేరకు 2015లో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నారు. వీటికి సంబంధించిన నిధులను విడుదల చేయలేదు. మరో నెల రోజుల్లో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే ఆస్కారం ఉంది. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. నవ్యాంధ్రప్రదేశ్‌లో 2014లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇళ్లు నిర్మించుకోండి నిధులిప్పిస్తామని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు హామీలిచ్చారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 1.26 లక్షల మంది లబ్ధిదారులు సొంత సొమ్ములతో ఇళ్లు నిర్మించుకు న్నారు. తీరా ఇళ్లను నిర్మించుకున్న తర్వాత నిధులు ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తూ వచ్చింది. దీనిపై అనేక పర్యాయాలు శాసనసభలో, కలెక్టర్ల సదస్సుల్లో, మంత్రివర్గంలో చర్చలు జరిగాయి. ఒక్కొక్క ఇంటికి రూ.70 వేలు ఇవ్వాలని ప్రజాప్రతినిధులు కోరితే ఒక్కొక్క ఇంటికి రూ.50 వేలు ఇస్తామని సీఎం చెప్పారు. అయితే ఇంత వరకు ఎంత ఇస్తారో తేల్చలేదు. పైగా ఎప్పుడిస్తారో ప్రకటించలేదు. ఫిబ్రవరి రెండో వారంలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైతే నిధులు ఇచ్చే అవకాశం లేదని గగ్గోలు పెడుతున్నారు. దీని నిమిత్తం రూ.800 కోట్లు కావాలని ఆర్థిక శాఖ ప్రాథమికంగా ఒక అంచనాకు వచ్చింది. అంత పెద్దమొత్తంలో నిధులు విడుదల చేయడం కష్టసాధ్యంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు, టీడీపీ నియోజకవర్గ ఇన్ చార్జిల చుట్టూ లబ్ధిదారులు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపు ఎంతో కొంత ఇచ్చి ఆదుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు. దీనిపై మం త్రులు కూడా తరచూ సీఎం దృష్టికి తీసుకెళుతున్నారు. అయితే ఆచరణలో పురోగతి కానరావడం లేదు.

నాలుగేళ్లుగా నిరీక్షణ

హామీలపై ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు నాలుగేళ్లుగా సొమ్ములు కోసం నిరీక్షిస్తున్నారు. రాష్ట్రం లో 175 నియోజకవర్గాల్లో లబ్ధిదారులు ఉన్నారు. ఒక్కొక్క నియోజకవర్గం నుంచి ఐదు వందల నుంచి ఎనిమిది వందల వరకు లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో ఎక్కువగా పేదవారే ఉన్నారు. సొమ్ములిస్తారనే ఆశతో అప్పట్లో చేతిలో డబ్బు లేకపోయినా అప్పు చేసి మరీ ఇళ్లను నిర్మించుకున్నారు. అయితే ప్రభుత్వం సొమ్ములు విడుదల చేయకపోవడంతో లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

గుదిబండలా మారిన బిల్లులు

గృహనిర్మాణ శాఖలో బిల్లులు ప్రభుత్వానికి గుదిబండలా మారుతున్నాయి. బ్రిక్ కాంపోనెంట్ కింద నిధులిస్తామని తొలుత కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే తర్వాత లబ్ధిదారుడే సొంతంగా ఇటుక తయారు చేసుకుంటేనే బ్రిక్ కాంపోనెంట్ కింద నిధులిస్తామని మెలిక పెట్టింది. లబ్ధిదారుడు సొంతంగా ఇటుక తయారు చేసుకోవడం ఆచరణలో సాధ్యంకాని పని అని రుజువు అయ్యింది. దీంతో తప్పని పరిస్థితిలో బ్రిక్ కాంపోనెంట్ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే మోస్తోంది. కేంద్రం ఇవ్వాల్సిన ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వమే ఇస్తోంది. ఇలా అనేక విధాలుగా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై ఆర్థిక భారం పడుతోంది.

పాతమిత్రులతో దోస్తీకి సిద్ధమనడం

మోడీ దివాలాకోరుతనానికి నిదర్శనం

ఆర్థిక మంత్రి యనమల విమర్శ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పాతమిత్రులతో దోస్తీకి సిద్ధమనడం మోడీ దివాలాకోరుతనానికి నిదర్శనమని ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. సంకీర్ణానికి గేట్లు తెరిచామన్న ప్రధాని వ్యాఖ్యలు బీజేపీ దుస్థితికి అద్దం పడుతున్నాయన్నారు. భాగస్వామ్య పక్షాల విశ్వసనీయతను మోడీ ఎప్పుడో కోల్పోయారని, గేట్లు తెరుచుకుని భాగస్వామ్య పార్టీలే వెళ్లిపోతున్న దశలో మళ్లీ గేట్లు తెరిచామని చెప్పడాన్ని యనమల ఎద్దేవా చేశారు. రెండు నెలల్లో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మోడీ ఎన్ని జిమ్మిక్కులు, జిత్తులు వేసినా ప్రజలు నమ్మరని ఆయన పేర్కొన్నారు. ఈబీసీలకు 10శాతం రిజర్వేషన్లు అనేది కూడా ఎన్నికల జిమ్మిక్కేనని ఆయన విమర్శించారు. ఇవి జులై నుంచి అమల్లోకి వస్తాయనడమే దీనికి నిదర్శనమన్నారు. నిజంగా దీనిపై మోడీకి చిత్తశుద్ధి వుంటే 4ఏళ్ల క్రితమే ఈనిర్ణయం తీసుకుంటే ఇప్పటికే అమలయ్యేదన్నారు. మహిళా రిజర్వేషన్లపై ప్రధాని ఎందుకు స్పందించడం లేదు. శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులపై కేంద్రం చర్యలేవి, తెలంగాణాలో ముస్లిం రిజర్వేషన్ బిల్లు, ఏపీలో కాపుల రిజర్వేషన్ బిల్లుల సంగతేంటని యనమల ప్రశ్నించారు. వీటిపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండు చేశారు.

ఎన్ఐఏ కస్టడీకి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జగన్‌పై కోడి కత్తితో దాడి కేసులో నిందితుడు శ్రీనివాసరావును ఎన్ఐఏకు అప్పగిస్తూ విజయవాడ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి తీర్పు వెలువరించారు. వారం రోజులపాటు కస్టడీలో ఉంచాలని సూచిస్తూ, తదుపరి విచారణ ఈనెల 25కు వాయిదా వేశారు. శ్రీనివాసరావును ఎన్ఐఏ శనివారం నుంచి కస్టడీలోకి తీసుకుని విచారణ చేయనుంది. ఇప్పటి వరకు రాష్ట్రపోలీసుశాఖ, సీఐడీ ఆధ్వర్యంలో పలుమార్లు నిందితుడిని విచారణ చేశారు. అయితే వాస్తవాలు బయటకు వెల్లడికాలేదని ప్రతిపక్షపార్టీ సభ్యులు ఆరోపించారు.



జీఐ సాధనకు పర్యాటక శాఖ సమన్వయం

ముఖేష్ కుమార్ మీనా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగు ప్రజలకు మాత్రమే పరిమితమైన ప్రత్యేక అంశాలకు భౌగోళిక సూచీ (జీఐ)లు పొందేందుకు పర్యాటక శాఖ కృషి చేస్తోందని ఆంధ్రప్రదేశ్ పర్యాటక ,భాషా సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా వెల్లడించారు. విజయవాడ నోవాటెల్ వేదికగా నిర్వహిస్తున్న ఆంధ్రా ఆహార పండుగను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఆచార్య జయరామిరెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, ఒక్కో ప్రాంతంలో తయారయ్యే, ఉత్పత్తి అయ్యే కొన్ని రకాల వస్తువులకు సహజంగా ఒక నాణ్యత ఉంటుందని అదే వాటి ప్రత్యేకత కాగా, తెలుగునాట వీటికి కొదవ లేదని,పర్యాటకంగా ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేసుకోవటం ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా మెరుగు పడతాయన్నారు. కార్యక్రమంలో ఏపీటీఏ పరిపాలనా సంచాలకులు డాక్టర్ సాంబశివరాజు, మార్కెటింగ్ సంచాలకులు శ్రీనివాసరావు, ఉపసంచాలకులు నిషార్ అహ్మద్, ఏపీటీడీసీ జీఎంలు హరనాథ్, సుదర్శన్ పాల్గొన్నారు.

కేవీపీఎస్ 2019 డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: కుల వివక్ష పోరాట సమితి (కేవీపీఎస్) 2019 డైరీని ఎస్సీ కార్పోరేషన్ ఎండీ విజయకుమార్ ఆవిష్కరించారు. విజయవాడ ఎంబీభవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయకుమార్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదురించి, వారి సామాజికాభివృద్ధికి కేవీపీఎస్ ఎనలేని కృషి చేస్తోందని అభినందించారు. దళిత్ శోషణ్ ముక్తి మంచ్ జాతీయ కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ బీజేపీ ఓబీసీ రిజర్వేషన్ బిల్లును అగ్రకులాల ఓటుబ్యాంకు కోసమే తీసుకొచ్చిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దడాల సుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, నాయకులు జి.నటరాజ్, ఒ.నల్లప్ప, రఘురామ్, ఎం.డి.ఆనంద్‌బాబు, కృష్ణమోహన్, సాల్మన్‌రాజు, రామకృష్ణ, క్రాంతి, గణేష్, సురేంద్ర, వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు



వన్డే సమరం

- పాండ్య, రాహుల్‌లపై వేటు
- జట్టులోకి జడేజా, ధోనీ, రాయుడు
- గణాంకాల్లో బలహీనంగా భారత్

సిడ్నీ: ఇద్దరు ప్రధానమైన ఆటగాళ్లపై సస్పెన్షన్ వేటు పడిన నేపథ్యంలో... టీమిండియా శనివారంనుంచి వన్డే సిరీస్‌లను ప్రారంభించనున్నది. ఈ వన్డేలను ప్రపంచకప్‌కు సన్నాహకాలుగా జట్టు భావిస్తోంది. క్రికెట్ అడ్మినిస్ట్రేటర్స్ కమిటీ పాండ్య, కేఎల్ రాహుల్‌పై సస్పెన్షన్ వేటు నిర్ణయం తీసుకోవడం ఒకరకంగా భారత్‌కు ఇబ్బందికర పరిణామమే. ఎందుకంటే ప్రధాన బౌలర్ అయిన జస్ప్రీత్ బుమ్రాకు రెస్ట్ ఇచ్చిన నేపథ్యంలో.. మిగిలిన పేసర్లతో టీమిండియా ప్రయోగానికి సిద్ధమైంది. భువీ ఫిట్‌నెస్ సాధించి సిద్ధంగానే ఉన్నా, పాండ్య గైర్హాజరీతో కోహ్లి నిర్ణయాన్ని బట్టి భువీ భవితవ్యం ఆధారపడి ఉంది. షమీ, ఖలీల్ అహ్మద్ పేసర్ల విభాగాన్ని పంచుకోనున్నారు. ఒక సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌పై పచ్చికను బట్టి కెప్టెన్ కోహ్లి ముగ్గురు పేసర్లు, ఇద్దరు స్పిన్నర్లను ఎంచుకునే అవకాశం ఉంది. పాండ్యపై సస్పెన్షన్ వేటుతో ఇప్పటికే జడేజాను తీసుకుంటున్నట్లు కోహ్లి తెలిపాడు. ఈ క్రమంలోనే జడేజా, కుల్దీప్‌తో స్పిన్ విభాగాన్ని పంచుకోనున్నాడు. ఇక అవసరమైతే పార్ట్‌టైమ్ బౌలర్‌గా కేదార్‌ను వినియోగించుకునే అవకాశం ఉంది. మూడోస్థానంలో కోహ్లి బ్యాటింగ్‌కు దిగే అవకాశం ఉండగా, జాదవ్, ఎంఎస్ ధోనీ, అంబటి రాయుడు మిడిలార్డర్‌లో ఉన్నారు. అయితే ప్రస్తుతం ధోనీ ఫాంలో లేకపోవడం భారత్‌ను కొంత కలవరపాటుకు గురిచేస్తోంది. గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన ఆసియా కప్‌లో అంబటి రాయుడిని టీమిండియా నాలుగో స్థానంలో ఆడించింది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్న రాయుడు 11 వన్డేల్లో 392 పరుగులు చేశాడు. అలాగే విండీస్‌తో జరిగినమ్యాచ్‌లో 56 యావరేజ్‌తో ఒక సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలు చేశాడు. అయితే ఆసీస్, న్యూజిలాండ్‌లతో జరిగే ఈ మ్యాచ్‌లలో రాయుడు కనుక రాణిస్తే టీమిండియాకు నాలుగోస్థానం భర్తీ అయినట్లే. గత రికార్డులతో పోల్చుకుంటే ఆసిస్‌లో భారత్ పరిస్థితి అత్యంత దారుణం. 48 వన్డేలు జరిగితే వాటిలో 35 మ్యాచ్‌లో ఓటమిపాలైంది. డేవిడ్ వార్నర్, స్టీవ్ స్మిత్‌లకు లేకపోవడం, మిచెల్ స్టార్క్, ప్యాట్ కమ్మిన్స్, జోష్ హేజిల్‌వుడ్‌లకు ఈ సిరీస్ నుంచి రెస్ట్ ఇవ్వడం భారత్‌కు కొంత సానుకూలమైన అంశం. ఇక ఆస్ట్రేలియా జట్టు స్పిన్ విభాగంలో నాథన్ లైయన్ వచ్చి చేరాడు. కీపర్-బ్యాట్స్‌మేన్ అయిన అలెక్స్ క్యారీ మొట్టమొదటిసారిగా కెప్టెన్ అరోన్ ఫించ్‌తో కలిసి ఓపెనర్‌గా దిగనున్నాడు. మిడిల్డార్‌లో ఉస్మాన్ ఖవాజా, షాన్ మార్ష్, పీటర్ హ్యాండ్స్‌కాంబ్ ఉన్నారు. అలాగే మార్కస్ స్టోయినియస్, గ్లెన్ మాక్స్‌వెల్‌లు ఆరో, ఏడో స్థానాల్లో ఉన్నారు. అయితే ఆస్ట్రేలియా పేస్ విభాగం మాత్రం కొంత బలహీనంగా కనబడుతోంది. ఎనిమిదేళ్ల తరువాత సిడిల్ వచ్చి చేరడం, శనివారం మ్యాచ్‌లో పేసర్ జాసన్ బెహ్రన్‌డార్ఫ్ అరంగేట్రం చేయనున్నాడు.

జట్ల అంచనా:

భారత్ : విరాట్ కోహ్లి (కెప్టెన్), రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, అంబటి రాయుడు, దినేశ్ కార్తీక్, కేదార్ జాదవ్, ఎంఎస్ ధోనీ (వికెట్ కీపర్), కుల్దీప్ యాదవ్, యజ్వేంద్ర చాహల్, రవీంద్ర జడేజా, భువనేశ్వర్ కుమార్, ఖలీల్ అహ్మద్, మొహ్మద్ షమీ, మహ్మద్ సిరాజ్

ఆస్ట్రేలియా : అరోన్ ఫించ్ (కెప్టెన్), అలెక్స్ క్యారీ (వికెట్ కీపర్), ఉస్మాన్ ఖవాజా, షాన్ మార్ష్, పీటర్ హ్యాండ్స్‌కాంబ్, మార్కస్ స్టోయినిస్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, నాథన్ లయన్, పీటర్ సిడిల్, రిచర్డ్‌సన్, జాసన్ బెహన్‌డార్ఫ్

ఒక్కసారి రిటైరైతే..

బ్యాట్ పట్టేది లేదు : కోహ్లి



సిడ్నీ: అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాక ఎంతోమంది ఆటగాళ్లు లీగ్ టోర్నీలు ఆడుతుండటం చూస్తూనే ఉంటాం. దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు ఏబీ డివిలియర్స్, న్యూజిలాండ్ మాజీ ఆటగాడు బ్రెండన్ మెకల్లమ్ ఈ కోవలోకే వస్తారు. అయితే టీమిండియా సారథి విరాట్ కోహ్లి మాత్రం ఇందుకు భిన్నమట. ఒక్కసారి అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాక ఇక మ్యాచ్‌ల వైపు కన్నెత్తయినా చూడనని అంటున్నాడు. ఆసీస్‌తో వన్డే సిరీస్ శనివారం నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోహ్లి పాల్గొని మాట్లాడాడు. అక్కడి మీడియా అడిగిన ప్రశ్నకు ఈవిధంగా సమాధానమిచ్చాడు. 'అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించాక మైదానం వైపు కన్నెత్తయినా చూడను. వీడ్కోలు పలికాక లీగ్ టోర్నీలు ఆడటానికి నాకు ఆసక్తి లేదు. ఇప్పటివరకు నేను సరిపడా క్రికెట్ ఆడేశాను. గత ఐదేళ్లలో నేను ఆడాలనుకున్న దానికంటే ఎక్కువే ఆడాను. ఇక రాబోయే మ్యాచ్‌లను బాగానే ఆడతాను. ఇప్పుడు ఇంతకంటే ఎక్కువగా ఏం మాట్లాడలేను. వీడ్కోలు పలికాక మాత్రం ఇక బ్యాట్ ఎత్తుకోను' అని తెలిపాడు. టీమిండియా గురించి మాట్లాడుతూ..'వన్డే ఫార్మేట్లో టీమిండియా బ్యాటింగ్ దృఢంగా ఉంది. జట్టులో ఎంతో మంది ప్రతిభావంతులున్నారు. ఇక మిడిలార్డర్ సమస్య ఉన్నట్లు ఒకప్పట్లో అనిపించినా ఇప్పుడు దాన్ని క్రమంగా అధిగమించాం. మిడిల్ ఓవర్లలో అంటే 25-40 ఓవర్ల మధ్య బ్యాటింగ్ స్టైల్ మార్చాలని నిర్ణయించుకున్నాం. టీమిండియా బౌలింగ్ కూడా పటిష్ఠంగానే ఉంది. ఆసీస్‌తో టెస్టు సిరీస్‌లో బౌలర్లే కీలక పాత్ర వహించారు. ప్రస్తుతం వన్డే జట్టు సరైన ట్రాక్‌లో ఉంది' అని చెప్పుకొచ్చాడు.

వేటు పడింది..!



న్యూఢిల్లీ: టీమిండియా యువ ఆటగాళ్లు కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యపై వేటు పడింది. టీవీ షోలో మహిళలపై చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో వారిద్దరినీ శుక్రవారం సస్పెండ్ చేశారు. తదుపరి చర్యలు తీసుకొనేందుకు దర్యాప్తు చేపట్టనున్నామని క్రికెట్ పాలకుల కమిటీ చైర్మన్ వినోద్ రాయ్ తెలిపారు. ఆస్ట్రేలియాతో వన్డే జట్టులో వీరు సభ్యులైనా.. సస్పెన్షన్‌కు గురవ్వడంతో తిరిగి భారత్‌కు బయలుదేరనున్నారు. వీరిపై రెండు మ్యాచ్‌ల నిషేధం విధించాలని సీఓఏ సభ్యురాలు డయానా ఎడుల్జి సూచించారు. విషయాన్ని బీసీసీఐ న్యాయ కమిటీ అభిప్రాయం కోరింది. అయితే వారి వ్యాఖ్యలు బీసీసీఐ నిబంధనల ఉల్లంఘన పరిధిలోకి రావని చెప్పడంతో ఇద్దరు ఆటగాళ్లను ప్రస్తుతానికి సస్పెండ్ చేసి విచారణ చేపట్టనున్నారు. అంతకు ముందు బీసీసీఐ సీఈవో రాహుల్ జోహ్రీపై 'మీటూ' ఆరోపణలు రావడంతో అతడిని సెలవుపై పంపించారు. విచారణ పూర్తైన తర్వాత తిరిగి బాధ్యతలు చేపట్టారు. రాహుల్, హార్దిక్ పాండ్యకు మళ్లీ కొత్తగా షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. దర్యాప్తును చేపట్టేది బీసీసీఐ అంతర్గత కమిటీనా లేక వేరెవరైనానా అనేది ఇంకా నిర్ణయించలేదు. ఆ ఇద్దరు ఆటగాళ్లను జట్టుతో పాటే ఆస్ట్రేలియాలోనే ఉంచాలని అనుకున్నా బీసీసీఐలోని చాలామంది అధికారులు ఈ ఆలోచనను వ్యతిరేకించారని ఓ అధికారి వెల్లడించారు. సస్పెండైన ఆటగాళ్ల స్థానంలో రిషబ్ పంత్, మనీశ్ పాండే లేక విజయ్ శంకర్, శ్రేయస్ అయ్యర్ ఆస్ట్రేలియా వెళ్లే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది.

ఆసీస్‌ను తక్కువ అంచనా వేయద్దు



ముంబై: ఆసీస్‌తో జగబోయే మూడు వన్డేల సిరీస్ కోసం కోహ్లిసేన తీవ్రంగా సాధన చేయాలని మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే అభిప్రాయపడ్డాడు. ఆ జట్టును తక్కువ అంచనా వేయొద్దని సూచించాడు. ఆసీస్‌తో మూడు వన్డేల సిరీస్ శనివారం నుంచి ప్రారంభం కానుంది.'చారిత్రక టెస్టు సిరీస్‌ను గెలిచిన కోహ్లిసేనపై మరో బాధ్యత కూడా ఉంది. ఆస్ట్రేలియా జట్టు ఇప్పుడు బలహీనంగా ఉంది. అలాగని వారిని తేలిగ్గా తీసుకోలేం. మనం చేసే ప్రయత్నం మనం చేయాలి. వన్డేలకు ఇంకాస్త సమయం దొరికితే బాగుండేది. అంతేకాకుండా క్రీజులో కుదురుకోవడానికి కొంత సమయం తీసుకునే ఆటగాళ్లు కూడా జట్టులో ఉన్నారు. అలాగని వారిని, వారి ప్రతిభను తక్కువ అంచనా వేయలేం. ప్రత్యర్థి జట్టు బలహీనంగా ఉందని తక్కువగా అంచనా వేస్తే మనం బలం కోల్పోయే ప్రమాదం ఉంది. ఇక ఆటగాళ్ల విషయానికొస్తే రిషబ్‌పంత్‌ను మూడు ఫార్మాట్లలోనూ తీసుకోవాలి. ఇప్పుడు కోహ్లిసేన వేసే ప్రతి అడుగు ముఖ్యమైనదే. ప్రతి మ్యాచ్ ప్రపంచకప్‌కు ఉపయోగపడుతుంది' అని కుంబ్లే అన్నాడు.

ధోనీ సామర్థ్యాలు గురించి తెలీదా?

'మహేంద్ర సింగ్ ధోనీ విషయంలో ఇప్పటికీ కొందరికి కొన్ని అనుమానాలున్నాయి. కొన్ని మ్యాచ్‌ల్లో విఫలమైనంత మాత్రాన అతడి ప్రతిభను పూర్తిగా పక్కన పెట్టి మాట్లాడటం సరికాదు. ప్రపంచ కప్‌లో ధోనీకి స్థానం ఉంటుందని ఆశిస్తున్నా. ఇదే మాట కొద్ది రోజుల క్రితం చెప్పాను. ఇప్పుడూ చెప్తున్నా. ధోనీ సామర్థ్యం గురించి అందరికీ తెలుసు. దేశానికి ప్రపంచకప్ సాధించి పెట్టిన ఘనత తనది. ధోనీ మీద విమర్శలు చేయడం కూడా మానుకోవాలి' అని కుంబ్లే అన్నాడు.

ఆస్ట్రేలియా ఓపెనే ఆఖరు



మెల్‌బోర్న్: ప్రముఖ బ్రిటన్ టెన్నిస్ ఆటగాడు, మాజీ నెంబర్ వన్ ఆండీ ముర్రే త్వరలో జరుగనున్న ఆస్ట్రేలియా ఓపెన్ తరువాత రిటైర్ కానున్నట్లు ప్రకటించాడు. మీడియాతో మాట్లాడుతూ 'తుంటి గాయం కారణంగా నా ఆటను ఆస్వాదించలేకపోతున్నా. నొప్పితో ఇక ఆడ లేను. నా దేశ ప్రజల ముందు వింబుల్డెన్ తరువాత వీడ్కోలు ఇవ్వాలని అనుకున్నా, కానీ అంత వరకూ చేరు కోలేనని తెలుసప్తోంది. చాలా కాలంగా బాధపడుతున్నా. ఇలాగే ఇంకో నాలుగు ఐదు నెలలు కొనసాగలేను. ఆస్ట్రేలియా ఓపెనే నా చివరి అవకాశంగా భావిస్తున్నా. నేను ఆడగలను, కానీ సంతోషంగా లేకుండా ఆడలేను' అని కన్నీళ్లు పెట్టుకుంటూ తెలిపాడు. నవ టెన్నిస్ యు గంలో ఫెదరర్, నాదల్, జోకోవిచ్‌లతో పాటూ ముర్రే కూడా దిగ్గజ ఆటగాడిగా వెలుగొందాడు. 77 ఏళ్ల తరు వాత వింబుల్డెన్ నెగ్గిన బ్రిటన్ ఆటగాడిగా చరిత్రలో నిలిచిపోయాడు. ముర్రే కెరీర్‌లో మూడు గ్రాండ్ స్లాం టైటిళ్లు ఉన్నాయి. ఈనెల 14 నుంచి జరుగనున్న ఆస్ట్రే లియా ఓపెన్‌లో అన్ సీడెడ్‌గా బరిలో దిగనున్న ముర్రే తొలి మ్యాచ్‌లో 22వ సీడ్ బటిస్టా అగట్‌తో తలపడనున్నాడు.

ఉత్కంఠగా బాల్ బ్యాడ్మింటన్ పోటీలు



విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: స్థానిక సిద్ధార్థ మహిళా కళాశాలలో నిర్వహిస్తున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల బాల్ బాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో కృష్ణ విశ్వవిద్యాలయం జట్టు, కాలికట్, కేరళ, భారతీయార్ విశ్వవిద్యాలయాల జట్లు ప్రీ క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించాయి. కాలికట్ విశ్వవిద్యాలయం, కారుణ్య విశ్వవిద్యాలయం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ఉత్కంఠంగా సాగింది. ఈ మ్యాచ్‌లో కాలికట్ జట్టు 36-34, 35-31 స్కోరు తేడాతో కారుణ్య విశ్వవిద్యాలయం జట్టుపై విజయం సాధించింది. సూర్యలక్ష్మి, మినుథామస్‌లు ప్రతిభకనబరచి జట్టు విజయానికి దోహదపడ్డారు. కారుణ్య విశ్వవిద్యాలయం జట్టులో ఐశ్వర్య ఆల్‌రౌండర్‌గా రాణించినప్పటికీ ఓటమిని అడ్డుకోలేకపోయింది. మరో మ్యాచ్‌లో కృష్ణ విశ్వవిద్యాలయం జట్టు 35-31, 35-26 స్కోరు తేడాతో భారతీదాసన్ విశ్వవిద్యాలయం జట్టుపై గెలుపొందింది. కృష్ణ విశ్వవిద్యాలయం జట్టులో రెహానా బేగం ఆల్‌రౌండర్‌గా, సత్య జానకి ఆఫన్స్‌లో రాణించి జట్టు విజయానికి కారకులయ్యారు. భారతీయార్ విశ్వవిద్యాలయం జట్టు 35-16, 35-15 స్కోరు తేడాతో తిరువల్లువార్ జట్టుపై సునాయాసంగా నెగ్గింది. కేరళ విశ్వవిద్యాలయం జట్టు 35-21, 25-13 స్కోరు తేడాతో బెంగళూరు విశ్వవిద్యాలయం జట్టుపై నెగ్గి విజయం సాధించి ప్రీ క్వార్టర్ ఫైనల్ పోటీలకు అర్హత సాధించింది. పోటీలో నిర్వాహకులు స్టార్ ఆఫ్ ఇండియా సీహెచ్ ఆశాజ్యోతిని శాలువా, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఆశాజ్యోతి 10 సార్లు జాతీయస్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని పలుపథకాలను రాష్ట్రానికి అందించింది. అంతేకాకుండా రెండుసార్లు అవార్డులు అందుకుంది. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ యోగ మరియు సమన్వయకర్త రవీంద్ర పోటీలకు హాజరై క్రీడాకారులను అభినందించారు.

ఫిబ్రవరి 27న భారత్-ఆసీస్ మ్యాచ్

మళ్లీ విశాఖలో క్రికెట్ సందడి

విశాలాంధ్ర-విశాఖ సిటీబ్యూరో : భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరగనున్న టీ 20 మ్యాచ్‌కు విశాఖ ఆతిథ్యమివ్వనుంది. ఫిబ్రవరి 27న జరిగే ఈ మ్యాచ్‌కు పోతిన మల్లయ్యపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదిక కానుంది. స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరిగే టీ 20, వన్డే సిరీస్‌కు సంబంధించిన అధికారిక షెడ్యూల్‌ను బీసీసీఐ విడుదల చేసింది.

విశాఖలో మూడో ఇంటర్నేషనల్ టీ20 మ్యాచ్....

గత ఏడాది అక్టోబరు 24న భారత్, వెస్టిండీస్ మధ్య జరిగిన వన్డే మ్యాచ్‌కు ఆతిథ్యమిచ్చిన విశాఖకు ఈ ఏడాది ప్రారంభంలోనే ఫిబ్రవరి 27న ఆస్ట్రేలియా, భారత్ మధ్య ఇంటర్నేషనల్ టీ20 మ్యాచ్ నిర్వహణకు అవకాశం రావడం విశేషం. ఈ మ్యాచ్‌కు వేదికగా నిలుస్తున్న ఏసీఏ-వీడీసీఏ స్టేడియానికి ఇప్పటి వరకు రెండు టీ20 మ్యాచ్‌లు కేటాయించగా సెప్టెంబరు 8, 2012లో భారత్, న్యూజిలాండ్ మధ్య జరగాల్సిన టీ20 మ్యాచ్ భారీ వర్షం కారణంగా రద్దయ్యింది. 2016 ఫిబ్రవరి 14న శ్రీలంకతో జరిగిన టీ20 మ్యాచ్‌లో భారత్ తొమ్మిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ నేపథ్యంలో సుమారు మూడేళ్ల తర్వాత మరోసారి అంతర్జాతీయ 20 మ్యాచ్ విశాఖలో జరగడం గమనించదగ్గ విషయం.



ముగిసిన బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

విశాలాంధ్ర-నెల్లూరు(సిటీ): 64వ జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రా క్రీడాకారులు పాల్గొన్నారు. ఫైనల్లో బాలికల విభాగంలో అండర్-14లో తమిళనాడు జట్టు ప్రథమస్థానం, ఆంధ్రప్రదేశ్ రెండో స్థానం, బీహార్ మూడోస్థానం, మహారాష్ట్ర నాలుగోస్థానం, అండర్ -17లో తమిళనాడు మొదటిస్థానం, కేరళ రెండో స్థానం, కర్ణాటక మూడో స్థానం, ఆంధ్రప్రదేశ్ నాల్గోస్థానంలో నిలిచాయి. అండర్ -19లో ప్రథమస్థానం కర్ణాటక, రెండోస్థానం తమిళనాడు, మూడో స్థానం ఆంధ్రప్రదేశ్, నాల్గోస్థానం కేరళ సాధించాయి. బాలుర విభాగంలో అండర్ -14లో ప్రథమస్థానం ఆంధ్రప్రదేశ్, రెండోస్థానం తమిళనాడు, మూడో స్థానం మహారాష్ట్ర, నాలుగు తెలంగాణ, అండర్ -17లో మొదటి స్థానం ఆంధ్రప్రదేశ్, రెండు తమిళనాడు, మూడు కేరళ, నాలుగు తెలంగాణ, అండర్ -19లో ప్రథమస్థానం ఆంధ్రప్రదేశ్, ద్వితీయస్థానం తమిళనాడు, తృతీయస్థానం కర్ణాటక, నాల్గోస్థానం తెలంగాణ జట్లు కైవసం చేసుకున్నాయి



'ఆ నలుగురు' కాదు...

500మంది

కన్నీరు పెట్టిన గ్రామస్తులు

రాయ్‌పూర్: మనిషి చనిపోతే కుటుంబీకులు, బంధువులే రాని రోజులు. అటువంటిది చత్తీస్‌గఢ్‌లో ఓ మొసలి అంత్యక్రియలకు సుమారు ఐదువందలకు మందికి పైగా గ్రామస్తులు హాజరయ్యారు. వివరాల్లో కెళితే...ఛత్తీస్‌ఘడ్‌లోని భవమోహత్ర గ్రామంలో మొసలికి అంత్యక్రియలు చేశారు. తాము ప్రేమగా చూసుకునే గంగారాం(మొసలి) మరణించడంతో గ్రామస్తులంతా స్థానిక చెరువు వద్దకు చేరుకుని శోకించారు. అనంతరం ఆ మొసలిని ఖననం చేశారు. దీనిపై గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ... తమ పిల్లలు ఆ చెరువులో మొసలితో పాటే ఈత కొట్టేవారనీ, కానీ ఏనాడు అది తమ పిల్లలకు ఎటువంటి హానీ చేయలేదని తెలిపారు. తాము మొసలిని ఒక స్నేహితునిలా చూసేవాళ్లమన్నారు. కాగా ఈ మొసలి వయసు 130 ఏళ్లు ఉంటాయని అటవీ అధికారులు తెలిపారు. ఈ మొసలికి గ్రామస్తులతో మంచి అనుబంధం ఉందని పేర్కొన్నారు. అందుకే పోస్టుమార్టమ్ అనంతరం మొసలిని గ్రామస్తులకు అప్పగించామని వివరించారు.

రైతులకు యూపీ సర్కారు ఊరట

లక్నో: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న తరుణంలో రైతులకు ఊరటనిచ్చే నిర్ణయాన్ని ఉత్తర్‌ప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు పంట ఎరువుల్లో యూరియా ధరను పది శాతం తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. వివిధ కారణాల వల్ల ఇతర రాష్ట్రాలకన్నా ఉత్తర్‌ప్రదేశ్‌లో యూరియా ధర ఎక్కువగా ఉంటుంది. ఈ ధరను తగ్గించాలని దీర్ఘకాలికంగా రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎరువుల ధరలు తగ్గించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తగ్గించిన ధరలు శనివారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి రానున్నట్లు ప్రభుత్వ అధికార ప్రతినిధి శుక్రవారం వెల్లడించారు. అయితే ఈ నిర్ణయంపై విపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి.

సొంతిటి కల కల్లేనా.?

జల్లి విల్సన్, ఆవుల శేఖర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అధికారంలోకి రాగానే పేదలకు సొంతిటి కల నెరవేరుస్తా మంటూ చంద్రబాబు, మోడీ ఇచ్చిన హామీలను గాలికొదిలేశారని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జల్లి విల్సన్, ఆవుల శేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో విమర్శిం చారు. టీడీపీ, బీజేపీ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి నాలుగు స్నరేళ్లయినా పేదలకు ఇచ్చిన హామీల్ని నెరవేర్చకుండా, మోసగిం చారని దుయ్యబట్టారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో 20లక్షల ఇళ్ల నిర్మాణం చేస్తామంటూ సీఎం అసత్య ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఇది రాబోయే ఎన్నికల్లో లబ్ధికోసమేనని, పేదలపై ప్రేమ కాదని స్పష్టం చేశారు. కేవలం మూడ్నెళ్ల కాలంలో లక్షలాది ఇళ్లను ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. చంద్రబాబు హామీ లను నమ్మి..దళితులు, కౌలుదారులు, చేతివృత్తిదారులు మోసపో వద్దని, రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు.

ఆదాయపన్ను పరిమితి రూ.8లక్షలకు పెంచాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు విద్యా, ఉద్యోగాల్లో ఆదాయ పన్ను పరిమితిని రూ.8 లక్షలకు ప్రభుత్వం పెంచాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.జోసఫ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు విద్యా, ఉద్యోగాల్లో 10శాతం రిజర్వేషన్లు పొందడానికి ఆదాయ పరిమితిని రూ.8లక్షలకు వర్తింపజేసిన నేపథ్యంలో ఉద్యోగులకు రెండున్నర లక్షల రూపాయిల నుంచి రూ.8లక్షల వరకూ ఆదాయ పన్ను పరిమితిని పెంచాలని పేర్కొన్నారు.

ఆటోలకు జీవితకాల పన్ను రద్దు

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 4.6 లక్షల మంది ఆటో ఓనర్లు, డ్రైవర్లకు చెందిన ఆటోలకు జీవితకాల పన్ను విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఏఐటీయూసీ అనుబంధం ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి, గౌరవాధ్యక్షుడు సీహెచ్‌వీ రామారావు తెలిపారు. ఈమేరకు శుక్రవారం వారు సంయుక్తంగా ప్రకటన చేశారు. ఈనెల 11వ తేదీ నుంచి జూన్ ఒకటో తేదీ వరకూ ఆటోలకు లైఫ్ టాక్స్‌ను నిలిపివేయాలని, వీలైనంత త్వరగా ఆటోల రోడ్డు టాక్స్‌ను పూర్తిగా రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిం దన్నారు. రవాణాశాఖ అధికారులు సీజ్ చేసిన ఆటోలకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా బేషరతుగా విడుదల చేసేందుకు కూడా అంగీకరించిందన్నారు. లైఫ్‌టాక్స్‌ను రద్దు చేసే జీవో త్వరలోనే విడుదల కానుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, రవాణాశాఖమంత్రి అచ్చెన్నాయుడు, రవాణాశాఖ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యంలకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

జర్నలిస్టు హత్య కేసులో డేరా బాబా దోషే



పంచకుల: జర్నలిస్టు హత్య కేసులో డేరా బాబా గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌ను దోషిగా తేలుస్తూ పంచకుల సీబీఐ న్యాయస్థానం శుక్రవారం తీర్పునిచ్చింది. గుర్మీత్‌తో పాటు మరో ముగ్గురిని దోషులుగా నిర్ధారిస్తూ సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి జగ్దీప్ సింగ్ తీర్పునిచ్చారు. దోషులకు జనవరి 17న శిక్షలు ఖరారు చేయనున్నారు. 2002లో సిర్సాకు చెందిన జర్నలిస్టు రాంచందర్ ఛత్రపతిని హత్య చేసినందుకు గాను గుర్మీత్‌పై కేసు నమోదైంది. తీర్పు నేపథ్యంలో పంచకుల, హర్యానా ప్రాంతాల్లో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చేపట్టారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ కేసు విచారణకు దోషులుగా తేలిన ముగ్గురు వ్యక్తులు న్యాయస్థానానికి హాజరయ్యారు. కాగా గుర్మీత్ జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యాడు. ప్రస్తుతం గుర్మీత్ అత్యాచారం కేసులో 20ఏళ్ల జైలు శిక్షను అనుభవిస్తున్నాడు. హర్యానాలోని రోహ్‌తక్ సునారియా జైల్లో ఖైదీగా ఉన్నాడు. అత్యాచార కేసు తీర్పు సమయంలో పంచకులలో పెద్ద ఎత్తున అల్లర్లు చోటు చేసుకొని 40 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పంచకులతో పాటు పలు ప్రాంతాల్లో శుక్రవారం గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

అసలు కేసు ఏమిటంటే..

డేరా ఆశ్రమంలో గుర్మీత్ చేస్తున్న అకృత్యాలను 'పూరా సచ్' వార్తాపత్రికకు చెందిన జర్నలిస్టు రాంచందర్ ఛత్రపతి వెలుగులోకి తీసుకొచ్చారు. ఆశ్రమానికి వచ్చిన మహిళలను లైంగికంగా వేధిస్తూ, వారిపై అత్యాచారాలకు ఒడిగడుతున్నట్లు ఛత్రపతి వార్తలు రాసుకొచ్చాడు. దీంతో అక్టోబరు 24, 2002న ఛత్రపతిని ఆయన ఇంట్లోనే దారుణంగా కాల్చి చంపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా గుర్మీత్‌తో పాటు ఆయన అనుచరులు కుల్దీప్‌సింగ్, నిర్మల్ సింగ్ ఉన్నారు. కృషన్‌లాల్‌కు చెందిన రివాల్వర్‌తో కుల్దీప్, నిర్మల్.. జర్నలిస్టును హత్య చేశారు. 2003లో వీరందరిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణను 2006లో సీబీఐ చేతికి అప్పగించారు. అప్పటి నుంచి కొనసాగిన ఈ కేసు విచారణలో నేడు తుది తీర్పు వెలువడింది. ఈ కేసు విచారించిన న్యాయస్థానం గుర్మీత్‌తో పాటు కుల్దీప్, నిర్మల్, కృషన్‌ను దోషులుగా తేల్చింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.